ఆదివారం
గత వారంలోని బెస్ట్ స్టోరీస్

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం



నేటి మీ కపిల్‌చిట్స్ తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం



: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-12-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 314 పేజీలు: 8+4 వెల: 6.50


# మహిళా సాధికారతే లక్ష్యం

**లక్ష మందిని మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం**

**డ్వాక్రా సంఘాలకు రెండు పథకాలు**

**ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, కల్యాణ లక్ష్మి పథకాలనూ అమలు చేస్తాం: సిఎం చంద్రబాబు**



**విజయవాడ, డిసెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో లక్ష మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సిఎం చంద్రబాబు వెల్లడించారు. పూర్తి స్థాయిలో ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను బలోపేతం చేశాం. డ్వాక్రా మహిళలు పెద్ద ఎత్తున డబ్బులను పొదుపు చేస్తున్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని తిరిగి పూర్తి స్థాయిలో చెల్లించేస్తున్నారు. డ్వాక్రా మహిళల్లో కేవలం 1 శాతం మాత్రమే ఎన్పీఎలు ఉన్నారంటే మహిళా శక్తి ఏంటో అర్థం చేసుకోండన్నారు. చాలా పరిశ్రమలు, చాలా మంది అప్పులు తీసుకుని ఎన్పీఎలుగా మారుతున్నారు. డ్వాక్రా సంఘాలు మాత్రం తీసుకున్న అప్పులను నిఖార్సుగా తిరిగి చెల్లిస్తున్నారు. లక్ష మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 'ఎక్స్' వేదికగా మహిళల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించారు. మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలి. ప్రతి ఎమ్మెల్యే 1000 మంది మహిళలను గుర్తించి పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేలా కృషి చేయాలన్నదే ప్రభుత్వం యోజన అన్నారు. మహిళా ఆర్థిక స్వావలంభన దిశగా కూటమి ప్రభుత్వం మరో అడుగు వేసిందన్నారు. డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల పిల్లల చదువుకు అండగా నిలిచేందుకు ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఆడబిడ్డల వివాహాలకు చేయూత నిచ్చేలా ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి పథకాలను అమల్లోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ రెండు పథకాల కింద గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ (సెర్ప్) పరిధిలోని స్త్రీనిధి బ్యాంకు ద్వారా రూ.లక్ష వరకు పావలా వడ్డీకి రుణంగా ఇస్తారన్నారు.

ఇందుకు ఇప్పటికే కార్యచరణ ప్రారంభించామన్నారు. గత వారంలోనే ఈ పథకాల్ని ప్రారంభించాల్సి ఉండగా, అనివార్య కారణాలతో వాయిదా పడింది. మరో పది రోజుల్లో ఈ పథకాలు అమల్లోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇక గరిష్ఠంగా ఇద్దరు పిల్లల చదువులకు ఎన్టీఆర్ విద్యాలక్ష్మి పథకం వర్తిస్తుంది. రూ.10 వేలనుంచి రూ.లక్షవరకు రుణసాయం అందిస్తారు. పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలకు చెల్లించాల్సిన ఫీజుకు అనుగుణంగా అవసరమైన మొత్తాన్ని తీసుకోవచ్చు. దీనికోసం పావలా వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. తీసుకున్న మొత్తానికి అనుగుణంగా చెల్లింపు వాయిదాల సంఖ్య నిర్ణయి >>2



ఆదివారం న్యూఢిల్లీలోని రామలీలా మైదాన్‌లో జరిగిన బహిరంగసభలో కాంగ్రెస్ అగ్రనేతలు, ఖర్గే, రాహుల్ సోనియా

**ఢిల్లీ రామ్‌లీలా మైదాన్ మహార్యాలీలో కాంగ్రెస్ నేతల గర్జన**

**బిజెపితో కుమ్మక్కవుతున్న ఇసి: రాహుల్**

**సత్యవాక్కులతోనే అవినీతి సర్కార్‌కు చరమగీతం: ఖర్గే**

## ఓటు చోరులను గద్దె దించుతాం

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** దేశంలో రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాల్సిన ఎన్నికల సంఘం బిజెపికి పనిచేస్తోందని, అధికార పార్టీతో కుమ్మక్కవుతోందని ఎఐసిసి నాయకుడు రాయ్‌బరేలి ఎంపి రాహుల్ గాంధీ ఆరోపించారు. ఓటర్ల జాబితాలో భారీ ఎత్తున బిజెపి అవకతవకలకు పాల్పడుతున్నా ఎన్నికల సంఘం పట్టించుకోవడంలేదని, ఆపార్టీ అవకతవకలన్నింటికీ గొడుగుపడుతోందని ఆరోపించారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్‌కుమార్, ఇతర ఎన్నికల కమిషనర్లు సుక్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషిలు కూడా బిజెపికోసమే పనిచేస్తున్నారని విమర్శించారు. వోట్‌చోర్ గద్దీఛోడ్‌నినాదంతో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన రామ్‌లీలామైదాన్ ర్యాలీలో ఎసిసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే ఇతర కాంగ్రెస్ సీనియర్లతోపాటు రాహుల్ పాల్గొని ఎన్డియె ప్రభుత్వంపై విమర్శలు సంధించారు. ర్యాలీ సభలో రాహుల్‌తోపాటుప్రియాంక గాందీ వాద్రా, కెసి వేణుగోపాల్, జైరామ్‌రమేష్, సచిన్‌పైలట్ ఇతర సీనియర్ నాయకులు పాల్గొనగా వేలాదిగా మద్దతుదారులు, కార్యకర్తలు పాల్గొ >>2

## పర్యాటక ఆస్తుల లీజుపై ప్రత్యేక కమిటీ

**ప్రైవేటుకు పలు ఆస్తుల నిర్వహణ**

**విజయవాడ, డిసెంబరు 14, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర పర్యాటకభివృద్ధి సంస్థకు చెందిన 22 హోటళ్లు, రిసార్టులు, ఇతర ఆస్థుల లీజుకు బిడ్‌ల మదింపు కోసం ప్రత్యేక కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండి ఈ కమిటీకి చైర్మన్‌గా రాష్ట్ర పర్యాటక సంస్థ సిఇఒ కో-చైర్మన్‌గా ఉంటారు. పర్యాటకాభివృద్ధి సంస్థ ఇడిని కన్వీనర్‌గా మరో ఐదుగురిని సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన ఆస్థుల నిర్వహణను లీజుపై ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. విశాఖలోని మధురవాడలో మెగ్లాన్ లీజర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థకు ఐదెకరాల భూమితో పాటు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకే ఉత్తర్వులిచ్చింది. ఈ సంస్థ రూ.348.12 >>2



## బిజెపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** భారతీయ జనతాపార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బీహార్‌మంత్రి నితిన్ నబీన్‌ను హైకమాండ్ నియమించింది. బిజెపి పార్లమెంటరీ బోర్డు ఈమేరకు >>2

## ప్రజాస్వామ్య విలువలకు ప్రతీక వాజ్‌పేయి

**దేశాన్ని సరైన దిశలో నడిపిన పిఎం: ఉత్తరాఖండ్ సిఎం పుష్కరసింగ్ ధామి**

**మదనపల్లె, డిసెంబరు 14 ప్రభాతవార్త:** దేశ రాజకీయాల్లో అటల్ బిహారీ వాజ్‌పేయి దూరదృష్టిగల పాలకునిగా, ప్రజాస్వామ్య విలువల ప్రతీకగా నిలిచారని ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్‌సింగ్‌ధామి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఆదివారం నిర్వహించిన భారతరత్న మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణకు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి ముఖ్య అతిధిగా హాజరై విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం టిప్పుసుల్తాన్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ అటల్‌జీ జీవితం దేశభక్తి, మానవీయ విలువలకు ప్రతిరూపమన్నారు. ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి కాని దేశం నిలబడాలి అనే అటల్‌జీ మాటలు యావత్తు భారతదేశానికి మార్గదర్శకం అన్నారు. ప్రధాన మంత్రిగా వాజ్‌పేయి దేశాన్ని >>2



ఆదివారం మదనపల్లెలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్‌సింగ్ ధామి


MARUTI SUZUKI ARENA

ధన్యవాదాలు భారతదేశం!
ఇప్పుడు మా సంఖ్య 3 కోట్లకు చేరుకుంది ఇంకా నిరంతరంగా పెరుగుతోంది.
ప్రత్యేక ఆఫర్లతో కలిసి జరుపుకుందాం!




EFFECTIVE PRICE OF ₹3.17 LAKH
EFFECTIVE PRICE OF ₹2.97 LAKH
EFFECTIVE PRICE OF ₹4.35 LAKH
EFFECTIVE PRICE OF ₹4.12 LAKH

ARENA SAFETY SHIELD
Offers Valid Till Stocks Last
SCAN TO CONNECT TO SHOWROOM NEAR YOU
E-BOOK TODAY AT WWW.MARUTISUZUKI.COM
Contact us at 1800-102-1800

Terms and conditions apply. Please contact your nearest dealership for details. Features, accessories, and specifications may vary by variant and are subject to change without prior notice. Images are for illustration purposes only. Offers and prices may differ by variant, model, location, and city, and are subject to change or withdrawal without notice. Offer values represent the maximum applicable benefits and include consumer, exchange, and institutional/fleet offers (where applicable) on select models. The effective price for Alto K10 of ₹3.17 Lakh has been calculated after deducting the applicable consumer offer of ₹25 000, exchange/scrappage bonus of ₹25 000, and rural/ISL offer of ₹2 500 from the ex-showroom price of ₹3.69 Lakh. The effective price for S-presso of ₹2.97 Lakh has been calculated after deducting the applicable consumer offer of ₹25 000, exchange/scrappage bonus of ₹25 000, and rural/ISL offer of ₹2 500 from the ex-showroom price of ₹3.49 Lakh. The effective price for WagonR of ₹4.35 Lakh has been calculated after deducting the applicable consumer offer of ₹35 000, exchange/scrappage bonus of ₹25 000, and rural/ISL offer of ₹3 100 from the ex-showroom price of ₹4.98 Lakh. The effective price for Celerio of ₹4.12 Lakh has been calculated after deducting the applicable consumer offer of ₹30 000, exchange/scrappage bonus of ₹25 000, and rural/ISL offer of ₹2 500 from the ex-showroom price of ₹4.69 Lakh. 3 Crore sales is for entire Maruti Suzuki portfolio.



ముంబయిలో 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్' అవార్డును అందుకుంటున్న నారా బ్రహ్మణి

# కేంద్ర సమాచార కమిషనర్‌గా సుధారాణి రేలంగి

**విజయవాడ, డిసెంబరు14,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర సమాచార కమిషనర్‌గా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుధారాణి రేలంగి నియమితులయ్యారు. ప్రస్తుతం పెట్రోలియం సహజవాయువుల రెగ్యులేటరీ బోర్డు సభ్యురాలిగా ఉన్న ఆమెను సమాచార కమిషనర్‌గా నియమిస్తూ నియమిస్తూ ప్రధానమంత్రి అధ్వర్యంలోని నియామక కమిటీ సిఫార్సు చేసింది. ఇండియన్ లీగల్ సర్వీస్ అధికారి అయిన ఈమెకు లా ఎన్‌ఫోర్స్‌మెంట్ లెజిస్లేటివ్ డ్రాఫ్టింగ్,ప్రాసిక్యూషన్,ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ విభాగంలో 35 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉంది. ఇది వరకు సిబిఐలో ప్రాసిక్యూషన్ డైరెక్టర్‌గా,కేంద్ర న్యాయశాఖలో జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్‌లో జడ్జి అటార్నీ జనరల్‌గానూ సేవలందించారు. ఈమె స్వస్థలం ఏలూరు. పాఠశాల విద్య నుంచి డిగ్రీ వరకు ఏలూరులోని సెయింట్ థెరిస్సా విద్యాలయంలో చదివారు. సిఆర్ఆర్ కళాశాలలో లా డిగ్రీ పూర్తి చేశారు. లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అండ్ ఫైనాన్స్ నుంచి ఇంటర్నేషనల్ బిజినెస్‌లాలో ఎల్ఎల్ఎం చేశారు. 2003 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ఆ తర్వాత ఇండియన్ లీగల్ సర్వీస్‌కు ఎంపికయ్యారు. తెలుగువారైన ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ 2013 నవంబరు నుంచి 2018 నవంబరు వరకు కేంద్ర సమాచార కమిషనర్‌గా సేవలందించారు. ఆ తర్వాత ఇప్పుడు సుధారాణి రేలంగి నియమితులయ్యారు.



ఆదివారం విజయనగరంలో అశోక్ గజపతిరాజుని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

# నారా బ్రహ్మణికి మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్ అవార్డు

**విజయవాడ,డిసెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** మంత్రి నారా లోకేశ్ సతీమణి, హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రహ్మణి అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. ప్రముఖ వ్యాపార మ్యాగజైన్ బిజినెస్ టుడే ఏటా ప్రకటించే మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్ పురస్కారం ఆమెను వరించింది. వ్యాపార రంగంలో మహిళల నాయకత్వ పటిమను, సంస్థల అభివృద్ధిలో వారి పాత్రను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేస్తారు. హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ విస్తరణ, బ్రాండ్ విలువను పెంచడం, రైతులతో అనుసంధానం కావడం వంటి అంశాల్లో బ్రహ్మణి తనదైన ముద్ర వేశారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంటూ, ఆధునిక సాంకేతికతను జోడిస్తూ సంస్థ పురోగతిలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ కృషికి గుర్తింపుగానే ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కింది.

## భర్తగా గర్వపడుతున్నానన్న మంత్రి లోకేశ్

ఈ విజయంపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా తన భార్యను అభినందిస్తూ పోస్ట్ పెట్టారు. "భర్తగా గర్విస్తున్నాను. మాటల కన్నా పనితోనే సమాధానం చెప్పడం, నిశ్శబ్దంగా సంస్థలను నిర్మించడం బ్రాహ్మణి నాయకత్వ పటిమకు నిదర్శనం" అని ఆయన ప్రశంసించారు. కుటుంబ, వ్యాపార బాధ్యతలను సమర్థంగా సమన్వయం చేస్తూ నారా బ్రహ్మణి ఎందరో మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పురస్కారం ఆమె వ్యక్తిగత విజయమే కాకుండా, హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేసింది.

# మహిళా సాధికారతే లక్ష్యం

>> స్తారు. గరిష్ఠంగా 48 వాయిదాల్లో మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. అడ్మిషన్ లెటర్, ఫీజు చెల్లింపు విధానం, ఇన్‌స్టిట్యూట్ వివరాలు, రసీదును సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో సభ్యురాలి బ్యాంకు ఖాతాలో నేరుగా నగదు జమ చేస్తారు. ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి పథకానికి కూడా కొన్ని నిబంధనలు ఉన్నాయి. డ్వాక్రా సభ్యురాలి కుమార్తె వివాహానికి ఈ పథకం వర్తిస్తుంది. అవసరానికి అనుగుణంగా 10 వేల నుంచి లక్ష వరకు రుణంగా తీసుకునే వెసులుబాటుఉంది. దీనికికూడా పావలా వడ్డీయే చెల్లించాల్సి ఉంటుంది. తీసుకున్న మొత్తానికి అనుగుణంగా చెల్లింపు వాయిదాల సంఖ్య ఉంటుంది. గరిష్ఠంగా 48 వాయిదాల్లో చెల్లించాలి. పెళ్లి పత్రిక, ఈవెంట్ నిర్వహణకు సంబంధించిన పత్రం, పెళ్లి ఖర్చు అంచనా వ్యయం పత్రాలను సమర్పించాలి. వివాహానికి సంబంధించిన వివరాల పరిశీలన అనంతరం నేరుగా సభ్యురాలి బ్యాంకు ఖాతాలో నగదు జమచేస్తారు. ఈ పథకాల అమలు ద్వారా పావలా వడ్డీ కింద వచ్చే ఆదాయంలో 50 శాతాన్ని తిరిగి డ్వాక్రా సంఘాలకు ఊపిరిగా ఉన్న మండల సమాఖ్యలు, గ్రామ సమాఖ్యల బలోపేతం చేసేందుకు వినియోగించనున్నారు. మిగతా 50 మొత్తాన్ని 'స్త్రీనిధి' ఉద్యోగుల ప్రయోజనాలకు ఉపయోగించనున్నారు. ఈ పథకాల కింద రుణసాయం పొందిన తర్వాత సదరు సభ్యురాలు ప్రమాదంలో చనిపోతే, ఆ రుణ మొత్తాన్ని మాఫీ చేస్తారు మరో పక్క డ్వాక్రా మహిళల పిల్లల చదువులకు భరోసానిచ్చేలా కూటమి ప్రభుత్వం కొత్త పథకానికి రూపకల్పన చేసింది. పిల్లల విద్యావికాసానికి దోహదపడేందుకు 4శాతం వడ్డీకే రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. పథకానికి ఎన్టీఆర్ విద్యా సంకల్పంగా నామకరణం చేసిన ప్రభుత్వం ఏటా 200 కోట్లు ఖర్చు చేసేలా ప్రతిపాదనలను సిద్ధం చేసింది.

డ్వాక్రా మహిళలకు చేయూతనిచ్చేలా కూటమి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. వాళ్ల పిల్లల చదువులకు చేయూతనిచ్చేలా 4 శాతం అంటే 35 పైసల వడ్డీకే రుణాలు అందించేలా కొత్త పథకానికి రూపకల్పన సిద్ధం చేసింది. ఈ పథకం కింద గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటిసెర్ప్ పరిధిలోని స్త్రీనిధి బ్యాంకు ద్వారా 10వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణం అందించనున్నారు. స్త్రీనిధి నుంచి రుణంగా తీసుకునే మొత్తాన్ని పిల్లల చదువుకే వినియోగించాలి. వారి ఫీజుచెల్లింపులు, పుస్తకాలు, యూనిఫామ్ వంటి వాటి కొనుగోలుకు వెచ్చించవచ్చు. సాంకేతికవిద్యలో అవసరాలకు ఖర్చు చేసేందుకు అవకాశం ఉంటుంది. నివాస ప్రాంతం నుంచి దూరంగా ఉండే పాఠశాలలకు వెళ్లేందుకు సైకిళ్ల కొనుగోలుకు అనుమతిస్తారు. రుణం మొత్తాన్ని ఎందుకోసం వినియోగించామో సంబంధిత రశీదును స్త్రీనిధి అధికారులకు అందించాలి. రుణ మొత్తాన్ని వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. తీసుకున్న మొత్తానికి అనుగుణంగా కనిష్ఠంగా 24 నెలల నుంచి 36 నెలల వరకు చెల్లించే వెసులుబాటు కల్పిస్తారు.

2027 డిసెంబరు నాటికి పోలవరం పూర్తి చేస్తాం. కియా ఫ్యాక్టరీ కోసం గొల్లపల్లి రిజర్వాయరును ఒక్క ఏడాదిలో పూర్తి చేసి నీరిచ్చాం. హంద్రీనీవా ప్రాజెక్టు కాల్వల విస్తరణ పనులు కేవలం 100 రోజుల్లో పూర్తి చేసి నీరు ఇచ్చాం" అని సిఎం అన్నారు. అమరావతిలో మొత్తం ప్రైవేట్ భూములే. హైటెక్ సిటి రాకముందు హైదరాబాద్‌లో ఎకరం రూ. 1 లక్ష ఉండేది...ఇప్పుడు రూ.100 కోట్లకు చేరింది. పరిశ్రమలు, రహదారుల లాంటి అభివృద్ధి జరిగితే భూమి విలువ పెరుగుతుంది. అమరావతి రైతుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగదు. హైదరాబాద్ తరహాలో అమరావతి కూడా గుంటూరువిజయవాడ తెనాలి తదితర ప్రాంతాలు కలిసి మహానగరంగా రూపొందుతుంది. అమరావతిలో 2026 జనవరికి క్వాంటం వ్యాలీ అందుబాటులోకి వస్తుంది. ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్‌కు అవసరమైన అనుబంధ సంస్థలు పెట్టుబడులతో ముందుకు వచ్చాయి. అలాగే జాతీయ, అంతర్జాతీయ ప్రముఖ విద్యా సంస్థలు కొన్ని ఉన్నాయి. మరికొన్ని రాబోతున్నాయి" అని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం విజన్ కల్పన చేయటంతో పాటు దాన్ని సుసాధ్యం చేసే దిశగా పనిచేయాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. భవిష్యత్ తరాల కోసమే విజన్‌ను రూపొందించి అమలు చేస్తున్నామని.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఇది తన బాధ్యత అని స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో వికసిత్ భారత్ 2047 అమలు చేస్తుంటే రాష్ట్రంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ సిద్ధం చేసి అమలు చేస్తున్నామని వెల్లడించారు. వచ్చే 22 ఏళ్లలో మన రాష్ట్రం ఎక్కడ ఉండాలన్న అంశాన్ని నిర్దేశించేందుకే విజన్ రూపొందించి అమలు చేస్తున్నట్టు వివరించారు. 'రాష్ట్రంలోని స్టేక్ హోల్డర్లను భాగస్వాములను చేస్తూ ఈ తరహా కాంక్లేవ్ నిర్వహించడం మంచి పరిణామం. 25 ఏళ్ల క్రితం భారతీయులకు సరైన గుర్తింపు లేని సమయంలో తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి భారతదేశం అభివృద్ధి అన్‌స్టాపబుల్‌గా మారింది. 2038 నాటికి భారత దేశం నెంబర్1 అవుతుందన్నారు.

# మేయర్ పదవికి రాజీనామా చేసిన పొట్లూరి స్రవంతి

**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** నెల్లూరు నగర కార్పొరేషన్‌లో శనివారం నగర మేయర్ పొట్లూరి స్రవంతి మీడియా సమావేశం నిర్వహించి రాజీనామాకు సంబంధించి మేయర్ స్రవంతి ప్రకటన చేశారు. అధికారికంగా ఆదివారం జిల్లా కలెక్టర్‌ని కలిసి రాజీనామా పత్రాన్ని అందిస్తానని మేయర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషను మేయర్ రాజీనామా లేఖను కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అందించిన స్రవంతి జయవర్ధన్ తరుపున ప్రతినిధి. ఈ మేరకు కలెక్టర్ క్యాంప్ కార్యాలయ డిటి హాజరత్‌కు రాజీనామా లేఖ అందించారు.

# నితిన్ నబీన్

>> నిర్ణయం ప్రకటించింది. వెంటనే అమలులోకి వస్తుందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఉత్తర్వులు జారీచేసారు. బీహార్‌లోని బాంకీపూర్ అసెంబ్లీ స్థానంనుంచి నితిన్‌నబీన్ వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రహదారుల శాఖమంత్రిగా కొనసాగారు.

బిజెపి ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జెపినడ్డా 2020 జనవరిలో ఈపదవిలో నియమితులయినా ఇప్పటికే ఆయన పదవీకాలం ముగిసినప్పటికీ పొడిగిస్తూ వచ్చింది. కాగా నితిన్ నబీన్‌కు ప్రధానిమోడీ శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి పనిచేసే కార్యకర్తగా నబీన్ గుర్తింపుపొందారని, ఆయనకు సంస్థాగత అనుభవం అపారంగా ఉందని, బీహార్ ఎమ్మెల్యేగా మంచి రికార్డుసాధించారని ప్రశంసించారు. ఆయన పనితీరు రానున్న కాలంలో బిజెపిని మరింత బలోపేతంచేస్తుందన్న నమ్మకం ఉందని మోడీ ఆకాంక్షించారు.

## వారం - వర్జ్యం

15-12-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
ఏకాదశి రా.9.21
చిత్త ఉ.11.09, మూల కార్తె
వర్జ్యం : సా.5.27-7.15
దు.మ.12.26-1.11,
2) మ.2.40-3.25
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** స్థిరాస్తులను కొనుగోలు చేసే ఆలోచనలు ఫలిస్తాయి. వచ్చిన ధనమును పొదుపు చేయుటకు ప్రయత్నిస్తారు.

**వృషభం:** ఖర్చులను తగ్గించు విషయ ములో పూర్తిగా వైఫల్యమును పొందుతారు. సోదరి కలయిక.సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**మిథునం:** కొన్ని దుబారా ఖర్చులు రహస్య ఋణములు, దానములు తప్పవు. విలువైన సమాచారం వింటారు.కాంట్రాక్టులు లాభిస్తాయి.

**కర్కాటకం:**కరస్పాండెన్స్‌లు, సాంస్కృతిక కార్యక్రమములు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మందుల వ్యాపారము అనుకూలం.

**సింహం:**ఆర్థికపరమైన అంశాలు కొంతమేర ఆశాజనకంగా ఉంటాయి. వివాహయత్నాలు ముమ్మరంచేస్తారు.

**కన్య :** మీకు న్యాయం చేయవలసిన వాళ్ళు సంపూర్ణంగా న్యాయం చేయరు. వృత్తిలోకొన్ని అనుకోని మార్పులు.

**తుల :** కోర్టు సంబంధించిన భూవివాదాలు, స్థిరాస్తులకు సంబంధించిన వివాదాలు ఒక పరిష్కార దశకు చేరుకుంటాయి.

**వృశ్చికం:**కళా, సాంస్కృతిక, ఉద్యోగ రంగాలలోని వారికి పోటీ ఎదురవుతుంది. కళాత్మక వస్తువులను కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు:** ఒకరి జీవితానికి ఆధారం కల్పించి మనశ్శాంతి పొందుతారు. ఆరోగ్య పరంగా జాగ్రత్తలు పాటించాలి.

**మకరం:** ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైలు మీద అధికార ఆమోద ముద్రలు పడుతాయి. క్రయ విక్రయాలలో లాభాలు.

**కుంభం:** వస్తు భద్రతకు ప్రాముఖ్యం ఇస్తారు. ఇతర భాషల పట్ల విదేశాల పట్ల ఆకర్షణ కలుగుతుంది. వస్త్ర లాభం.

**మీనం :** వృత్తి విషయములో కొంత ఓర్పును పాటించుట అవసరం. కార్యాచరణ కోసం యోచనచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పదవికే వన్నె తెచ్చిన మహనీయుడు అశోక్ గజపతి రాజు

## ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

**విజయనగరం, డిసెంబరు 14 (ప్రభాతవార్త ప్రతినిధి):** కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ వేత్త గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు పదవికే వన్నె తెచ్చిన మహనీయుడని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కొనియాడారు. అశోక్ గజపతి రాజు గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన నేపథ్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో ఆయనకు 'ఆత్మీయ సత్కార సభ'ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు క్షత్రియ పరిషత్ సభ్యులు హాజరై అశోక్ గజపతి రాజుని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ అశోక్ గజపతి రాజు తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో విలువలకు, విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచారని కొనియాడారు. గోవా గవర్నర్‌గా ఆయన ఎంపిక కావడం తెలుగు వారందరికీ గర్వకారణమన్నారు. పదవి ఆయనకు అలంకారం కాదని, ఆయనే ఆ పదవికి అలంకారమని రఘురాజు వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య విలువల పట్ల ఆయనకున్న నిబద్ధత గవర్నర్ వ్యవస్థకు మరింత గౌరవాన్ని తెస్తుందని రఘురాజు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం శాసన సభ్యురాలు పూసపాటి అదితి గజపతి రాజు, క్షత్రియ పరిషత్ ప్రతినిధులు ఐవిపి రాజు, శివాజీ రాజు, విజయనగరానికి చెందిన పలువురు ముఖ్యులు పాల్గొన్నారు.

# నేడు శంషాబాద్‌లోని కన్హా శాంతివనానికి సిఎం చంద్రబాబు

## శాంతి వనం అధ్యక్షుడు దాజీతో భేటీ కానున్న ముఖ్యమంత్రి..

## సాయంత్రం విజయవాడలో అమరజీవి ఆత్మార్పణ దినం కార్యక్రమానికి సిఎం హాజరు

**విజయవాడ, డిసెంబరు 14, ప్రభాతవార్తప్రతినిధి:** హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ మండలంలో ఉన్న కన్హా శాంతి వనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు సందర్శించనున్నారు. రేపు ఉదయం జూబ్లిహిల్స్‌లోని ఆయన నివాసం నుంచి బయల్దేరి వెళ్లనున్న సిఎం 11 గంటలకు కన్హా శాంతివనం చేరుకోనున్నారు. ఆశ్రమం అధ్యక్షులు కమలేష్ డి.పటేల్ దాజీతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. రెండు గంటల పాటు శాంతివనంలోని వెల్‌నెస్, మెడిటేషన్ సెంటర్ సహా, యోగా కేంద్రాలను ముఖ్యమంత్రి తిలకించనున్నారు. ట్రీ కన్జర్వేషన్ సెంటర్, రెయిన్ ఫారెస్ట్ కేంద్రం, మెడిటేషన్ సెంటర్, బయోచార్ కేంద్రం, పుల్లెల గోపీచంద్ స్టేడియంతో పాటు హార్ట్‌ఫుల్ నెస్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను సిఎం సందర్శిస్తారు. అనంతరం శాంతివనం వ్యవస్థాపకులు దాజీ నివాసానికి వెళ్లనున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో మొత్తం 1400 ఎకరాల్లో కన్హా శాంతి వనాన్ని శ్రీరామచంద్ర మిషన్ అభివృద్ధి చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద మెడిటేషన్ సెంటర్‌ను ఈ ఆశ్రమం కలిగి ఉంది. 8 లక్షలకు పైగా వివిధ జాతుల వృక్షాలతో బయోడైవర్సిటీ కేంద్రంగా ఈ ఆశ్రమం పెద్దఎత్తున పర్యాటకుల్ని ఆకర్షిస్తోంది. మానవ వనరుల్ని గ్లోబల్ లీడర్లుగా తయారు చేసేందుకు ఈ ఆశ్రమం అధ్యక్షులు దాజీ నేతృత్వంలో హార్ట్ ఫుల్ నెస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లీడర్షిప్ ఈ ఆశ్రమం నిర్వహిస్తోంది. కౌశలం పేరిట శిక్షణా కార్యక్రమాలను చేపడుతోంది. కన్హా శాంతివనంలోని యోగా, మెడిటేషన్, వెల్ నెస్ సెంటర్లతో పాటు సుస్థిర వ్యవసాయ క్షేత్రాన్నిను కూడా ముఖ్యమంత్రి సందర్శించనున్నారు. అనంతరం ఆయన హెలికాప్టర్లో బయల్దేరి అమరావతికి తిరిగి రానున్నారు. మధ్యాహ్నం సచివాలయంలో అధికారులతో వేర్వేరు సమీక్షల్లో పాల్గొనున్నారు. రేపు సాయంత్రం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణదినం కార్యక్రమానికి హాజరు కానున్నారు.

# అమరావతిలో రూ.165 కోట్లతో జ్యుడీషియల్ అకాడమీ భవనం

**విజయవాడ,డిసెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీకి రాజధాని అమరావతిలో రూ.165 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక జి+5 భవనాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం విజయవాడ-గుంటూరు మధ్య కాజ వద్ద అద్దె భవనంలో నడుస్తున్న జ్యుడీషియల్ అకాడమీకి సీఆర్‌డీఏ పిచ్చుకలపాలెం వద్ద 4.83 ఎకరాల స్థలాన్ని 60 ఏళ్ళ లీజుకు కేటాయించింది. అక్కడ భవనాన్ని కూడా సీఆర్డీఏనే నిర్మించనుంది. ఈ ప్రాంతం హైకోర్టుకు సుమారు...3 కి.మీ దూరంలో ఉంది. ఈ భవన నిర్మాణానికి సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఇటీవల ఆమోదం లభించింది. జ్యుడీషియల్ అకాడమీ హైకోర్టు అధ్వర్యంలో పనిచేసే శిక్షణ సంస్థ...న్యాయమూర్తులు, న్యాయాదికారులు,కోర్టుల సిబ్బందికి నైపుణ్యాల పెంపు,కోర్టు మేనేజ్‌మెంట్,న్యాయ విజ్ఞానంలో ఇక్కడ శిక్షణ ఇస్తారు.కొత్తగా సర్వీసులో చేసిన జడ్జిలతో పాటు ఇప్పటికే సర్వీసులో ఉన్న వారికి నైపుణ్యాభివృద్ధి శక్షణ ఉంటుంది.ఏపీ జ్యుడీషియల్ అకాడమీకి రాజధానిలో అత్యాధునిక క్యాంపస్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. ఎకడమిక్ బ్లాక్,నివాస సదుపాయాలు,డిజిటల్ క్లాస్‌రూంలు, ఆడిటోరియం, సమావేశ మందిరాలు, క్రీడలు, వినోద సదుపాయాలు, కెఫేటేరియా వంటివి ఉంటాయి. దానిలో భాగంగటానే ఇప్పుడు భవన నిర్మాణం చేపడుతున్నారు.

# రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అగ్రస్థానంలో నిలుపుదాం

## మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు: మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,డిసెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ పారిశ్రామిక అవసరాలు తీర్చడంలో ఆంధ్రప్రదేశ్ను అగ్రస్థానంలో నిలుపుదామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. విజయవాడ ఎస్ ఎస్ కన్వెన్షన్ లో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన బిజినెస్ ఎక్స్పోలో ఓ విభాగాన్ని మంత్రి ప్రారంభించారు.. ఎక్స్పోలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో నూతన ఆవిష్కరణలు పరిశీలించారు. సరికొత్త ఆవిష్కరణలతో రాష్ట్రంలో నూతన పారిశ్రామిక శకం మొదలవుతోందని పేర్కొన్నారు. ఇన్ఫ్రాస్ట్రక్చర్‌రంగంలో ఎక్కువ పెట్టుబడులు రావడం అభినందనీయం. మన రాష్ట్రానికి సుమారు వెయ్యి కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. పోర్టులు, రైలు రోడ్డు మార్గాలు పుష్కలంగా ఉన్నాయి. ఒకప్పుడు ఔటర్‌రింగ్‌రోడ్డు నిర్మాణంతో హైదరాబాదు రూపురేఖలే మారిపోయాయి. అదే స్ఫూర్తితో నేడు అమరావతి నిర్మాణం చేపడుతున్నాం. గత ఐదేళ్లు ఎదుర్కొన్న ఇబ్బందుల కారణంగా అమరావతి నిర్మాణం ఆలస్యమైనప్పటికీ.. ఇప్పుడు పనుల్లో వేగం పెంచాం. మరోవైపు శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి వరకు విశాఖ ఎకనామిక్స్ రీజియన్, వెస్ట్ గోదావరి నుంచి ప్రకాశం జిల్లా వరకు అమరావతి రీజియన్, నెల్లూరు సహా రాయలసీమ జిల్లాలతో కలిపి రాయలసీమ ఎకనామిక్ రీసన్ డెవలప్ చేస్తున్నాను. అదే సమయంలో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటు చేసేందుకు పెద్ద పేట వేస్తున్నామన్నారు.

# ఓటు చోరులను గద్దె దించుతాం

>> న్నారు. సత్యంపైనే ఆధారపడి పనిచేస్తామని, ఈ శక్తితోనే నరేంద్రమోడీ ఆర్‌ఎస్ఎస్ ప్రభుత్వాన్ని అధికారంనుంచి దించుతామని ప్రకటించారు. వారికి అధికారం ఉందని, అందువల్లనే వారంతా వోట్‌చోరీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో బిజెపి రూ.10వేలు చొప్పున పంపిణీచేసిందని, అయినా కూడా ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి చర్యలు లేవని గుర్తుచేసారు. వాస్తవం అవాస్తవాలమధ్య జరిగే పోరులో తాము ఎప్పటికీ రాజీ పడలేమన్నారు. ఎన్నికల సంఘం బిజెపి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తోందని నిష్పాక్షిక వైఖరితో లేదని ఆరోపించారు. ఆర్‌ఎస్ఎస్ ఛీఫ్ మోహన్‌భగవత్ ప్రకటన గుర్తుచేసుకోవాలని చెపుతూ ప్రపంచం నిజాలవైపు చూడదని, అధికారంవైపే ఉంటుందని, అధికారంలో ఎవరు ఉంటారో వారినే గైరవిస్తారని అన్నారు. ఇదే మోహన్ భగవత్ ఆలోచన అని ఇదే ఆర్‌ఎస్ఎస్ సిద్ధాంతమని చెపుతూ మా సిద్ధాంతం సర్వమత సమానత్వం అని ఒక్క హిందూత్వంతో సరిపెట్టుకోబోమని అన్నారు. సత్య వాక్కులతోనే తాము మోడీ, అమిత్‌షా, ఆర్‌ఎస్ఎస్ ప్రభుత్వాలను గద్దెదించుతామని ప్రకటించారు.

# నేడు ఢిల్లీకి మంత్రి లోకేశ్

**విజయవాడ, డిసెంబరు 14, ప్రభాతవార్తప్రతినిధి:** మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ సోమవారం ఢిల్లీ వెళ్తున్నారు,ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను నారా లోకేశ్ కలవనున్నారు. విద్యా, ఐటీసంబంధిత అంశాలపై చర్చలు జరుపుతారు. జనవరిలో అమరావతిలో క్వాంటం కంప్యూటస్ ఏర్పాటు అంశంపై ఆయన కేంద్ర మంత్రులతో కీలకంగా చర్చించనున్నట్లు సమాచారం.రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధుల విడుదలపైన ఆయన కేంద్రమంత్రులతో చర్చలు జరుపుతారు..ఈ నెల 16న ఢిల్లీనుంచి విశాఖకు నారా లోకేశ్ వస్తారు. అక్కడ జిఎంఆర్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రారంభోత్సవంలో లోకేశ్ పాల్గొననున్నారు.

# ప్రత్యేక కమిటీ

>> కోట్లతో ఫైవ్‌స్టార్ హోటల్‌ను నిర్మించనుంది. విశాఖలోని ఎండాడలో పివిఆర్ హాస్పిటాలిటీస్ అధ్వర్యంలో ఫైవ్‌స్టార్ హోటల్‌నిర్మాణానికి మూడెకరాలతో పాటు రాయితీలు ఇవ్వనుంది. బాపట్ల మండలం పాండురంగాపురం బీచ్‌లో యాగంటి ఎస్టేట్స్,ఫైవ్‌స్టార్ బీచ్‌రిసార్టు ఏర్పాటుకు రాయితీలు ఇచ్చింది. తిరుపతిలో నాంది సంస్థకు 4 స్టార్‌హోటల్ నిర్మాణంకోసం రాయితీలు ఇవ్వాలని వేర్వేరు జీఓల్లో ఆదేశాలిచ్చింది.

# విలువలకు ప్రతీక వాజ్‌పేయి

>> శక్తివంతమైన దిశలో నడిపారన్నారు. అణుపరీక్షలు, రహదారి, ప్రాజెక్టులు, గ్రామీణ రహదారులు, టెలికాం విప్లవం వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో దేశ అభివృద్ధికి పునాదులు వేశారన్నారు. అటల్‌జీ ఆశయాలకు అనుగుణంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. స్టార్టప్ ఇండియా, మేక్ ఇండియా, ఒకల్‌ఫర్ లోకల్, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా భారతదేశం స్వావలంభన దిశగా ముందుకు వెలుతుందన్నారు. ప్రపంచంలో భారతదేశం నాల్గవ ఆర్థికశక్తిగా రూపొందుతుందన్నారు. కోవిడ్ సమయంలో స్వదేశీ వ్యాక్సిన్ ఉత్పత్తి ప్రపంచస్థాయికి మౌలిక సదుపాయాలు, నిర్మాణం మోడీ దూరదృష్టికి నిదర్శనమన్నారు. అయోధ్యలో రామమందిర్ నిర్మాణం, కాశీకారిడార్, ఉజ్జైనిలో మహాకాల్‌లోక్ వంటి అధ్యాత్మిక అభివృద్ధి కార్యక్రమాలు దేశ సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్నాయన్నారు. ఆర్టికల్ 370రద్దు, త్రిపుల్ తలాకా రద్దు, పౌరసత్వ సవరణ చట్టం వంటి నిర్ణయాలతో ఒక భారత్ శ్రేష్ఠ భారత్ భావనను బలోపేతం చేశాయన్నారు. రాష్ట్రంలో సిఎం చంద్రబాబునాయుడు, డి.సిఎం పవన్‌కల్యాణ్ నాయకత్వంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. అనంతరం వైద్యఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ అటల్‌బిహారి వాజ్‌పేయి అభివృద్ధి సంక్షేమం, జాతీయభద్రతకు పునాదులు వేసిన మహానేత అని కొనియాడారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు తిరిగి ప్రజాసమస్యలు తెలుసుకొని దేశాభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. రాష్ట్ర అధ్యక్షులు టివిఎన్ మాదవ్ మాట్లాడుతూ మాజీ ప్రధాని అటల్‌బిహారి వాజ్‌పాయి ప్రజాజీవితం, దేశభక్తి, ఆదర్శ రాజకీయ విలువలను స్మరించుకొన్నారు. దేశాభివృద్ధికి ఆయన ఎంతో సేవ చేశారని కొనియాడారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, మండలి ఉపసభాపతి జకియాఖాన్, 20సూత్రాల కమిటీ ఛైర్మెన్ లంక దినకర్‌లు మాట్లాడుతూ వాజ్‌పాయ్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రధానమంత్రి నరేంద్రమోడీ 11సంవత్సరాలుగా దేశాన్ని సంక్షేమం, అభివృద్ధి రెండింటిని సమన్వయం చేస్తూ ముందుకు నడిపిస్తున్నారన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిలోకేశ్, రైల్వేకోడూరు, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, బిజెపి జాతీయ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, రాయలసీమ జనసేనపార్టీ కోకన్వీనర్ రాందాస్‌చౌదరి, రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, విజయభారతి డాక్టర్ సేతు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి ప్రశాంత్, బర్నేపల్లి సంద్యారాణి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ ఇంధన సంరక్షణ అవార్డు-2025 ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

## ప్రభుత్వం తరఫున అవార్డు అందుకున్న ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి శివ శంకర్



ఆదివారం రాష్ట్రపతి ముర్ము నుంచి అవార్డు అందుకున్న ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి ఎల్.శివ శంకర్

**విజయవాడ, డిసెంబర్ 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఇంధన పరిరక్షణ , ఇంధన సామర్థ్యం లో ఆంధ్ర ప్రదేశ్ సాధించిన జాతీయ ఇంధన సంరక్షణ అవార్డు 2025 ను ఏపీఎస్పీడీసిఎల్ సిఎండీ ఎల్ శివ శంకర్ కు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధానం చేసారు. ఆదివారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు ను ఏపీఎస్పీడీసిఎల్ సిఎండీ అందుకున్నారు. ఈ అవార్డు ఇంధన సామర్థ్యం, ఇంధన సంరక్షణ రంగాలలో రాష్ట్రానికి మరో గర్వకారణమైన మైలురాయిగా నిలిచింది. ఈ అవార్డు ద్వారా జాతీయ స్థాయి గుర్తింపు లభించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి గల నాయకత్వం, గౌరవ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సహాయసహకారాలు , అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మార్గదర్శకం ప్రధాన పాత్ర వహించాయి. వారి సమర్థ నాయకత్వంలో రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఎపిఎస్ఇసిఎం) అనేక రంగాల్లో ప్రభావవంతమైన ఇంధన సామర్థ్య కార్యక్రమాలను అమలు చేస్తూ జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు విశేష గుర్తింపును తీసుకువచ్చింది.

# విద్యుత్ చార్జీల భారం తగ్గనుంది

## - మంత్రి గొట్టిపాటి రవికుమార్



విజయవాడ, డిసెంబరు 14 ప్రభాత వార్త ప్రతినిధి: సూర్యఘర్ పథకం ద్వారా విద్యుత్ వినియోగ దారులకు ఎంతో మేలు జరుగుతుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రతి నియోజకవర్గంలో 10 వేల కనెక్షన్లు ఇవ్వడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు పూర్తి ఉచితం గా, బీసీలకు ప్రత్యేక రాయితీ లను ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఇస్తోందని గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. దీనివల్ల పేదలకు విద్యుత్ చార్జీల భారం గణనీయంగా తగ్గనుందని అన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని, వీలైతే తగ్గిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఆచరణలో సాధ్యమవు తోందని గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మాజీ సీఎం జగన్ పెంచిన ట్రూ అప్ చార్జీలను ట్రూ డౌన్ చేసే దిశగా ఇప్పటికే కార్యాచరణ రూపొందించామని తెలిపారు. గత ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థను ఆదాయ వనరుగా మాత్రమే చూసిందని గొట్టిపాటి అన్నారు. విద్యుత్ రంగంపై చంద్రబాబుకు ఉన్న అపార అనుభవం తో విద్యుత్ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఆదాయం సమకూరుస్తున్నారని తెలిపారు. 18 నెలల్లో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి అనతికాలంలోనే విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టామని వివరించారు. పీఎం సూర్యఘర్, కుసుమ్, బ్యాటరీ స్టోరేజ్ విధానం, డిమాండ్‌కు తగ్గట్టు ఉత్పత్తి పెంచుతూ తీసుకొచ్చిన సంస్కరణలతో చార్జీలు తగ్గించగలుగుతున్నామని పేర్కొన్నారు.

# సంస్కరణల పేరుతో జగన్ భూ కుంభకోణం

## - రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: రెవెన్యూ సంస్కరణల పేరుతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భూ కుంభకోణానికి పాల్పడ్డారని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. జగన్ పాలనలో రాష్ట్రంలో ప్రజల భూములకు పూర్తిగా భద్రత లేకుండా పోయిందని ఒక ప్రకటనలో విమర్శించారు. భూ రికార్డులను తారుమారు చేసి వేల ఎకరాల రైతుల భూములను కబ్జా చేశారని ఆరోపించారు. ప్రైవేట్ భూములను 22ఎ జాబితాలో చేర్చి లావాదేవీలను అడ్డుకున్నారని విమర్శించారు. భూ దోపిడీ పాలనకు కూటమి ప్రభుత్వం ముగింపు పలికిందని తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను దుర్వినియోగం చేసిన ఘనత జగన్‌దన్నారు. ఈ వ్యవస్థ లోపభూయిష్టంగా మారిందన్నారు. జగన్ హయంలో ప్రతి రెవెన్యూ కార్యాలయంలో అవినీతి పేరుకొని పోయిందని, తమ ప్రభుత్వ ప్రక్షాళన చేసుకుని వస్తుందన్నారు.



# టన్నుమట్టి తవ్వితీస్తే... 2 గ్రాముల పసిడి చేతిలోకి!

- కర్నూలు జిల్లా జొన్నగిరిలో జోరుగా త్రవ్వకాలు
- 6.8 టన్నుల పసిడి ఖనిజం ఉన్నట్లు గుర్తింపు

కర్నూలు, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: కర్నూలు జిల్లాలో బంగారం వెలికి తీసే పనులు చురుకుగా సాగుతున్నాయి. తుగ్గలి మండలం జొన్నగిరి ప్రాంతంలో బంగారం మెరుపుతో ధగ ధగ మెరిసిపోతున్నది. జిల్లాలోని పగిడిరాయి, జొన్నగిరి ప్రాంతాల మధ్య బంగారు నిక్షేపాలు ఉన్నాయనే అనుమానంతో.. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ పసిడి కోసం పరిశోధనలు జరిగాయి. ఆఖరికి కొన్నేళ్ల క్రితం ఈ ప్రాంతాల్లో బంగారం నిక్షేపాలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) నిర్ధారించింది. దీంతో జొన్నగిరి పగిడిరాయి గ్రామాల పరిసర ప్రాంతాల్లో సుమారు 1,477.24 ఎకరాల్లో తవ్వకాలు జరిపేందుకు జియో మైసూర్ అనే కంపెనీ ప్రభుత్వం నుంచి అనుమతులు పొందింది. తవ్వకాలు కూడా ప్రారంభించింది. ఈ ప్రాంతంలో టన్ను మట్టిని తవ్వి తీస్తే.. 1.5 గ్రాముల2 గ్రాముల వరకు పసిడి ఉత్పత్తి అవుతుంది. అయితే టన్ను మట్టి నుంచి ఈ రెండు గ్రాముల బంగారం వెలికి తీసేందుకు గాను.. సుమారు 5 వేల వరకు ఖర్చవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇలా వెయ్యి టన్నుల మట్టికి సుమారు 700 గ్రాముల బంగారం వెలికి తీయడం సాధ్యం అవుతుందని ఇక్కడ తవ్వకాలు జరుపుతోన్న సంస్థ యాజమాన్యం చెబుతోంది. జియో మైసూర్ సంస్థ రానున్న పది సంవత్సరాల కాలంలో ఈ ప్రాంతంలో సుమారు 6 వేల టన్నుల బంగారం ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ప్రతి రోజు 1000 టన్నుల ఖనిజాన్ని శుద్ధి చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కోటి టన్నుల ఖనిజ నిల్వలు ఉన్నట్లు జియో మైసూర్ సంస్థ అంచనా వేస్తోంది. ముఖ్యంగా తూర్పు బ్లాక్‌లో భూమి అడుగున 180 మీటర్ల లోతులో.. 6.8 టన్నుల పసిడి ఖనిజం ఉన్నట్లు గుర్తించారు. ఈ ప్రాంతంలో ప్రతి సంవత్సరం 4 లక్షల టన్నుల ఖనిజాన్ని వెలికితీసి దీనిలో సుమారు 3 లక్షల టన్నులను శుద్ధి చేయాలని మైనింగ్ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం కంపెనీ నిర్వాహకులు అధునాతన యంత్రాలను తెప్పించుకుని పనులు చేపడుతున్నారు.

# అందరి చూపు రవికుమార్ ఆస్తులపైనే!

- నేటి నుండి సిఐడి, ఎసిబి దర్యాప్తు షురూ
- ఐటి, ఇడి సైతం రంగంలోకి

తిరుమల, డిసెంబర్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: చిరు ఉద్యోగి... ఆపై పరకామణిలో లక్షల్లో చోరీ... ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడనే అనుమానాలపై హైకోర్టు ధర్మాసనం ఆదేశాలతో నిందితుడు రవికుమార్ ఆస్తుల లెక్కలు తేల్చేపనిలో సిఐడి, ఎసిబి అధికారులు రంగంలోకి దిగుతున్నారు. వీళ్ళు సేకరించిన సమాచారాన్ని ఆదాయపు పన్నుశాఖ (ఐటి), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కి అందజేయాలని వెలువడించిన ఆదేశాల వెనుక పెద్దకుట్ర ఉందనేది న్యాయస్థానం కూడా అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. క్షుణ్ణంగా నిందితుడు ఆస్తులు ఎలా సంపాదించాడు, ఎక్కడెక్కడ ఉన్నాయి, వాటిని ఎవరెవరికి విక్రయించాడు, ఇంకా ఏ మేరకు ఆస్తులు ఉన్నాయనే వివరాలు సేకరణలో సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ బృందం, ఎసిబి చీఫ్ బృందం కార్యాచరణ రూపొందించుకుని సిద్ధమైంది. ఇప్పటికే ఈ తతంగంలో నిందితుడికి సంబంధించి తిరుపతి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నంలో భారీగా ఆస్తులు ఉన్నట్లు తగిన ఆధారాలు సేకరించి హైకోర్టు ధర్మాసనానికి సమర్పించింది. ఇంకా ఆ ఆస్తుల క్రయవిక్రయాల డాక్యుమెంట్లను, రికార్డులను సిఐడి రాబట్టిందనేది కీలక సమాచారం. ఇప్పుడు వీటన్నిటిపై నిశితంగా దర్యాప్తు చేసి తదుపరి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సంస్థలు ఐటి, ఇడిలకు సమాచారం ఇస్తే ఆ తరువాత ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోనున్నాయనేది టిటిడిలో, రాజకీయవర్గాల్లో పెద్ద దుమారం రేపుతోంది. 2023 ఏప్రిల్ 29న తిరుమల పరకామణిలో గుమస్తా సివి రవికుమార్ 920 అమెరికన్ డాలర్లు చోరీ చేయడం, తిరుమల పోలీసులు కేసు నమోదు చేయడం, తదుపరి విచారణ చేసినా చట్టపరంగా చర్యలు తీసుకోలేదని, లోక్‌అదాలత్ ద్వారా కేసు రాజీ చేసుకోవడం వరకు అంతా సంచలనంగా మారింది. ఈ కేసులో ఇంకా మరింత లోతుగా దర్యాప్తుకు హైకోర్టు ధర్మాసనం ఆదేశించడంతో సిఐడి, ఎసిబితో బాటు ఐటి, ఇడి శాఖల అధికారులు ఇక రంగంలోకి దిగుతున్నారు. 2023 జూన్‌లోనే అప్పటి టిటిడి బోర్డు పెద్దలు రూ.14.43 కోట్ల విలువైన ఆస్తులను 7 గిఫ్ట్ డీడ్‌లుగా శ్రీవేంకటేశ్వరస్వామికి స్వీకరించడం జరిగింది. వాటి విలువ మార్కెట్లో రూ.40 కోట్లు చేస్తుందని సిఐడి అంచనా. చోరీ సొత్తు విలువ లక్షల్లో ఉంటే శ్రీవారికి కానుకగా రూ.14 కోట్ల ఆస్తులు ఎందుకు స్వీకరించారనేది హైకోర్టు అనుమానాలు. ఈ వారంలో అనుమానాలు పటాపంచలు కానున్నాయనే చర్చమొదలైంది. ఈ కేసులో ఇప్పటికే గత వైసిపి ప్రభుత్వ హయాంలోని టిటిడి బోర్డు మాజీ ఛైర్మన్లు వైవి సుబ్బారెడ్డిని, భూమన కరుణాకర్‌రెడ్డిని, మాజీ ఇఒ ఏవి ధర్మారెడ్డితోబాటు మాజీ సివిఎస్ఒ నరసింహ కిశోర్, మాజీ విజిఒ గిరిధర్, ఏవిఎస్ఒ పద్మనాభంను, అప్పటి తిరుమల సిఐలు జగన్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, ఎస్ఐ లక్ష్మీరెడ్డిలను పరకామణి విధుల్లో ఉన్న టిటిడి అధికారులను వరుసగా 35మందిని పలు దఫాలుగా విచారణ చేసి వాంగ్మూలాలు రాబట్టిన విషయం తెలిసిందే.




తిరుమల సమాచారం



# 30నుండి జనవరి 8వరకు విఐపి దర్శనాలు బ్రేక్

తిరుమల, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగవైకుంఠం తిరుమలలో ప్రత్యేక పర్వదినాలు పురస్కరించుకుని ఆయా రోజుల్లో టిటిడి విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేసింది. అంతేగాక ఆ రోజులకు ముందురోజులు ఎటువంటి సిఫార్సులేఖలు కూడా స్వీకరించరని తెలిపింది. ఈనెల 23వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 29న వైకుంఠ ఏకదశి ముందురోజు, 30వ తేదీ నుండి జనవరి 8 వరకు వైకుంఠద్వార దర్శనాలు సందర్భంగా పూర్తిగా విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేసింది. ప్రోటోకాల్ విఐపిలు స్వయంగా వస్తే వారికి దర్శనం కల్పిస్తుంది. జనవరి 25వతేదీ రథసప్తమి పర్వదినాన కూడా విఐపి బ్రేక్ రద్దుచేసింది. ఈ సందర్భాలు భక్తులు గమనించి టిటిడికి సహకరించాలని కోరింది.



# నమో ఆంజనేయం... ప్రభాదివ్యకాయం

తిరుమల, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: కార్తీకమాసం చివరి ఆదివారం ఉదయం కలియుగ వైకుంఠం తిరుమలలో బేడి ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఉదయం ఆలయంలో బేడి ఆంజనేయస్వామి మూలవిరాట్టుకు పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపుతో విశేషంగా అభిషేకించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.




# సిఎం భద్రతలో రాజీలేదు

## బాధ్యతతో విధులన్న తిరుపతి ఎస్పీ లంకెల

తిరుపతి, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుపతి పర్యటనలో బాగంగా సంస్కృత విద్యాపీఠంలో జరిగే కార్యక్రమానికి విచ్చేస్తున్నందున భద్రతలో రాజీలేదని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు వెల్లడించారు. క్రిందిస్థాయి నుండి పై అధికారి వరకు బాధ్యతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. సిఎం పర్యటనతో ముందస్తుగా ఆదివారం ఉదయం తిరుపతిలోని హెలిపాడ్‌ను, సమావేశం జరిగే ప్రాంతాలను పోలీసు అధికారులతో కలసి పరిశీలించారు. వేదిక్ విశ్వవిద్యాలయం అధికారులు పోలీసులకు సహకరించాలని, భద్రత, సమన్వయ అంశాలపై పలు కీలక సూచనలు చేశారు. కమాండ్ కంట్రోల్‌లో ఎఎస్పీ రవిమనోహరచారి, ఎస్‌బి డిఎస్పీ వెంకటనారాయణ, తిరుపతి భక్తవత్సలం, సిఐలు, ఎస్ఐలతో కలసి సిఎం పర్యటన సజావుగా సాగేందుకు దిశానిర్దేశం చేశారు.

# పండ్ల ఉత్పత్తిలో ఎపి టాప్

- 1.93 కోట్ల టన్నుల పండ్ల ఉత్పత్తి
- ఆర్‌బిఐ గణాంకాలు విడుదల



విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: దేశవ్యాప్తంగా ఏపీ 1.93 కోట్ల టన్నుల పండ్ల ఉత్పత్తిని చేస్తూ జాతీయ స్థాయిలో ప్రథమస్థానాన్ని దక్కించుకుంది. పండ్లతోటల సాగులో ఏకంగా రెండోస్థానంలో నిలిచింది. ఇటీవల రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 202425 ఆర్థిక సంవత్సరం గణాంకాలు విడుదల చేసింది. దీని ప్రకారం పండ్ల ఉత్పత్తులకు సంబంధించిన వివరాలను అధికారులు వెల్లడించారు. దేశం మొత్తం మీద వివిధ అంశాల్లో ఏ ఏ రాష్ట్రాలు ఏ స్థానంలో ఉందో పేర్కొంది. ఆ తర్వాత స్థానంలో మహారాష్ట్ర 1.68 కోట్ల టన్నుల ఉత్పత్తితో రెండోస్థానంలో నిలచింది. ఇక మధ్యప్రదేశ్ రాష్ట్రం 1.02 కోట్ల టన్నుల ఉత్పత్తితో మూడోస్థానంలో ఉంది. దాంతో వీటన్నింటినీ పరిశీలించిన అనంతరం 8.07లక్షల హెక్టార్లలో పండ్ల తోటలను సాగు చేస్తూ దేశంలో రెండోస్థానంలో ఏపీ నిలవగా, 8.96 లక్షల హెక్టార్లలో సాగు చేస్తూ మహారాష్ట్ర మొదటిస్థానంలో నిలిచింది.

### సగటు ఎపి నికర ఉత్పత్తి

ప్రస్తుత ధరల వద్ద దాదాపు రూ.14.22 లక్షల కోట్లు కాగా స్థిర ధరల వద్ద రూ.7.56 లక్షల కోట్లుగా ఉంది. బియ్యం ఉత్పత్తి 81.59 లక్షల టన్నులు, ఆహారధాన్యాల ఉత్పత్తి రాష్ట్రం మొత్తమ్మీద 1.17 కోట్ల టన్నులు.

రాష్ట్రవ్యాప్తంగా వరిసాగు 20.77 లక్షల హెక్టార్లుల్లో ఉంది. చేపల ఉత్పత్తిలో దేశంలోనే మొదటి స్థానంలో ఏపీ నిలిచింది. రాష్ట్రంలో 51.58 లక్షల టన్నుల చేపల ఉత్పత్తిని సాధిస్తున్నాం. ఆ తర్వాత పశ్చిమబెంగాల్ 22 లక్షల టన్నులతో రెండోస్థానంలో, ఉత్తర్‌ప్రదేశ్ 11.60 లక్షల టన్నులతో మూడోస్థానానికి చేరుకున్నాయి. ప్రస్తుత ధరల ఆధారంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి 2024-25వ సంవత్సరంలో రూ.15.93 లక్షల కోట్లుగా రిజర్వుబ్యాంకు వెల్లడించింది. స్థిరధరల వద్ద అయితే రూ.8.65 లక్షల కోట్లుగా తేల్చింది. సగటున అయితే ఏపీ స్థూల ఉత్పత్తి రూ.2,66,240 (ప్రస్తుత ధరల్లో), రూ.1,41,609 (స్థిర ధరల వద్ద)గా వివరించింది. ప్రస్తుత ధరల ఆధారంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి 2024-25 వ సంవత్సరంలో రూ.15.93 లక్షల కోట్లుగా రిజర్వుబ్యాంకు వెల్లడించింది. స్థిరధరల వద్ద అయితే రూ.8.65 లక్షల కోట్లుగా తేల్చింది. సగటున అయితే ఏపీ స్థూల ఉత్పత్తి రూ.2,66,240 (ప్రస్తుత ధరల్లో), రూ.1,41,609 (స్థిర ధరల వద్ద)గా వివరించింది.



# కల్తీనెయ్యి కేసులో రేపు సుప్రీంకు 'సిట్'!?

## టిటిడి మాజీ అధికారులకు విచారణ తాఖీదులు

తిరుమల, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల లడ్డూల తయారీకి 2020-24 మధ్య కాలంలో కల్తీనెయ్యి సరఫరా కేసులో ఇప్పటి వరకు సేకరించిన సమాచారాన్ని సిట్ సుప్రీంకోర్టుకు అందజేయనుందనేది తెలుస్తోంది. మంగళవారం టిటిడి బోర్డు సమావేశం జరగనున్న నేపథ్యంలో టిటిడిలో మార్కెటింగ్, కొనుగోళ్ళ విభాగాలకు చెందిన కొందరు మాజీ అధికారులను సిట్ విచారణకు రమ్మని తాఖీదులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. కల్తీనెయ్యి కేసులో 16న కొంత సమాచారంతో సుప్రీం న్యాయస్థానంకు వెళితే తదుపరి ఎలాంటి ఆదేశాలు వెలువడతాయనేది తెలియాలి. 2020 ఆగస్టులోనే తిరుమలకు కల్తీనెయ్యి సరఫరా అవుతోందని అప్పట్లోనే గుర్తించిన టిటిడి మార్కెటింగ్, కొనుగోళ్ళ విభాగం అధికారులు బోర్డుకు తెలిపినా అప్పటి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పెద్దగా పట్టించుకోలేదనేది సిట్ కస్టడీలోని మాజీ జిఎం సుబ్రమణ్యం వాంగ్మూలం. ఇంకా పలు సంచలన విషయాలు సిట్ అధికారులకు సుబ్రమణ్యం తెలియజేయడంతో ఇప్పుడు టిటిడి వర్గాల్లో కలకలం రేపుతోంది. ఇప్పటికే కల్తీనెయ్యి కేసులో భాగస్వాములైన గత అధికారులు 12మందిని గుర్తించిన సిట్ వారిని విచారణకు పిలిచేందుకు టిటిడి ఇఒకు లేఖ రాయడం, దానిపై 16న ఆదేశాలు వెలువడనున్నట్లు తెలుస్తోంది. ఆ తరువాతే ఆ 12మందిని విచారణకు పిలిచే అవకాశం కనిపిస్తోంది. వీరిలో ముగ్గురు అధికారులు ఇప్పటికే పదవీవిరమణ చేశారు. ఉద్యోగులను విచారణకు ఇఒ అనుమతి అసవరం. నాగేంద్రప్రసాద్, శేఖర్, ఈశ్వర్‌రెడ్డి, వెంకట అనిల్‌కుమార్, వెంకట నగేశ్‌బాబు, జగదీశ్వర్ రెడ్డి, సుబ్రమణ్యం, మురళీకృష్ణ, గోశాల మాజీ డైరెక్టర్ (సస్పెన్షన్ వేటుకు గురైన) డాక్టర్ హరినాథ రెడ్డి కల్తీనెయ్యిలో కీలకమనేది సిట్ కథనం. కీలకమైన ఐదుగురు టిటిడి ఉద్యోగులను విచారణ చేస్తే నెలకొన్న చిక్కుముడి వీడిపోతుందనేది వినిపిస్తున్న వ్యాఖ్యలు.

# పండిన ప్రతి ధాన్యపు గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది

## - రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

## - తొట్ల వల్లూరులో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను ప్రారంభించిన మంత్రి

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: రైతులకు అన్యాయం జరగకుండా ప్రతి ధాన్యపు గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఎక్కడ లేని విధంగా 24 గంటల్లో పైకం చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఆదివారం మంత్రి రాష్ట్ర గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి జన్మదిన వేడుకలలో భాగంగా తొట్లవల్లూరులో ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ తాను రైతు బిడ్డ అని, రైతుల కష్టాలు తెలుసని, రైతులకు మేలు చేయాలని ఉద్దేశంతోనే తాను కఠినంగా వ్యవహరించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం డబ్బులు రైతులకు చెల్లించే ఏర్పాటు చేశామన్నారు. శనివారం జరిగిన సంఘటనను వివరిస్తూ మంత్రి కొంతమంది రైతులు రైస్ మిల్లర్ల నుండి తడిసిన ధాన్యం సంబంధించి నష్టపోతున్నట్లు తన దృష్టికి తీసుకొని వచ్చారన్నారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడడం మాట్లాడటం జరిగిందన్నారు. తన సొంత ఊరు కారకంపాడు నుండి వస్తుంటే పక్క గ్రామం అయిన పెద్ద ముత్తేవి నుండి 3 లారీల ధాన్యం లోడ్ చేసుకుని వెళుతుంటే ఆ లారీలను ఆపి ఎక్కడి నుండి వస్తున్నాయి, ధాన్యం ఎంతకు కొనుగోలు చేశారు అని లారీ డ్రైవర్ను అందులోని వారిని అడిగితే తమకు తెలియదని తాము కేవలం రవాణాకు చెందిన వాళ్ళమని గుడివాడ రైల్వే షెడ్‌లో వ్యాగిన్స్‌లో లోడ్ చేసుకునేందుకు తీసుకెళుతున్నట్లు చెప్పారన్నారు. ఎవరు కొన్నారు వారిని పిలిపించాలని పక్క గ్రామమే కదా అని వారిని అడిగితే ప్రక్క గ్రామం నుండి వారు వచ్చారన్నారు. నాతో మొదట 1550 అని ఆ తరువాత 1450 రూపాయలకు కొనుగోలు చేసినట్లు చెప్పారన్నారు. అంత తక్కువకు కొనుగోలు ఎలా చేశారని చేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించానన్నారు. వెంటనే గోనెసంచిలో నుండి ధాన్యాన్ని బయటకు తీసి తేమ శాతం పరీక్షించే యంత్ర పరికరాన్ని తెప్పించి పరిశీలించగా 22శాతం తేమ ఉందన్నారు. అడిగితే ధాన్యం రంగు మారిందని చెప్పారు. అక్కడే ఒక బేరగాడు ఉంటే ధాన్యాన్ని అరచేతిలో వేసుకుని నూరితే లోపల బియ్యం ఎక్కడ రంగు మారలేదన్నారు. బియ్యం అంతా బాగానే ఉన్నా నూక రంగు మారితే మీకు వచ్చే నష్టమేంటని ప్రశ్నించామన్నారు. ఎవరు దీన్ని తక్కువ ధరకు కొనమని చెప్పారని అంటూ రైతు సేవా కేంద్రంలోని సాంకేతిక సిబ్బందిని పిలిపించామన్నారు. తేమ శాతం పరికరాన్ని అప్పటికప్పుడు తెప్పించామన్నారు. తేమశాతం పరిశీలిస్తే 22 శాతం ఉందని ధాన్యం బాగుందని ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం 17కంటే ఎన్ని పాయింట్లు ఎక్కువ ఉంటే అన్ని కిలోల బియ్యం తగ్గించుకోవలసి ఉంటుందన్నారు. ఆ ప్రకారం 5 కిలోల బియ్యానికి కిలో 24 రూపాయల చొప్పున 120 రూపాయలు తగ్గించాల్సి ఉంటుందన్నారు. ఆ ప్రకారం 1450 రూపాయలు కొనుగోలు చేయడం ఏంటని మిల్లర్లతో మాట్లాడటం జరిగిందన్నారు. 1650 రూపాయలు చెల్లిస్తే గాని లారీలను వెళ్ళనివ్వమని గట్టిగా చెప్పడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం లాగా రైతులకు డబ్బులు ఎగ్గొట్టే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. అనా పైసలతో సహా నిబంధనల ప్రకారం ప్రతి రైతు పండించిన పంటకు ధర చెల్లించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 24 గంటల్లోనే ధాన్యం డబ్బులు రైతులకు చెల్లిస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. తాను పేదరికం నుంచి వచ్చానని తనకు రైతుల బాధలు తెలుసన్నారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం జరగకూడదన్నది ప్రధాన ఉద్దేశం, ప్రతి రైతుకు మేలు జరగాలన్నదే తమ అభిమతం అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.




## రాజధాని పరిధిలోని భూమిలేని పేదలకు

# పెన్షన్ పథకం పునరుద్ధరణ




విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పరిధిలోని భూమిలేని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గత ప్రభు త్వం నిలిపివేసిన పింఛన్ల పథకాన్ని పునరుద్ధరించాలని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్ డీఏ) నిర్ణయించింది. ఇటీవల జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. దీని ద్వారా 4,929 మంది పేదలకు నెలకు రూ.5 వేల చొప్పున పింఛను అందనుంది. రాజధాని కోసం భూసమీకరణ జరిగినప్పుడు, భూమి లేక ఉపాధి కోల్పోయిన పేదల కోసం ప్రభుత్వం ఈ పింఛన్ పథకాన్ని ప్రారంభించింది. అయితే, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని పనులు నిలిపివేయడంతో పాటు ఈ పింఛన్లను కూడా రద్దు చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో, అమరావతి అభివృద్ధి పనులు తిరిగి ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలోనే పింఛన్లను పునరుద్ధరించాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. ఈ విషయంపై సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పింఛన్ల కోసం త్వరలోనే దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. గ్రామాల్లోని సీఆర్‌డీఏ కార్యాలయాల్లో గానీ, గ్రామసభల ద్వారా గానీ పేదలు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఈ నిర్ణయంతో రాజధాని ప్రాంతంలోని వేలాది పేద కుటుంబాలకు ఆర్థికంగా ఊరట దక్కుతుంది.

వార్త


జ్ఞానం వంశపారంపర్య హక్కుకాదు,
ఎవరికి వారు కష్టపడి ఆర్జించుకోవాల్సిందే.

న-స్వామి వివేకానంద

# మెస్సీ మెరిసెన్


అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ హైదరాబాద్ ..ఉప్పల్ స్టేడియంలో అలా మెరిసి... ఇలా మురిపించాడు. క్రీడా మైదానంలో ముఖ్యమంత్రి రేవంతరెడ్డితో కలియ తిరిగారు. అతి సాధారణ క్యాజువల్ వస్త్రధారణతో గ్యాలరీలోని అభిమానులను పలకరించారు. ఫుట్‌బాల్‌లను గ్యాలరీలోకి విసిరారు. దానిని పట్టుకున్న పలువురు దానిని ఎంతో ఉత్సాహంతో ఉద్వేగంతో పట్టుకుని ముద్దాడారు. స్టేడియం గ్రౌండ్లో ఎంతోమంది యువకులు, ఫుట్‌బాల్ ప్లేయర్లు తాము ఆడుకునే ఫుట్ బాల్ మీద మెస్సీ ఆటోగ్రాఫ్ తీసుకుని సంబరపడి పోయారు. మెస్సీ కదలికల్లో ఎలాంటి ఆర్భాటం లేదు. దర్పం లేదు. అతిశయం అసలే లేదు. స్టేడియంలో ఆడిన ఫ్రెండ్లీ మ్యాచులో ఆ విషయమే అర్థం అవుతుంది. తన ప్రతిభనంతా పక్కన పెట్టి తెలంగాణ ప్రభుత్వం తరఫున ఆడిన సింగరేణి బ్యాచ్ ఆటగాళ్ల గెలుపే తన గెలుపుగా భావించారు. ఎలాంటి ఎత్తుగడలు లేవు. మన ప్రాంతానికి వచ్చి మనల్ని గెలిపించి వెళ్లడమంటే....అదే కదా ఫ్రెండ్లీ అంటే. కాస్మోపాలిటన్ సిటీగా ఎదిగి ఒదిగిన ప్రాంతం కావడంతో దేశంలోని అన్ని ప్రాంతాల వారూ హైదరాబాద్‌లోనే ఉంటారన్నది జగద్విదితం. అందుకే అన్ని భాషలకు చెందిన క్రీడాసక్తి, ప్రత్యేకించి ఫుట్ బాల్ అంటే చెవి కోసుకునేవారు మెస్సీని ఎలాగైనా చూడాలని వ్యయ ప్రయాసలకోర్చి ఉప్పల్ స్టేడియంకు ముందుగానే వచ్చి చేరారు. లియోనల్ మెస్సీ అంటేనే ఫుట్ బాల్ ప్రపంచలో ఓ సంచలనం. భారత ప్రేక్షకులు ఇంతవరకు టీవీ చానల్స్‌లో మాత్రమే ఆయన్ని చూడగలిగారు. కలకత్తా కార్యక్రమం నిర్వాహకుల వైఫల్యం వలన అభాసుపాలయ్యింది. మ్యాచ్ అడకుండానే మెస్సీ కోల్‌కతా నుంచి వెనుదిరగడంతో అభిమానుల ఆగ్రహానికి గురయ్యారు. అక్కడి స్టేడియంలో మెస్సీని చూడలేక పోయామనే బాధతో అభిమానులు విధ్వంస చర్యలకు పాల్పడ్డారు. ఆ సంఘటనతో హైదరాబాద్‌లో అసాధారణ భద్రతతో ప్రమత్తమయ్యారు. దాంతో ఎక్కడా ఎలాంటి అలజడి లేకుండా కార్యక్రమం విజయవంతమయ్యింది. ప్రపంచ ఫుట్బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా' ప్రారంభమైంది. ఇండియాలో మూడు రోజుల పర్యటనలో 4 ప్రధాన నగరాలకు వెళ్లే కార్యక్రమం. ఆయనతో పాటు అతడి ఇంటర్ మియామీ జట్టు సహచరులు రోడ్రిగో డి పాల్, లూయిన్ సూవారెజ్ ఇండియాకు వచ్చారు. శనివారం ఉదయం కోల్కతాలో ఏర్పాటు చేసిన తన విగ్రహాన్ని వర్చువల్‌గా తానూ, హిందీ నటుడు షారుక్ ఖాన్ కలిసి ఆవిష్కరించారు. సిఫా వరల్డ్ న్క్ ట్రోఫీని చేతబట్టుకున్న మెస్సీ రూపంలో ఈ విగ్రహాన్ని రూపొందించారు. 2022 ప్రపంచకప్ విజయానికి ఇది ప్రతీకగా నిలిచింది. ఇక హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంకి మెస్సిని చూడటానికి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కలకత్తాలో మెస్సీ అభిమానులతో ఫ్రెండ్లీ మ్యాచ్ కోర్కె తీర్చలేకపోయినా హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో ఆయన అభిమానులను, నిర్వాహకులను కూడా సంతృప్తిపరిచారు. తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత రెడ్డి స్వతహాగా ఫుట్ బాల్ ప్లేయర్ కావడంతో ఈ కార్యక్ర మాన్ని విజయవంతంగా పూర్తి చేసారు. ఆయన ప్లేయర్ డ్రెస్‌తో వచ్చి ఫ్రెండ్లీ మ్యాచులో పాల్గొన్నారు. ఇలాంటి ఈవెంట్‌లో స్వయంగా పాల్గొన్న ముఖ్యమంత్రి ఎవరన్నా ఉన్నారంటే వీరే. ఉప్పల్ గ్రౌండ్ క్రికెట్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రీడా మైదానం. కానీ మెస్సీ రాకను దృష్టిలో ఉంచుకుని దానిని ఫుట్ బాల్ ఆడేందుకు వీలైన ఆటస్థలంగా తీర్చిదిద్దారు. కాగా మెస్సీ రాకతో ఈ ప్రాంతంలో ఫుట్ బాల్‌కు ప్రాణం లేచొచ్చింది. అనంతరం సాల్ట్ లేక్ స్టేడియానికి ఆయన వెళ్లారు. కేవలం 10 నిమిషాలు మాత్రమే ఆయన అక్కడ ఉన్నారు. అక్కడ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడడం ప్రత్యేకత. నిజానికి కలకత్తా అంటేనే ఫుట్ బాల్ ప్రియులు ఎక్కువ మంది ఉండే ప్రాంతంలో అలాంటి కార్యక్రమం లేకుండానే మెస్సీని నిర్వాహకులు తీసుకు వెళ్లిపోవడం తప్పిదమే. ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడతారని నిర్వాహకులు చెప్పగా ఎంతో ఉత్సాహంతో ఫుట్ బాల్ ప్రియులు సిద్ధంగా ఉన్నారు. కానీ మ్యాచ్ ఆడకుండా వెళ్లి పోవడం అభిమానుల ఆగ్రహానికి కారణమైంది. హతా శులైన ఫ్యాన్స్ తీవ్ర స్థాయిలో రెచ్చిపోయారు. వీరావేశంతో విరగ్గొట్టిన కుర్చీలను సాల్ట్ లేక్ స్టేడియంలో పడేశారు. ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించి మెస్సికి క్షమాపణ చెప్పారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. లియోనల్ మెస్సే, స్పోర్ట్స్ లవర్స్, మెస్సి ఫ్యాన్సుకు కూడా క్షమాపణ చెప్పారు. సంఘటనపై ఎంక్వైరీ కమిటీ వేసారు. బెంగాల్ గవర్నర్ కూడా ఆరా తీశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకుంటానని మమత ఎప్పటిలానే ఓ భరోసానిచ్చారు. భారతదేశంలో తమకిష్టమైన రాజకీయ నాయకులకు, అభిమాన సినిమా స్టార్లకు, ఆటగాళ్లకు జనం నీరాజనాలు, పడుతుంటారు. పాలాభిషేకాలు వారిని కలువలేకపోయినా, దగ్గర నుంచి చూసే అవకాశం లేకపోతే వీరాభిమానం గంగ వెర్రులెత్తి విధ్వంసానికి పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. కలకత్తాలో జరిగిందిదే. తమిళనాడులో అభిమానుల తీరు వేరే విధంగా ఉంటుంది.తమ అభిమాన రాజకీయ నాయకులకు జరగరానిది జరిగితే ఆత్మాహుతికైనా సిద్ధపడతారు.

మనిషికి మనసును మించిన మహాశత్రువు వేరొకరు లేరు. అందుకే మనస్సును జయిస్తే ప్రపంచాన్ని జయించవచ్చు.



గురునానక్

మాటలకే పరిమితమయ్యే మిత్రుడెవ్వడూ నీ మిత్రుడిగా ఉండలేడు. మానవ సంక్షేమానికి అసలు మూలం పనే.



లియో టాల్‌స్టాయ్

# ప్రజావాక్కు



## విర్రవీగుతున్న పాకిస్థాన్

మొన్న జరిగిన ఆపరేషన్‌సిందూర్‌లోజరిగిన స్వల్ప యుద్ధంతో పాకిస్థాన్ గడగడ వణికిపోయి యుద్ధాన్ని ఆపమని భారత్‌ను ప్రాధేయ పడిన విషయం పాక్ ఆర్మీ చీఫ్‌మునీర్‌కు తెలియదనుకోవాలా?మరల యుద్ధం జరిగితే భారత్‌ను ధీటైన సమాధానం పాకిస్థాన్ చెప్పగలదని చేతకాని ఆడంబరాలెందుకో.ఈమధ్యన ఈ మునీర్ సాబ్ అమెరికా వెళ్ళి ట్రంప్ గారిచ్చిన విందును ఆరగించిన తరువాతే ఆయన మాటలు శ్రుతి మించిపోతున్నాయి. ట్రంప్‌యుద్ధ సామాగ్రిని సమకూరుస్తానని వాగ్దానం చేసాడేమొ. అసలే అమెరికా దగ్గర చాలా ఆయుధాలు మురిగిపోతున్నాయి. సింధూర్ యుద్ధంతో తోక ముడిచిన ఈ పెద్ద మనిషి తన హోదాను సిడిఎఫ్‌గా ప్రభుత్వపరంగా పెంచుకుని విర్రవీగుతున్నట్లు కనబడుతోంది. ఏ దేశానికైనా ఓ ఆర్మీ ఉంటుంది. కానీ పాకిస్థాన్ ఆర్మీకే ఒక దేశ ముంది. ఇదొక వింతల్లో కల్లా వింత.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## డబ్బెవరికి చేదుకాదు!

బీహార్ శాసనసభకు నిజాయితీపరులు, విద్యావంతులు ఒక్కరు కూడా ఎన్నికవలేదు. ఎన్నికయిన వారందరు అధికార పార్టీకి చెందినవారు. నేరచరిత గలవారు కోటీశ్వరులు ప్రజలకు డబ్బు ఆశ పెట్టి ఓట్లు వేయించుకున్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ చేసిన పనులను ఇప్పుడు బిజెపి చేస్తోంది. ప్రపంచ బ్యాంకు అందించిన డబ్బులను ఇలా ఉపయోగిస్తోంది.

- శాస్త్రి, హైదరాబాద్

## రైతులను ఆదుకోండి

భారతదేశ ఆర్థికవ్యవస్థకు వెన్నెముకఅయిన రైతు, వాతావరణ మార్పుల కారణంగా తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నాడు.సకాలంలో రుతుపవనాలు రాక పంటలు ఎండిపోతుంటే, అకాలవర్షాలు చేతికొచ్చిన పంటను నాశనం చేస్తున్నాయి. పెట్టుబడికి తగిన గిట్టుబాటు ధర లేకపోవడం, పంట నష్టాలు, అప్పుల భారం రైతులను ఆత్మహత్యల వైపునెడుతున్నాయి.గణాంకాలప్రకారం,ప్రతిరోజూ సగటున 28మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇది కేవలం రైతుల సమస్య మాత్రమే కాదు, దేశం మొత్తం ఆహార భద్రతపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

-కె.రామారావు, హైదరాబాద్

## డిజిటల్ వ్యసనం

సాంకేతికపురోగతి యువతకుఅపారమైన అవకాశాలు తెరవగా, అదే పురోగతి ఒక నిశ్శబ్ద బంధనాన్ని సృష్టిస్తోంది డిజిటల్ వ్యసనం. చరవాణి తెరపై మొదలై సామాజిక మాధ్యమాల్లో ముగిసే ఈ కొత్త జీవన శైలి, తెలియకుండానే యువతను ఒక కనిపించని గోడల వెనుక బంధిస్తోంది. రోజువారీగా వచ్చే నోటిఫికేషన్లు, ఫోటోలపై స్పందనలు, ఇష్టపడింది గుర్తులు, అనుచరుల సంఖ్యలు ఇవన్నీ వారివిలువను నిర్ణయించే ప్రమాణాలుగా మారాయి. బయట ప్రపంచం ఎలా ఉన్నా, స్మార్ట్‌ఫోన్ తెరలపై కనిపించే ప్రతిస్పందనలే సంతోషం, ఆందోళన, ఆత్మవిశ్వాసం అన్నీ అవుతున్నాయి. ఈ వర్చువల్ ప్రపంచంపై అతిగా ఆధారపడటం, నిజజీవిత అనుభూతులను మసకబార్చుతోంది. ముఖాముఖి సంభాషణలు తగ్గిపోగా, ఒంటరితనం పెరుగుతోంది. దీర్ఘకాలిక తెర వినియోగం నిరాశ, ఆతురత, ఏకాగ్రత లోపం వంటి సమస్యలను పెంచుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## నిస్వార్థమైన ఓటుతోనే ప్రగతికి బాటలు

కులాన్ని చూసి కాదు గుణాన్ని నమ్మి ఓటేసినప్పుడే సమాజం బాగుపడుతుంది. సమసమాజం ఏర్పడుతుంది. రాజకీయమంటే కులాలు మతాలు కావని లౌకిక రాజ్యమని తెలుసుకోవాలి. ఓటు అనేది అభివృద్ధికి బాటలు వేసేలా ఉండాలి కానీ అవినీతికి పట్టం కట్టేలా ఉండొద్దు. ఓ జనులారా! జెండా కాదు అభ్యర్థి ఏజెండా చూడండి.

- కాల్వ నిఖిత,సిద్దిపేట

## ఆర్థిక సహాయం కల్పించాలి

విజ్ఞాన శాస్త్రాన్ని కేవలం వారి చదువులో భాగంగా పరిశోధన చేస్తూ ఒక దృక్పథంతో చేపట్టిన ప్రయోగ ఫలితాలు మనిషి జీవనానికి, ప్రాణరక్షణకు,సౌలభ్యానికి తోడ్పడే మహానుభావుల త్యాగం అమూల్యం, చిరస్మరణీయం. వాటి ఫలితాలు అనుభవించడం చాలా తేలిక. కావున అటువంటి ఆశయాన్ని, కృషిని గుర్తిస్తూ ఉన్నత విద్యావంతులు ఉద్యోగంతో పాటు మరింత ముందుకు సాగేందుకు కృషి చేస్తే మరిన్ని రంగాల్లో కొన్ని సమస్యలు పరిష్కారం అవ్వొచ్చు. వీటికోసం దేశంలో పరిశోధన చేసే విద్యార్థులకు ఆర్థిక సహాయం, ప్రోత్సాహం విరివిగా కల్పించాలి. వారికి అన్ని వనరులు కల్పిస్తే వయస్సు పెరిగినా లక్ష్యసాధనకోసం వారు శ్రమించగలరు.

-బి.మేఘనాథం, విశాఖపట్నం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# పెరుగుతున్న ఆర్థిక అసమానతలు

**దేశాల సంపద పెరుగుతూ, ప్రభుత్వాలు పేదరికంలోకి నెట్టబడు తున్నాయన్న నివేదిక విశ్లేషణ మన దేశంలో జరుగుతున్న పరిణామాలను సాక్షాత్కరించింది. నేషనల్ ఎసెట్ మానిటైజేషన్ పైప్లైన్,ప్రభుత్వరంగ సంస్థల వాటాల ఉపసంహా రణ, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, మూసివేతలు, ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టే విధా నాలు ఆర్థిక అసమానతలను మరింత పెంపొందిస్తాయన్న వాస్తవాన్ని ప్రభుత్వాలు గ్రహించాలి. అంతర్జాతీయ అనుభ వాల, నివేదికల సారాంశాన్ని క్రోడీకరించి, దేశ ఆర్థిక విధా నాలను పాలకులు పునఃసమీక్షి ంచుకోవలసిన సమయం ఆస న్నమైనది. సంపద కేంద్రీకృతం చేసే కార్పొరేట్ అనుకూల విధానాలను నిలువరించి, ఆదాయ అంతరాలను తగ్గించే దిశగా ప్రజానుకూల ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనే భవిష్యత్ తరాలకు చూపే నిజమైన దార్శనికత.**



జి. కిషోర్ కుమార్

ప్రపంచీకరణ వలన అవకాశాలు విశ్వవ్యాప్తమోతాయని, ఆర్థిక సంస్కరణల అమలు వలన అభివృద్ధి ఫలాలు అందరికీ చేరువౌతాయని ఊదరగొట్టిన ఆర్థిక సంస్కరణాభిలాషుల వాదనలని పూర్వపక్షం చేస్తూ, ఆర్థిక సంస్కరణలు, ఉదారవాద విధానాలు అమలు, ఆచరణలో విఫలయత్నమై తిరోగమన దిశలో పయనించి ఆదాయ అసమానతలని పెంచిందనే వాస్తవాన్ని ఇటీవల విడుదలయిన 'ప్రపంచ అసమానతల నివేదిక 2026' ఆవిష్కరించింది. ఈ నివేదికను ప్యారిస్ కేంద్రంగా ఉన్న వరల్డ్ ఇనీక్వాలిటి లాబ్ ఆధ్వర్యంలో 200 మంది రిసెర్చ్ స్కాలర్స్ క్షేత్ర స్థాయి కృషి, అధ్యయనం, సహాయ సహకారాలతో వివిధ దేశాల నివేదికలను, సూచీలను, పట్టికలను విశ్లేషించి అంతర్జాతీయంగా పెరుగుతున్న అసమాతల సారాంశాన్ని క్రోడీకరించారు. 'ప్రపంచ అసమానతల నివేదిక 2026' ప్రకారం, అత్యంత అసమానతలతో,పెరుగుతున్న పేదరికంతో కూడిన సంపన్న ఉన్నతవర్గం ఉన్నదేశంగా భారత్ ఆవిర్భవించింది. భారత దేశంలో సంపన్న వర్గంగా ఉన్న 1శాతం జనాభా, మొత్తం దేశ సంపదలో 40 శాతం సొంతం చేసుకున్నారు. అలాగే 37 శాతం ప్రపంచ సంపదను, ప్రపంచంలోని కేవలం 1 శాతం సంపన్న వర్గం నియంత్రిస్తోంది. భారత దేశంలో సగటు వార్షిక తలసరి ఆదాయం 7,273 డాలర్లుగానూ, సగటు నెలవారి ఆదాయం 605 డాలర్లుగా ఉంది. భారత దేశ జాతీయ ఆదాయం మొత్తంలో 58 శాతం మేరకు 10 మంది కైవసం చేసుకుంటున్నారు. ఆదాయ అంతరాలు స్థిరంగా కొనసాగుతూనే ఉన్నాయి. రెండు వర్గాల మధ్య ఆదాయ అంతరాల నిష్పత్తి 2014లో 38శాతం ఉంటే, 2024లో ఇది 38.2 శాతానికి పెరిగింది. దేశ జనాభాలో అత్యధికులు దేశ సంపదలో చాలా కొద్ది భాగంతోనే జీవిస్తున్నారని, దిగువన ఉన్న 50శాతం మంది జాతీయ ఆదాయంలో కేవలం 15 శాతం మాత్రమే పొందుతున్నారని నివేదిక పేర్కొన్నది. సంపద తారతమ్యాల విశ్లేషణలో భాగంగా భారతదేశంలో 10 శాతం సంపన్న వర్గం మొత్తం దేశ సంపదలో 65శాతం సంపదని కలిగివున్నదని నివేదిక వెల్లడించింది. అంతర్జాతీయంగా చూసినపుడు 0.001 గా ఉన్న కుబేరులు క్రింది స్థాయిలో ఉన్న 50శాతం కన్నా 3 రెట్లు సంపదను కైవసం చేసుకున్నారు. అంతర్జాతీయంగా ఉన్నత స్థాయిలో ఉన్న 10 శాతం సంపన్న వర్గం ప్రపంచ సంపదలో ఉన్న 75 శాతం సొంతం చేసుకున్నారు. క్రింది స్థాయిలో ఉన్న 50శాతం ప్రజానికం ప్రపంచ సంపదలో కేవలం 2 శాతం భాగస్వామ్యానికి పరిమితమయ్యారు. ప్రపంచ సంపద పంపిణీ విధాన ప్రక్రియలో చైనా పరిస్థితి పురోగమనంలో ఉండడం గమనార్హం. సంపద వృద్ధిలో ప్రజల భాగస్వామ్యం 40శాతానికి పెరిగి, ప్రపంచ సంపద పంపిణీలో ఉన్నత మధ్యతరగతి స్థాయికి చేరింది. అదే సమయంలో భారత్లో ఈ అంశంలో వృద్ధి నమోదుకాకపోగా, మరింత దిగజారుడు ధోరణి కనపర్చడం ఆందోళనకర పరిణామం. శ్రామిక మహిళా భాగస్వామ్యం చాలా తక్కువ స్థాయికి అంటే 15.7 శాతానికి పరిమితమవ్వడమే కాకుండా, వివిధ రంగాల వారీగా కూడా ఆదాయ అంతరాలు హెచ్చుస్థాయిలో చోటుచేసుకుంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా లింగ వివక్ష, అసమానత ధోరణులు కొనసాగుతూనే ఉన్నాయని, పురుషుల ఒక గంట సంపాదనతో పోల్చినప్పుడు మహిళలు దానిలో 61శాతానికి మాత్రమే పరిమితమవున్నారనేది నివేదిక సారాంశం. ప్రాంతాలవారీగా శ్రామిక మహిళా ఆదాయం ప్రాతిపదికగా చూసినప్పుడు మిడిల్ ఈస్ట్,నార్త్ ఆఫ్రికా 16 శాతం, సౌత్ ఈస్ట్ ఆసియా



20శాతం, సబ్ సహారన్ ఆఫ్రికా 28శాతం, ఈస్ట్ ఆసియా 34శాతం, యూరోప్ 40శాతంగా ఉంది. మొత్తం అంతర్జాతీయ శ్రామిక ఆదాయంలో మహిళా శ్రామిక ఆదాయం 25 శాతానికి పరిమితమయినది. వాతావరణ సమతౌల్యం అంశానికి సంబంధించి, ఉన్నత ఆదాయ వర్గానికి చెందిన 10 మంది సంపన్నులు 77శాతం మేరకు,అలాగే 1 శాతం అత్యంత సంపదవర్గం, 41శాతం మేరకు ప్రైవేటు పెట్టుబడుల అజమాయిషీతో కర్బన ఉద్గారాల ఉత్పత్తికి కారణమవుతున్నారు. పేదరిక స్థాయిలో ఉన్న 50శాతం మంది ప్రజల కర్బన ఉద్గారాల ఉత్పత్తి కేవలం 3శాతం మాత్రమే. ప్రపంచ వ్యాప్తంగా ఆదాయాలు, సంపద, లింగ వివక్ష వంటివి ఆర్థిక వ్యవస్థలలో క్రమానుగతంగా, ప్రభావవంతమైన, లోతైన ప్రభావాన్ని చూపుతున్నాయి. అతి తక్కువ మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం, అంతర్జాతీయంగా సంపద పంపిణీలో బలహీనమైన బహుపాక్షికమైన పోకడలు, పెరుగుతున్న మహాధనవంతుల సంపద కేంద్రీకరణ, బలహీనమైన పన్నుల విధానాల అమలు వంటి వాటితో పాటు, పన్నుల విధాన అమలు పద్ధతిలో లొసుగులు ధనిక వర్గానికి ప్రయోజనం చేకూర్చేవిగా ఉండడం, సవాళ్లను గుర్తించినప్పటికీ విధానపరమైన సిఫార్సులను అమలుచేయకపోవడం వంటి అంశాలు అసమాతల వృద్ధికి మూలకారణాలని ఈ నివేదిక నిర్ధారించింది. కోటీశ్వరులు, సహస్ర కోటీశ్వరులపై పన్నులు విధించే విధానంలో ప్రభుత్వాలు అవలంభిస్తున్నతిరోగమన పద్ధతుల ఫలితంగా ఆయా ప్రభుత్వాలు ఆదాయాలు కోల్పోవడం, నష్టపోవడం జరుగుతోందని, విద్యా, వైద్యం, వాతావరణం వంటి కీలక రంగాల అభివృద్ధిని ఇదిప్రభావితం చేస్తోందనేది నివేదికా బృంద అధ్యయనంలో అంతర్భాగంగా ఇమిడివున్న అంశం. ప్రగతిశీల పన్ను విధానాలను అమలుచేయాల్సిన ఆవశ్యకతను నివేదిక పునరుద్ఘాటించింది. పన్నులు విధించే ప్రక్రియలో లొసుగులను తొలగించి, సంపన్న, అతి సంపన్న వర్గాలపై ప్రభావవంతమైన సంపద పన్ను విధానాన్ని అమలుచేయాల్సిన ఆవశ్యకతను ఈ నివేదిక ఉటంకించింది. లింగ వివక్షతకు సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ, మహిళల వేతన రహిత పనివిధానానికి విలువనివ్వకపోవడం, మహిళల ఆర్థిక వెసులుబాటును అణిచివేస్తోందని, వేతనాలు లేని మహిళల శ్రమను గుర్తించాలని, దానిని తగ్గించాలని, ఇటువంటి అంశాల కోసం ప్రత్యేక కేటాయింపులు చేయడంతో పాటు, మహిళా శ్రామికుల భాగస్వామ్యం,నైపుణ్యాల మెరుగుదల, పిల్లల సంరక్షణ వంటి పరిస్థితులు వారికి అనుకూలంగా ఉండేలా చూడాల్సిన ఆవశ్యత ఉందని నివేదిక ప్రస్తుతించడం గమనార్హం.అంతర్జాతీయంగా భారతదేశంలోనూ, అసమానతలు చారిత్రాత్మక స్థాయికి చేరాయన్న అంశాన్ని ప్రపంచ అసమానతల నివేదిక 2026 స్పష్టం చేసింది. అంతర్జాతీయంగా సంపద పంపిణీలో భారతదేశ కుంగుబాటును సరిదిద్దుకోవాల్సిన ఆవశ్యకతను స్పష్టీకరించింది. సమ్మిళిత వృద్ధిసాధన కోసం మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం, సామాజిక న్యాయం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన, ధృఢమైన రాజకీయ చిత్తం, ప్రభావవంతమైన పరిపాలన, మానవ వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టివంటివి ఆవశ్యకమని నివేదిక ముక్తాయించింది. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్పీజి)అమలు నేపథ్యంలోఆంక్షలు, నియంత్రణలులేని, నయా ఉదారవాద విధానాల వలన ఆదాయ వ్యత్యాసాలు మరింతగా పెరిగాయి.నియంత్రణలేని నయా సరళీకరణ, ఉదారవాద ఆర్థిక విధానాల అమలు, సాగుతున్న ప్రస్తుత నేపథ్యంలో అంతర్జాతీయఅసమానతల నివేదిక 2026 ఆవిష్కరించిన భారతదేశ వాస్తవ పరిస్థితిని సమీక్షించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. దేశాల సంపద పెరుగుతూ, ప్రభుత్వాలు పేదరికంలోకి నెట్టబడుతున్నాయన్న నివేదిక విశ్లేషణ మన దేశంలో జరుగుతున్న పరిణామాలను సాక్షాత్కరించింది. నేషనల్ ఎసెట్ మానిటైజేషన్ పైప్లైన్,ప్రభుత్వరంగ సంస్థల వాటాల ఉపసంహరణ, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, మూసివేతలు, ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలు ఆర్థిక అసమానతలను మరింత పెంపొందిస్తాయన్న వాస్తవాన్ని ప్రభుత్వాలు గ్రహించాలి. అంతర్జాతీయ అనుభవాల, నివేదికల సారాంశాన్ని క్రోడీకరించి, దేశ ఆర్థిక విధానాలను పాలకులు పున:సమీక్షించుకోవలసిన సమయం ఆసన్నమైనది. సంపద కేంద్రీకృతం చేసే కార్పొరేట్ అనుకూల విధానాలను నిలువరించి, ఆదాయ అంతరాలను తగ్గించే దిశగా ప్రజానుకూల ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనే భవిష్యత్ తరాలకు చూపే నిజమైన దార్శనికత. •

# రైతుల సమస్యలు పట్టించుకోండి

తరిగోపుల నారాయణస్వామి

రైతు మన దేశానికి అన్నదాత. భూమిని తల్లిగా భావించి, ఎండలోనూ వానలోనూ శ్రమించి పండించే పంటలు మనకు ప్రాణాధారం. అలాంటి రైతు ఈ రోజుల్లో తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో అరటి, మిరప, పత్తి, మొక్కజొన్న, నువ్వులు వంటి పంటలు విస్తారంగా సాగు అవుతున్నాయి. పండించిన పంటకు సరైన ధర రాక రైతు నిరాశలో మునిగిపోతున్నాడు. పెట్టుబడి కూడా రాక చాలామంది పంటను పశువులకు మేతగా ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది. అయితే అదే పంటను దళారులు తక్కువ ధరకు కొని పట్టణాల్లో అధిక లాభాలతో అమ్మి ధనాన్ని కూడబెడుతున్నారు. పంట పండించిన రైతు నష్టపోతున్నాడు. పంట కొనుగోలు చేసే వినియోగదారుడు కూడా అధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. కానీ మధ్యలో ఏ శ్రమలేని దళారులు సంపన్నులవుతున్నారు. ఇది సామాజిక న్యాయానికి, సమానతా విలువలకు విరుద్ధం. దీనిని మార్చడం అత్యవసరం. ప్రభుత్వం రైతుకు కనీసం పెట్టుబడికన్నా ఎక్కువ లాభం వచ్చే ధరను భరోసా ఇవ్వాలి. మార్కెట్‌లో అన్యాయం చేసే దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. పంట నిల్వశాలలు, చల్లని నిల్వగదులు, రవాణా సౌకర్యాలు పెంచాలి. ప్రజా




ప్రతి నిధులు రైతుల సమస్యలను కేవలం మాటల్లోనే కాక, పనిలో కూడా పరిష్కరించాలి. వారు గ్రామాల్లోని రైతులతో కలిసి నడిచి వారి కష్టాలను అర్థం చేసుకోవాలి. జపాన్, ఇజ్రాయెల్ దేశాలలో రైతులు తక్కువ భూమిపై ఎక్కువ దిగుబడులు పొందుతున్నారు.అందుకు కారణం నీటి పొదుపు పద్ధతులు, శాస్త్రీయ పంట మార్గదర్శకాలు, రైతే నేరుగా అమ్మే విపణులు. మన రైతుకూ అలాంటి సౌకర్యాలు రావాలి. దళారులు లేకుండా రైతు పంట వినియోగదారుని చేరే మార్గాలు పెరగాలి. గ్రామస్థాయిలో రైతు బజార్లు, సం ఘాలు బలపడాలి. గ్రామ పంటగ్రామంలోనే అమ్ముకోవడం జరగాలి. పట్టణాల్లో స్థానిక పంటలకు మద్దతు పెరగాలి. వాతావరణ సూచనలు, పంటలకు కావలసిన సలహాలు రైతుకు తరచుగా అందాలి.పంట బీమా సంపూర్ణ రక్షణ ఇవ్వాలి. ఒక్క రైతు చెమట చుక్క కూడా వృథ కాకూడదు. స్థానిక రైతుల పట్ల ప్రేమ చూపాలి. రైతు పంటలనే ప్రాధాన్యత ఇవ్వాలి. రైతు కష్టాన్ని గౌరవించే మనస్తత్వం పెరగాలి. రైతు అభివృద్ధి చెందితేనే గ్రామాలు ప్రగతి పయనం పట్టగలవు. గ్రామాలు మెరుగుపడితేనే దేశం ఎదుగుతుంది. రైతు కష్టంతో దేశం జీవిస్తుంది. రైతు నవ్వితేనే ప్రతి ఇంటిలో ఆనందం వెలుగుతుంది. రైతును నిలబెట్టడం మనందరి కర్తవ్యం. •

# ద్రవిడ రాజకీయాన్ని విజయ్ తిరగరాస్తాడా?

గోరంట్ల శివరామకృష్ణ

మరో కొన్నినెలల్లో తమిళనాట అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. అక్కడి రాజకీయాలు వేడెక్కుతున్నాయి. సుమారు 50ఏళ్లుగా ద్రవిడ రాజకీయం పేరుతో అక్కడ పాలన చేస్తున్న డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలకు అనుబంధ పక్షాలుగా ఉన్న కాంగ్రెస్, బీజేపీలకు సవాలు విసురుతూ జనంలోకి పోతున్నాడు ప్రముఖ సినీనటుడు టీవీకే అధినేత విజయ్. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలే తన లక్ష్యంగా సభలు నిర్వహిస్తూ ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తున్నారు. 234 ఎమ్మెల్యేలున్న ప్రస్తుత తమిళనాడు అసెంబ్లీలో డీఎంకేకు 132మంది, అన్నాడీఎంకేకు 62మంది, కాంగ్రెస్‌కు 18, బీజేపీకి నలుగురు ఎమ్మెల్యేలున్నారు. వీరిలో కాంగ్రెస్, వామపక్షాలు అధికార డీఎంకేకు మద్దతుగా నిలుస్తుండగా, బీజేపీ అన్నాడీఎంకేలు ఒక జట్టుగా వ్యవహరిస్తున్నాయి.అయితే ఈ రెండు కూటములకు ప్రత్యామ్నాయంగా తన కొత్త పార్టీ నిలవాలని భావిస్తున్న విజయ్ మనసులో మాట బయటపెట్టకుండా తనదైన శైలిలో జనంలోకి పోతూ రోజురోజుకూ తన బలాన్ని పెంచుకుంటున్నారు. నిజానికి ద్రవిడ రాజకీయానికి, సినిమాకు అవినాభావ సంబంధం అనాదిగా కొనసాగుతూనే ఉంది. సినిమా రచయిత కరుణానిధి, ఆయన మిత్రుడు, ప్రత్యర్థి ఎంజీఆర్, ఆ తర్వాత సినీ నటి జయలలిత తమిళ సీఎంలుగా గద్దెనెక్కగా, మరెందరో సినీనటులు కీలక పదవులను అధిష్టించగలిగారు.అంతే కాదు తమిళనాట సినీనటులు రాజకీయాల్లో రాణించినతర్వాతే తెలుగునాట ఎన్టీఆర్ సీఎం అయ్యారు.దక్షిణాదిన జీవించే వారే మూలభారతీయులనీ, వీరు ఆర్యుల కంటే ప్రాచీనులనీ, ద్రవిడ సంస్కృతే నిజమైన భారతీయ సంస్కృతిఅని, మనమంతా ఆ ఘనమైన సంస్కృతికి వారసులుగా గర్వపడాలని చెబుతూనాడు పెరియార్ ద్రవిడ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమంలో మరొక నేత అన్నాదొరై కీలక పాత్ర పోషించారు. కొన్ని సినిమాల్లో నటించటమే గాక మాటల రచయితగానూ పనిచేశారు. జనంలో బలమైన ద్రవిడ భావన తీసుకొచ్చేందుకు అన్నాదొరై సినిమాను బలమైన మాధ్యమంగా గుర్తించి వాడుకొని, డీఎంకే పార్టీని స్థాపించి, తర్వాతి రోజుల్లో సీఎం కాగలిగారు. ఆ ఉద్యమంలో అప్పటికి సినీమాటల రచయితగా ఉన్న కరుణానిధి, సినీనటుడిగా ఉన్న ఎంజీ రామచంద్రన్ తదితరులు.. అన్నాదొరైకు అండగా నిలిచారు. వీరిలో కరుణానిధి తన పదునైన సినిమా డైలాగులతో, రామచంద్రన్ తన నటనతో తమిళుల మనసును గెలుచుకోగలిగారు. 1972లో అన్నాదురై మరణం తర్వాత డీఎంకే తరపున సీఎం అయిన కరుణానిధి మరో నాలుగు సార్లు ఆ పదవిని అధిష్టించారు. మిత్రుడైన కరుణానిధి తొలిసారి సీఎంగా ఉన్నకాలంలో ఆయనతో వచ్చిన రాజకీయ విరోధాల వల్ల డీఎంకేలో ఇమడలేకపోయిన ఎంజీ రామచంద్రన్ అన్నాడీఎంకే పేరుతో కొత్త పార్టీ పెట్టుకున్నారు. 1977 అసెంబ్లీ ఎన్నికల్లో ఘన



విజయం సాధించిన ఆయన 1987వరకు సీఎంగా కొనసాగారు. ఆయన మరణం తర్వాత ఈయన రాజకీయ వారసురాలిగా వచ్చిన జయలలిత 4 సార్లు సీఎంగా రాణించారు. తర్వాత ప్రముఖ నటుడు కమలహాసన్ 2018లో మక్కల్ నీది మైయం అనే రాజకీయ పార్టీని స్థాపించి రాజకీయ అరంగేట్రం చేసినాపెద్దగా రాణించలేకపోయారు. కరుణానిధి, జయలలిత మరణం తర్వాత తమిళనాట ఏర్పడినరాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకు బీజేపీ చురుగ్గా పనిచేస్తోంది. కొత్త పార్లమెంటులో సెంగోల్ ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలతో తన ఓటు బ్యాంకును పెంచుకునే ప్రయత్నాలు చేస్తోంది. ప్రతిజిల్లాలో పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించి, 1,2,3 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించటం, 2018 నాటి తూత్తుకుడిపోలీసు కాల్పుల్లో మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించటం వంటి సేవాకార్యక్రమాలతో యువతలో తన బలం పెంచుకున్న విజయ్ 2023చివరిలో తన రాజకీయ ప్రవేశం గురించి హింట్ ఇచ్చారు. 224 ఫిబ్రవరిలో 'తమిళగ వెట్రి కళగం'(టీవీకే) పేరుతో పార్టీ పెట్టి జనంలోకి దూసుకుపోతున్నారు. అవినీతి, విభజనపూరిత పాలనకు వ్యతిరేకంగా తాను రాజకీయాల్లోకి వచ్చానని, తనకు అవకాశమిస్తే.. తమిళనాడును దేశంలోనే నంబర్ 1 రాష్ట్రంగా మారుస్తానని విజయ్ పదేపదే చెబుతున్నారు.చదువుకున్న మహిళా అభ్యర్థులకు రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాధాన్యం ఇస్తాననీ, తమ పార్టీలోకి వచ్చేవారికి నేర చరిత్ర, అవినీతి మరకలు ఉండకూడదని ఆయన చెబుతున్నారు. తన పార్టీలో సినిమా నటులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉండదనీ ఆయన స్పష్టం చేశారు.టీవీకే నుంచి తానే ముఖ్యమంత్రి అభ్యర్థిగా విజయ్ ఇది వరకే ప్రకటించుకున్నారు. ద్రావిడ రాజకీయ ప్రభంజనంగా పేరొందిన ఎంజీ రామచంద్రన్‌లా తానూ వస్తున్నట్లు విజయ్ పలు సందర్భాల్లో పేర్కొన్నారు. సామాజిక న్యాయం,సమానత్వం, లౌకికవాదం,తమిళ సంస్కృతి పరిరక్షణ,అవినీతి నిర్మూలన, మహిళా సాధికారతకు పెద్దపీట వేశారు. పెరియార్, అంబేద్కర్ మాజీ ముఖ్యమంత్రి కె.కామరాజ్, స్వాతంత్ర్య సమర యోధులు రాణి వేలు నాచియార్, అంజలై అమ్మాళ్ తమ సైద్ధాంతిక స్ఫూర్తి అన్నారు. పుట్టుకతో అందరూ సమానమే అంటూ ప్రతి సభలోనూ నినదిస్తున్నారు. కేంద్ర తెస్తున్న త్రిభాషా విధానాన్ని వ్యతిరేకించటం, పార్లమెంటు నియోజక వర్గాల పునర్విభజన ప్రక్రియ, సీఏఏపై కేంద్రం తీరునూ విజయ్ తప్పుబట్టారు. కేంద్రం అమలు చేయాలనుకుంటున్న ఒకేదేశం, ఒకే ఎన్నిక విధానం ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడం లాంటిదేనని మండిపడిన విజయ్ తమిళ విద్యార్థులకు అవరోధంగా ఉన్ననీట్‌పరీక్షల తీరుపై విమర్శలు సంధిస్తూ తాను బీజేపీతో కలవబోనని సంకేతాలు ఇస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల్లో అసంతృప్తిగా ఉన్న నేతలను తనపార్టీలోకి ఆహ్వానిస్తూ పార్టీని బలోపేతంచేస్తున్నారు. అన్నాడీఎంకేలో ఏకంగా 9వసారి ఎమ్మెల్యేగా గెలిచిన సీనియర్ నేత సెంగోట్టైయ్యన్ తిరుగుబాటు చేయడంతో పార్టీ బహిష్కరించటంతో ఆయనకు స్వాగతం పలికి ప్రత్యర్థులకు షాకిచ్చారు విజయ్. కెప్టెన్ విజయకాంత్ తీసుకొచ్చిన దేశీయ ముర్పోక్కు ద్రావిడ కళగంతో సహా పలు చిన్న పార్టీలనూ కలిపి కూటమికట్టే యత్నాల్లో బిజీగాసాగిపోతున్నారు విజయ్. ఈ ప్రయత్నంలో విజయ్ ఏమేరకు విజయం సాధిస్తారనేది తెలియాలంటే.. మరికొన్ని నెలలు వేచిచూడాల్సిందే. •

# బాండీబీచ్‌లో యూదులపై కాల్పులు



## 12 మందిపైగా మృతి, మరికొందరికి తీవ్ర గాయాలు

## హాహాకారాలు చేస్తూ పరుగులు తీసిన పర్యాటకులు

**సిడ్నీ, డిసెంబరు 14:** ప్రముఖ పర్యాటక బాండీ బీచ్‌లో పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. శాంతి వాతావరణాన్ని భగ్నంచేస్తూ యూదుల పండుగ 'హనుక్క' తొలి రోజే లక్ష్యంగా ఈకాల్పులు జరిపారు. సిడ్నీలోని బాండీ బీచ్‌లో జరిగిన ఈ ఘటనలో కనీసం 12 మంది పర్యాటకులు మృతిచెందగా పలువురు గాయపడ్డారు. ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు మొత్తం 50 రౌండ్ల పాటు కాల్పులు జరిపినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పోలీసుల కాల్పుల్లో దుండగుడు హతమవ్వగా మరొకర్ని అరెస్ట్ చేసినట్టు అధికారులు తెలిపారు. ఉగ్రవాదుల కాల్పులతో పర్యాటకుల హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు. ప్రశాంతంగా ఉన్న బీచ్‌లో ఒక్కసారిగా బీతావాహ పరిస్థితి నెలకుంది. ఈ కాల్పుల ఘటనపై ఆస్ట్రేలియా ప్రధాన మంత్రి ఆంథోనీ అల్బనీస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని ఆయన అన్నారు. ఘటనా స్థలిలో బాధితులను రక్షించేందుకు పోలీసులు, అత్యవసర సహాయ సిబ్బంది ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఎఎఫ్‌పి కమిషనర్, న్యూసౌత్‌వేల్స్ ప్రీమియర్‌లతో మాట్లాడాను మేము స్థానిక పోలీసులతో కలిసి పనిచేస్తున్నాం, మరిన్ని వివరాలను ధ్రువీకరించిన అనంతరం తదుపరి సమాచారం అందిస్తాం, పోలీసుల సూచనలను ప్రజలు పాటించాలని ఆసీస్ ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ విజ్ఞప్తి చేసారు. బాండీ బీచ్‌లో ఘటనపై సమాచారం అందిన వెంటనే స్పందించామని న్యూ సౌత్ వేల్స్ పోలీసులు చెపుతూ అక్కడ ఉన్నవారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. కాల్పులు జరిపిన ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నామనిపోలీసులు చెప్పారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని, పోలీసులిచ్చే అన్ని సూచనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఎనిమిది రోజుల పాటు కొనసాగే యూదుల పండుగ 'హనుక్కా' మొదటి రోజే ఈ ఘటనచోటుచేసుకుంది. ఆస్ట్రేలియా కాలమానం ప్రకారం సాయంత్రం 6.30 గంటల తర్వాత యూదుల పండుగ ఆరంభాన్ని గుర్తిస్తూ బీచ్‌లో వందలాది మంది చేరిన సమయంలోనే దుండగులు కాల్పులుప్రారంభించారు. పిల్లలు,వృద్ధులు అనే తేడా లేకుండా విచక్షణరహితంగా కాల్పులు జరిపారు. ఘటనపై ప్రతిపక్ష నాయకురాలు సుసాన్‌లే తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మన మంతా ఏంతో ఇష్టపడే బాండీలో జరిగిన విద్వేషపూరిత హింసతో యావత్తు దేశం శోకంలో మునిగిపోయిందని వాపోయారు. అయితే కాల్పుల్లో ఒక పర్యాటకుడు యూదు వ్యక్తి ఉగ్రవాదిని ప్రతిఘటించి ఆతడి చేతిలో తుపాకీ లాక్కుని కాల్పులు జరపడంతో ఉగ్రవాది అక్కడికక్కడేహతమయ్యాడు. ఈఘటనపై ఇజ్రాయెల్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. నిఘా వైఫల్యం వల్లనే ఇలాజరిగిందని, ఆసీస్‌ప్రభుత్వం ఇందుకు బాధ్యత వహించాలని ఒక నిరసనను ఆస్ట్రేలియా ప్రభుత్వానికి తెలియజేసింది.



## వచ్చే ఫిబ్రవరి 12న బంగ్లాదేశ్ ఎన్నికలు

### ప్రధాన ఎన్నికల కమిషనర్ నాసిర్ ఉద్దీన్ వెల్లడి

**ఢాకా, డిసెంబరు 14:** బంగ్లాదేశ్‌లో రాజకీయాలు క్షణక్షణం మారుతున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12వ తేదీన దేశంలో సాధారణ ఎన్నికలు జరగనున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ నాసిర్ ఉద్దీన్ ప్రకటించారు. ఎన్నికలు నిర్వహించాలన్న ఒత్తిళ్లు పెరుగుతుండటంతో కేర్‌టేకర్ ప్రభుత్వ చీఫ్ మహ్మద్‌యూనస్ ఎన్నికల నిర్వహణకు తలొగ్గాల్సి వచ్చింది. బంగ్లాదేశ్‌లో సాధారణ ఎన్నికల నిర్వహణకు ముహూర్తం ఖరారు అయింది. ముఖ్యంగా ఈనెల 29వ తేదీ నుంచి నామినేషన్లు వేయాల్సి ఉండగా వచ్చే ఏడాది జనవరి 20వ తేదీ వరకు ఉపసంహరణ గడువు ఉంటుంది. అలాగే ఫిబ్రవరి 12వ తేదీన పోలింగ్ నిర్వహించ నున్నారు. బంగ్లాదేశ్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 127.6 మిలియన్లకు పైగాఉన్నారు. వీరంతా ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియో గించుకో నున్నారు. ఒకేరోజు పార్లమెంటరీ ఎన్నికలతో పాటు రాజ్యాంగ సంస్కరణలపై రెఫరెండం నిర్వహించడం బంగ్లాదేశ్ చరిత్రలో ఇదే తొలిసారి. అయితే ఈ నిర్ణయాన్ని ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ బిఎన్‌పి వ్యతిరేకించింది. గత యేడాది ఆగస్టు ఆందోళనల తర్వాత మాజీ ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీ కార్యకలా పాలను నిషేధించారు. దీంతో గణనీయమైన మద్దతు ఉన్న అవామీ లీగ్ ఎన్నికల్లో పాల్గొనే అవకాశం లేకపోవడం, ఎన్నికల పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. మరోవైపు హసీనా పాలనలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బిఎన్‌పి ఈ ఎన్నికల్లో ముందున్నట్లు భావిస్తున్నారు. అలాగే 2024 ఆగస్టులో జరిగిన ఆందోళనలకు నేతృత్వం వహించిన విద్యార్థిఉద్యమంనుంచి పుట్టిన నేషనల్ సిటిజన్ పార్టీ, జమాత్‌ఏఇస్లామీకి చెందిన అమర్ బంగ్లాదేశ్ పార్టీతో పొత్తు పెట్టుకొని ఈ ఎన్నికల బరిలోకి దిగుతున్నాయి. షేక్ హసీనా ప్రభుత్వం దిగిపోయినతర్వాత బంగ్లాదేశ్‌లో జరుగనున్న ఈ ఎన్నికలు ఇపుడు అక్కడి రాజకీయ పార్టీలకే కాకుండా ప్రపంచదేశాలను ముఖ్యంగా ముస్లిం దేశాలకు ప్రాధాన్యతాంశంగా మారాయి.



## సిరియాలో ఐసిస్ దాడులు

### ఇద్దరు అమెరికా సైనికులు, ఒక ట్రాన్స్‌లేటర్ మృతి

**బీరూట్, డిసెంబరు 14:** సిరియాలో ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు, ఒక పౌర అనువాదకుడు మరణించారు. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. దీనికి చాలా తీవ్రమైన ప్రతీకారం ఉంటుందని హెచ్చరించారు. ఈ దాడిలో మరో ముగ్గురు సైనికులు గాయపడినట్లు ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్టులో తెలిపారు. ఐసిస్‌ను నిర్మూలించేందుకు అమెరికా చేపట్టిన ఆపరేషన్ ఇన్హెరెంట్ రిజాల్వ్‌లో భాగంగా ఈ సైనికులు పనిచేస్తున్నారు. పాల్మైరా ప్రాంతంలో కీలక నేతలతో సమావేశమవుతున్న సమయంలో ఈ దాడి జరిగింది. గత ఏడాది డిసెంబర్‌లో బషర్ అల్‌అస్సాద్ అధికారం కోల్పోయిన తర్వాత సిరియాలో అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోవడం ఇదే తొలిసారి. దాడికి పాల్పడిన వ్యక్తి సిరియా ప్రభుత్వ దళాలకు చెందిన సైనికుడేనని అక్కడి ప్రభుత్వం అంగీకరించడం గమనార్హం. అయితే, అతడిని ఇప్పటికే మట్టుబెట్టామని, అంతర్గత భద్రతా విభాగంలో అతడికి ఎలాంటి నాయకత్వ పాత్ర లేదని సిరియా ప్రభుత్వ ప్రతినిధి స్పష్టం చేశారు. పాల్మైరా ప్రాంతంలో ఐసిస్ దాడి జరిగే ప్రమాదం ఉందని తాము ముందే అమెరికాను హెచ్చరించినా వారు పట్టించుకోలేదని సిరియా ఆరోపించింది. ఈ దాడి జరిగిన ప్రాంతం సిరియా కొత్త ప్రభుత్వ పూర్తి నియంత్రణలో లేదని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఘటనపై సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్‌షరా తీవ్ర ఆగ్రహంతో, ఆవేదనతో ఉన్నారని తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో భాగంగా ఇటీవలే అల్‌షరా వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో సమావేశమయ్యారు. తాజా పరిణామం ఇరు దేశాల మధ్య సహకారానికి పరీక్షగా నిలిచింది.

# రోడ్ ఐలాండ్ బ్రౌన్ వర్సిటీలో కాల్పులు

## ఇద్దరు మృతి, ఎనిమిది మందికి గాయాలు



**రోడ్ ఐలాండ్( యుఎస్), డిసెంబరు 14:** అమెరికాలో మరోసారి కాల్పుల ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. రోడ్ ఐలాండ్ రాష్ట్రంలోని ప్రఖ్యాత బ్రౌన్ యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన కాల్పుల్లో ఇద్దరు మరణించగా, మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. యూనివర్సిటీలో ఫైనల్ పరీక్షలు జరుగుతున్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. నిందితుడి కోసం పోలీసులు క్యాంపస్ వ్యాప్తంగా గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ప్రొవిడెన్స్ మేయర్ బ్రెట్ స్మైలీ ఈ ఘటనను ధ్రువీకరించారు. నల్లటి దుస్తులు ధరించిన ఓ వ్యక్తి ఈ కాల్పులకు పాల్పడి, ఇంజినీరింగ్ భవనం నుంచి పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, అధికారులు సురక్షితమని ప్రకటించే వరకు బయటకు రావద్దని మేయర్ విజ్ఞప్తి చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు. ఘటన జరిగిన వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు యూనివర్సిటీ అధికారులు తొలుత ప్రకటించినా, ఆ తర్వాత ఆ సమాచారాన్ని సరిదిద్దారు. నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోందని స్పష్టం చేశారు. తొలుత అదుపులోకి తీసుకున్న వ్యక్తికి ఈ ఘటనతో సంబంధం లేదని తేలినట్లు మేయర్ స్మైలీ పేర్కొన్నారు. ఈ దాడిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఘటన గురించి అధికారులు తనకు వివరించారని, బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా విచారం వ్యక్తం చేస్తూ, దర్యాప్తులో ఎఫ్‌బీఐ సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం క్యాంపస్‌ను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని, దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## 12 చిన్న ప్రావిన్సులుగా పాకిస్థాన్ అంతర్గత విభజన!



**ఇస్లామాబాద్, డిసెంబరు 14:** స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత పాకిస్థాన్‌లో మళ్లీ విభజన అంశం ప్రస్తావనకు వచ్చింది. ఒకటి, రెండుకాదు.. ఏకంగా 12 భాగాలుగా పాకిస్థాన్‌ను విభజించాలని పాక్‌షరీఫ్ ప్రభుత్వం యోచిస్తోంది. అయితే ఇది కేవలం అంతర్గత విభజన. పాక్ జాతీయ సమాచార శాఖ మంత్రి అబ్దుల్ అలీమ్ ఖాన్ విభజన గురించి ప్రకటించడంతో దీనిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. పాలనా సౌలభ్యం, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే పాకిస్థాన్‌ను 12 చిన్న ప్రావిన్సులుగా విభజించాలని నిర్ణయించామని మంత్రి చెప్పారు. పాకిస్థాన్‌లో ప్రస్తుతం ఉన్న నాలుగు ప్రావిన్స్‌లు - పంజాబ్, సింధ్, ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ లను విభజించి 12 చిన్న ప్రావిన్సులుగా చేయడానికి రంగం సిద్ధమైందని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. దీని గురించి పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌ల మధ్య ఇప్పటికే చివరి దశ చర్చలు ముగిశాయని మరి కొద్ది రోజుల్లోనే ఈ విభజన ప్రక్రియ మొదలవుతుందన్న ప్రచారం జోరందుకుంది. స్వాతంత్ర్యం నాటికి అంటే 1947 కాలంలో పాకిస్తాన్‌లో ఐదు ప్రావిన్సులు ఉన్నాయి. అవి బలుచిస్తాన్, తూర్పు బెంగాల్, సింధ్, పశ్చిమ పంజాబ్, వాయువ్య సరిహద్దు ప్రావిన్స్. మెరుగైన సేవలు, పరిపాలనా సౌలభ్యం కోసమే చిన్న ప్రావిన్సుల ఏర్పాటు చేయాలనుకుంటున్నట్టు పాక్ పాలకులు చెబుతున్నా దేశంలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతకొంతకాలంగా ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్తాన్ ప్రాంతాల్లో ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ రెండు ప్రాంతాల ప్రజలు తమను స్వతంత్ర దేశాలుగా ప్రకటించాలని గత కొంత కాలంగా ఆందోళనలు చేస్తున్నారు. అలానే పాక్ ప్రధాని, అసిమ్ మునీర్‌ల పాలన మీద ప్రజల్లో వ్యతిరేకత రోజు రోజుకు పెరుగుతోంది. దీంతో విభజన చర్చ తెర మీదకు వచ్చింది.

# పవార్ పుట్టినరోజు వేడుకల్లో అదానీ, రాహుల్ కరచాలనం!



**ముంబయి, డిసెంబరు 14:** ఎన్సీపీ అధినేత శరద్ పవార్ పుట్టినరోజు విందులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆయన నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ముఖాముఖిగా కలుసుకున్నారు. ఇద్దరూ కరచాలనం కూడా చేసుకున్నారు. ఈ అరుదైన దృశ్యం కెమెరాల్లో బందీ కాకుండా నిర్వాహకులు చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈనెల 11న శరద్ పవార్ 85వ పుట్టినరోజు సందర్భంగా ఈ విందు జరిగింది. రాజకీయాలకు అతీతంగా సంబంధాలు నెరిపే పవార్, ఈ కార్యక్రమానికి అన్ని పార్టీల నేతలతో పాటు వ్యాపార ప్రముఖులను కూడా ఆహ్వానించారు. ఈ విందులో రాహుల్ గాంధీ, పవార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్న ఫోటోలు బయటకు వచ్చినా, రాహుల్, అదానీ కలిసిన ఫోటోలు మాత్రం కనిపించలేదు. సీనియర్ జర్నలిస్టులు రాజ్‌దీప్ సర్దేశాయ్, ఆదేశ్ రావల్ ఒక చర్చా కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించారు. రాహుల్, అదానీ ముఖాముఖిగా కలవడం నేను చూడటం అదే మొదటిసారి. కానీ ఆశ్చర్యంగా వారి ఫోటో ఒక్కటి కూడా బయటకు రాలేదుఅని సర్దేశాయ్ తెలిపారు. ఆ సమయంలో పవార్ కుమార్తె, బారామతి ఎంపీ సుప్రియా సూలే జోక్యం చేసుకుని, వారిద్దరి ఫోటోలు ఎవరూ తీయకుండా అడ్డుకున్నారని ఆదేశ్ రావల్ వివరించారు. ఈ ఫోటో బయటకు వస్తే రాజకీయంగా కాంగ్రెస్‌కు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవు తాయని ఆమె భావించి ఉండవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలు లేకపోయినా, విషయం తెలిసిన వెంటనే బిజెపి కాంగ్రెస్‌పై విమర్శలు ఎక్కుపెట్టింది. అదానీపై నిత్యం గొంతు చించుకునే రాహుల్ గాంధీ, ఇప్పుడు ఆయనతో కలిసి విందులో పాల్గొనడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని బిజెపి నేతలు ఆరోపించారు. గత కొన్నేళ్లుగా అదానీ గ్రూప్‌ను లక్ష్యంగా చేసుకుని రాహుల్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఇటీవల కాంగ్రెస్ వైఖరిలో మార్పు కనిపిస్తోందని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అదానీ గ్రూప్ భారీ పెట్టుబడులు పెట్టడమే దీనికి నిదర్శనమని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# కొత్తసంవత్సరంలోనూ రెండు చంద్రగ్రహణాలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** కొత్త సంవత్సరంలో రెండు చంద్రగ్రహణాలు కనువిందు చేయబోతున్నాయి. 2025 సంవత్సరంలో కూడా రెండు చంద్రగ్రహణాలు ఏర్పడిన విషయం తెలిసిందే. కొత్త సంవత్సరంలో మార్చి, ఆగస్టు మాసాల్లో చంద్రగ్రహణాలు ఏర్పడనున్నాయి. వాస్తవానికి చంద్రుడు సొంతంగా ప్రకాశించలేడు. సూర్యకిరణాలు చంద్రుడిపై పడినప్పుడు అవి అక్కడి నుంచి ప్రతిబింబిస్తాయి. అందుకే చంద్రుడు ప్రకాశించినట్లుగా మనకుకనిపిస్తుంది. సూర్యుడిచుట్టూ భూమి కక్ష్యలో ఉన్నప్పుడు, చంద్రుడు సూర్యుడికి మధ్యలో భూమి వస్తుంటుంది. ఆ సమయంలో సూర్యకాంతి చంద్రుడిపైపడదు. సూర్యుడు,భూమి, చంద్రుడు వాటికక్ష్యలో ఒకే వరుసలో ఉన్న సమయంలో మాత్రమే ఇలా జరుగుతుంది. ఆ సమయంలో భూమి నీడ చంద్రుడిపై పడుతుంది. దీంతో, చంద్రుడిపై నీడ ఉన్న భాగం చీకటిగా మారుతుంది. మనం భూమిపై నుంచి చూసిన సమయంలో ఆ భాగం మొత్తం నల్లగా కనిపిస్తుంది. దాన్నే మనం చంద్రగ్రహణంగా పిలుస్తుంటాం. 2026లో తొలి చంద్రగ్రహణం మార్చి 3న ఏర్పడుతుంది. ఇది పాక్షిక చంద్రగ్రహణం. ఈ గ్రహణం తూర్పు యూరప్, ఆసియా, ఆస్ట్రేలియా, నార్త్ అమెరికా, సౌత్ అమెరికా, ఫసిఫిక్, అట్లాంటిక్, ఆర్కిటిక్, అంటార్కిటికా ప్రాంతాల్లో కనిపిస్తుంది. అలాగే, భారత్‌లోనూ ఈ గ్రహణం దర్శనమిస్తుంది. భారతకాలమానం ప్రకారం సాయంత్రం 6.26 గంటలకు మొదలై.. 6.46 గంటలకు ముగుస్తుంది. రెండో చంద్రగ్రహణం ఆగస్టు 28న ఏర్పడుతుంది. ఈ గ్రహణం భారత్‌లో కనిపించేందుకు అవకాశం లేదు. రెండో గ్రహణం యూరప్, వెస్ట్ ఆసియా, ఆఫ్రికా, నార్త్ అమెరికా, సౌత్ అమెరికా, ఫసిఫిక్, అట్లాంటిక్ ప్రాంతాల్లో కనిపిస్తుంది.

# ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో హమాస్ కమాండర్ హతం

**జెరూసలెం, డిసెంబరు 14:** ఇజ్రాయెల్‌పై హమాస్ భీకర ఉగ్రదాడిచేసింది. 1200 మందినిక్రూరంగా హతమార్చిన ఈ సంఘటనకు పథకరచనచేసిన అసలు కమాండర్‌ను ఇజ్రాయెల్ హతమార్చింది. ఈ మారణహోమానికి సూత్రధారుల్లో ఒకరుగా ఉన్న సీనియర్ హమాస్ సైనిక కమాండర్‌పై వైమానిక దాడిచేసి హతమార్చింది. కస్సామ్‌బ్రిగేడ్స్‌లో సీనియర్ సభ్యుడుగా ఉన్న రాద్‌సాద్‌ను ఐడిఎఫ్‌దళాలు హతమార్చాయి. హమాస్‌కు ఆయుధాలు సమీకరించుకునేందుకు, తయారుచేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. హమాస్ ప్రస్తుత సైనిక అధిపతి ఇజ్ అల్‌దిన్ హద్దాద్‌కు డిప్యూటీగా ఆతడు పరిగణించబడ్డాడని ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. ఈదాడికి సంబందించిన విడియోను కూడా విడుదలచేసింది. ఒక వాహనం పేలిపోతున్నట్లు ఇందులోఉంది. రషీద్‌కోస్టల్‌రోడ్‌లో కారులో పారిపోతున్న సమయంలో సాద్‌పై దాడిజరిగింది.
గాజాలో ఇప్పటికీ పనిచేస్తున్న హమాస్ కమాండర్లలో సాద్‌కూడా ఒకరని ఐడిఎఫ్ ప్రకటిం చింది. ఇజ్రాయల్ బలగాలపై దాడులుచేయడానికి సాద్ అనేక ప్రయత్నాలు చేసాడని కాల్పుల విరమణ ఒప్పందాన్ని కూడా ఉల్లంఘిస్తున్నట్లు ఇజ్రాయెల్ ఆరోపించింది.

# లిబియాలో గుజరాత్ కుటుంబం కిడ్నాప్

## లోకల్ నేరగాళ్ల చెరలో ఉన్నట్లు గుర్తింపు

**హైదరాబాద్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** అక్రమంగా విదేశాల్లో స్థిరపడాలని భావిస్తున్న గుజరాత్‌కు చెందిన మరో కుటుంబం అస్థిరంగా వుంటూ ఉగ్రవాదులకు అడ్డాగా వున్న ఆఫ్రికా దేశం లిబియాలో కిడ్నాపర్లకు బందీలుగా చిక్కారు. దుబాయ్ నుంచి లిబియా మీదుగా యూరోపియన్ దేశం పోర్చుగల్‌కు వెళ్లి అక్కడ అక్రమంగా స్థిరపడాలని గుజరాత్‌కు చెందిన కిస్మత్‌సింగ్ చావ్డా కుటుంబం భావించి మధ్యలో కిడ్నాపర్ల వద్ద బందీలుగా వున్నారు. గుజరాత్‌లోని మొహసానా జిల్లా బాదల్‌పురాకు చెందిన కిస్మత్ సింగ్ చావ్డా సోదరుడు పోర్చుగల్‌లో స్థిరపడ్డాడు. తాను కూడా ఆ దేశంలో స్థిరపడాలని కిస్మత్ సింగ్ చావ్డా భావించాడు. ఇందుకు పోర్చుగల్‌లో వున్న అతని సోదరుడు అంగీకరించాడు. దీని తరువాత గత నెల 29వ తేదీన కిస్మత్ సింగ్ చావ్డా తన భార్య హీనా బెన్, కుమార్తె దేవాన్షీలతో కలిసి దుబాయ్ వెళ్లి అక్కడి నుంచి లిబియాలోని బెంఘాజి నగరానికి వెళ్లాడు. లిబియా నుంచి పోర్చుగల్‌కు వెళ్లే క్రమంలో వీరిని బెంఘాజి నగరంలో అక్కడి నేరగాళ్లు కిడ్నాప్ చేశారు. వీరిని ప్రాణాలతో వదలాలంటే రెండు కోట్ల రూపాయలు ఇవ్వాలని కిడ్నాపర్లు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని రెండు రోజుల క్రితం కిస్మత్ సింగ్ చావ్డా గుజరాత్‌లోని తన కుటుంబానికి చెప్పగా వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి సహాయం చేయాలని కోరారు. దీంతో మెహసానా జిల్లా కలెక్టర్ ప్రజాపతితో పాటు పోలీసు అధికారులు కేంద్ర హోం శాఖ అధికారులకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించిన కేంద్ర హోం శాఖ లిబియాలోని భారత రాయబార కార్యాలయానికి సమాచారం అందించి కిడ్నాపర్ల చెరలో వున్న బాధితులను కాపాడాలని కోరింది. దీనిపై లిబియా దేశ పోలీసులు విచారణ చేబట్టారని గుజరాత్ పోలీసులు తెలిపారు. కాగా రెండు నెలల క్రితం అమెరికాకు అక్రమంగా వెళ్లాలని భావించిన ఓ కుటుంబం ఇరాన్‌లో ఉగ్రవాదుల బందీగా మారగా కేంద్ర హోం శాఖ ఇరాన్ ప్రభుత్వంతో చర్చించి విడుదల చేయించింది.



## భారత్‌పై అక్కసు వెళ్లగక్కిన లష్కరే ఉగ్రవాది

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ భారత్‌పై తన అక్కసు వెళ్లగక్కాడు. ఢిల్లీని ఆక్రమిస్తాం అనే అర్థం వచ్చేలా 'పెళ్లిపిల్లనుచేస్తాం' అనే వ్యాఖ్యలు చేయడాన్ని భారత్ తీవ్రంగా పరిగణిస్తోంది. భారత వైమానిక దళంపైనా ఆ ఉగ్రవాది నోరుపారేసుకున్నాడు. లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు అబ్దుల్ రవూఫ్ అత్యంత సన్నిహితుడు. పాకిస్థాన్ ఆర్మీ అతడిని గతంలో సాధారణ పౌరుడిగా, అమాయకుడిగా పేర్కొన్నది. అయితే ఇప్పుడు భారత్‌పై దాడులకు బహిరంగంగా పిలుపునిస్తూ చేసిన వ్యాఖ్యల్లో అతడిలోని ఉగ్ర భావజాలం స్పష్టమవుతున్నది. తాజాగా అతడు మాట్లాడుతూ జమ్మూకశ్మీర్‌లో పోరాటం సమసిపోయిందనే వాదనలను కొట్టిపారేశాడు. జమ్ముకశ్మీర్‌లో పోరాటం ముగియలేదని, వివాదం మరింత తీవ్రమవుతుందని హెచ్చరించాడు. ఎల్ఇటి సహ వ్యవస్థాపకుడు అబ్దుల్ రెహమాన్ మక్కీని ఉద్దేశిస్తూ భారత రాజధానిని స్వాధీనం చేసుకోవడమే తమ గ్రూపు లక్ష్యమన్నాడు.

# సంక్షిప్తంగా..

## సిఐసి ప్రధాన కమిషనర్‌గా రాజ్‌కుమార్ గోయల్



**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** కేంద్ర సమాచార కమిషన్ (సిఐసి) నూతన ప్రధాన కమిషనర్‌గా రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రాజ్‌కుమార్ గోయల్ నియమితులయ్యారు. ఆయనతో పాటు మరో 8 మందిని కమిషనర్లుగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీనేతృత్వంలోని త్రిసభ్య కమిటీ చేసిన సిఫారసుల మేరకు ఈ నియామకాలు జరిగాయి. కొత్తగా నియమితులైన వారిలో సీనియర్ జర్నలిస్టులు పీఆర్ రమేశ్, అశుతోష్ చతుర్వేది, రైల్వే బోర్డు మాజీ ఛైర్‌పర్సన్ జయవర్మ సిన్హా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుధారాణి రేలంగి వంటి ప్రముఖులు ఉన్నారు. సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాజ్‌కుమార్ గోయల్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నియామకాలతో సిఐసిలో ఖాళీగా ఉన్న చీఫ్ సహా మొత్తం 9 పోస్టులు భర్తీ అయ్యాయి. సుమారు తొమ్మిదేళ్ల తర్వాత కమిషన్ పూర్తిస్థాయి సామర్థంతో పనిచేయనుండటం గమనార్హం.

## దక్షిణాఫ్రికాలో కుప్పకూలిన హిందూదేవాలయం

**డర్బన్, డిసెంబరు 14:** దక్షిణాఫ్రికాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. క్వాజులునాటల్ ప్రావిన్స్‌లో నిర్మాణంలో ఉన్న నాలుగు అంతస్తుల హిందూ దేవాలయం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో భారత సంతతికి చెందిన వ్యక్తిసహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. డర్బన్‌కు ఉత్తరాన ఉన్న రెడ్‌క్లిఫ్ ప్రాంతంలో న్యూ అహోబిలం టెంపుల్ ఆఫ్ ప్రొటెక్షన్ పేరుతో ఈ ఆలయ నిర్మాణం జరుగుతోంది. కార్మికులు పనుల్లో నిమగ్నమై ఉండగా భవనంలోని ఒక భాగం ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆలయ ట్రస్ట్ కార్యవర్గ సభ్యుడు, నిర్మాణ ప్రాజెక్టు మేనేజర్ అయిన విక్కీ జైరాజ్ పాండే (52) మరణించినట్లు అధికారులుగుర్తించారు. ఈ ఘటనలో మొత్తం నలుగురు మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు.

## దట్టమైన పొగమంచుతో వాహనాలు ఢీ

**చండీగఢ్, డిసెంబరు 14:** హర్యానాలో దట్టమైన పొగమంచు కారణంగా ఇవాళ పలుచోట్ల ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగాయి. రోడ్లపై కనీసం దారి కూడా కనిపించకపోవడంతో బస్సులు, ట్రక్కులతో సహా దాదాపు 40 వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురు డ్రైవర్లు, ప్రయాణికులు గాయపడ్డారు. ముఖ్యంగా రోహ్తక్, హిసార్, రేవాడీ జిల్లాల్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి.రోహ్‌తక్‌లోని మెహమ్ ప్రాంతంలో ఒక హైవే కూడలి వద్ద సుమారు 35 నుంచి 40 వాహనాలు గొలుసుకట్టుగా ఢీకొన్నాయి. మొదట ఒక ట్రక్కు, కారు ఢీకొనగా, వెనుక వస్తున్న వాహనాలు ఒకదాని తర్వాత ఒకటి ఢీకొంటూ వెళ్లాయి. ఈ ఘటనలో అనేక వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు.

## రాజస్థాన్‌లో రామ్‌నామ్ డిపాజిట్ బ్యాంకు

**జైపూర్, డిసెంబరు 14:** బ్యాంకు అంటేనే సహజంగా గుర్తుకు వచ్చేది సొమ్ముడిపాజిట్లు లావాదేవీలు. కానీ రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఒక విభిన్నమైన బ్యాంకు ఉంది. ఇక్కడ ధనానికి బదులుగా రామనామాలను డిపాజిట్లుగా స్వీకరిస్తారు. గోవింద్ దేవ్ జీ ఆలయ ప్రాంగణంలో రామ్ నామ ధన సంగ్రహ బ్యాంక్ పేరుతో ఇది కొనసాగుతోంది. ఇప్పటివరకు ఈ బ్యాంకులో సుమారు 14 వేల కోట్లకు పైగా రామనామాలను భక్తులు డిపాజిట్ చేశారు. బాలకృష్ణ పురోహిత్ అనే వ్యక్తి 1987లో ఈ బ్యాంకును ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులు తాము రాసిన రామనామ పుస్తకాలను ఇక్కడ డిపాజిట్ చేస్తారు. ప్రతి భక్తుడికి ఒక మంత్ర అకౌంట్‌ను కేటాయిస్తారు.

## విమానంలో కుప్పకూలిన మహిళకు మాజీ ఎమ్మెల్యే సిపిఆర్

**బెంగళూరు, డిసెంబరు 14:** గాలిలో ఉన్న విమానంలో తీవ్ర అస్వస్థతకు గురైన ఓ మహిళా ప్రయాణికురాలిని కర్ణాటక రాష్ట్రానికి చెందిన మాజీ ఎమ్మెల్యే సిపిఆర్‌చేసి ప్రాణాలు కాపాడారు. విమానం గాల్లో ఉండగా అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన మహిళా ప్రయాణికురాలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఒక్కసారిగా కుప్పకూలిన ఆమెకు అదే విమానంలో ప్రయాణిస్తున్న ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే, డాక్టర్ అంజలి నింబాల్కర్ సిపిఆర్ చేసి కాపాడారు. అంజలి గతంలో కర్ణాటక రాష్ట్రం బెళగావి జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు. ఆమె ప్రయాణికురాలిని కాపాడటంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రశంసలు కురిపించారు.

## కొత్త పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: పారిశ్రామిక పాలసీలో భాగంగా అనేక సంస్థలకు ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పరిశ్రమలశాఖ, పర్యాటక శాఖలు సంయుక్తంగా ఉత్తర్వులు జారీ చేశాయి. కొత్త పాలసీలోని ఎర్లీ బర్డ్ పథకం కింద కొన్ని సంస్థలకు పెట్టుబడి రాయితీలు ప్రకటించగా, మరికొన్ని సంస్థలకు ఉన్న రాయితీలను కొనసాగించాలని నిర్ణయించారు. మరికొన్ని సంస్థలకు భూ కేటాయింపులు కూడా చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రధానంగా బాపట్ల జిల్లాలోని వలపర్లలో జెన్‌ఖాటి సంస్థ రూ.198 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న 1000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుకు ప్రోత్సాహకాన్ని కొనసాగించాలని, కర్నూలు జిల్లాలోని గొండివర్ల పారిశ్రామిక వాడలో టీజీవి ప్రాక్ లిమిటెడ్ రూ.1,216 కోట్ల ప్రాజెక్టుకు కూడా ప్రోత్సాహకాల కొనసాగింపునకు ఉత్తర్వులు ఇచ్చారు. కృష్ణా జిల్లాలోని సురవరంలో వెంకటేశ్వర బయోటెక్ లిమిటెడ కు 30శాతంతో పెట్టుబడి రాయితీగా 25.8 కోట్లు కేటాయించగా, అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెన్యూ ఫోటో వాల్టాయిక్స్ లిమిటెడ్‌కు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని, ఏలూరు జిల్లాలోని రమణక్కపేట గ్లోబల్ ఫుడ్ పార్కు 20 శాతం పెట్టుబడి రాయితీగా రూ.30.5 కోట్లు ఇవ్వాలని, రేణిగుంటలో రూ.305 కోట్ల పెట్టుబడితో ఉన్న మల్లాది డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్‌కు ప్రోత్సాహకాలు కొనసాగించాలని నిర్ణయించారు. గాయత్రి రెన్యూవబుల్ ఫ్యూయల్స్‌కు ప్రోత్సాహకాలు కొనసాగింపు, ఎమర్జీ గ్రీన్ ఇండస్ట్రీస్‌కు రూ.39 కోట్ల పెట్టుబడి రాయితీ కల్పిస్తూ పరిశ్రమలశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే పర్యాటక రంగంలో కూడా తిరుపతిలో నాలుగు నక్షత్రాల నంది హోటల్స్, బాపట్ల జిల్లాలోని పాండురంగాపురం బీచ్‌లో యాగంటి ఎస్టేట్స్‌కు ప్రోత్సాహకాలు అందించేందుకు పర్యాటకశాఖ నిర్ణయించింది. అలాగే విశాఖలోని ఎండాడలో వివి ఆర్ హాస్పిటాలిటీస్ ద్వారా ఫైవ్ స్టార్ హోటల్‌కు భూమితోపాటు ప్రోత్సాహకాలు అందించేందుకు, మధురవాడలో మెగన్ లీసర్స్ ద్వారా ఐదు నక్షత్రాల హోటల్, మెగా కన్వెన్షన్ సెంటర్‌కు ప్రోత్సాహకాలు, తిరుపతిలో ఒబెరాయ్ హోటల్ అభివృద్ధికి 20 ఎకరాల భూమిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

## బొత్స చెప్పేవన్నీ అబద్ధాలు

### - టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర అప్పులపై శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అసత్యాలు చెబుతున్నారని టీడీపీ రాష్ట్రఅధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేయడంతో పాటు రూ.1.40 లక్షల కోట్లు బకాయిలు పెట్టిందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బకాయిల్లో ఇప్పటికే రూ.40 వేల కోట్లకు పైగా కూటమి ప్రభుత్వం తీర్చిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ.10 వేల కోట్ల మ్యాచింగ్ నిధులు గత ప్రభుత్వం చెల్లించలేదని, ఈ నిధుల్ని చెల్లించి కేంద్ర పథకాలు పునరుద్ధరించామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు రూ.12 వేల కోట్లు చెల్లించామని వివరించారు. జగన్ ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వమే సంక్షేమానికి ఖర్చు ఎక్కువ చేస్తోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి తమ ప్రభుత్వం భారీగా ఖర్చు చేస్తోందన్నారు. జగన్ పాలనలో రూ.10 లక్షల కోట్లు అప్పు చేసినా అభివృద్ధి శూన్యమని విమర్శించారు. అప్పులకు వడ్డీ కట్టడానికి, బకాయిలు తీర్చడానికే అధిక శాతం అప్పులు చేయడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందడం చూసి ఓర్వలేక, జగన్ చేసిన అప్పుల్ని కప్పి పెట్టుకోవడానికే నేడు అప్పులపై జగన్ అసత్యాలు ప్రచారం చేస్తోందని పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు.

## కోడి గుడ్ల ధరలకు రెక్కలు

### - 100 గుడ్లు రూ.690లు



విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీలో రోజు రోజుకూ కోడి గుడ్ల ధరలు సామాన్యులకు అందనంతగా ఆకాశంలోని దూసుకెళ్తున్నాయి. నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ నిర్ణయించిన రేట్ల ప్రకారం ఇవాళ విజయవాడలో 100 గుడ్ల ధర అత్యధికంగా రూ.690గా ఉంది. అంటే ఒక్కో గుడ్డు రూ.6.90లుగా ఉంది. రిటైల్‌లోకి వచ్చే సరికి రూ.7 నుంచి రూ.8.50 వరకు ఉంది.ఇది కుడా సాధారణ మార్కెట్‌ల్లో లభిస్తున్న ధర. ఇక కార్పోరేట్ మాల్స్‌లో ఒక్కో గుడ్డు రూ.10 అమ్ముతుంది. ఉమ్మడి గోదావరి జిల్లాలో అనపర్తి, తణుకులో 100 గుడ్లు ధర రూ.665, విజయనగరం, శ్రీకాకుళంలో100 గుడ్లు ధరరూ.664, చిత్తూరులో 100 గుడ్లు రూ.663, విశాఖలో 100 గుడ్లు రూ.660 పలుకుతోంది. రిటైల్లో 810 రూపాయలకి అమ్ముతున్నారు. 4 నెలల కిందట ఈ రేటు రూ.5.50గా ఉండేది. గుడ్ల ఉత్పత్తి తగ్గడంతోనే రేట్లు అధికమయ్యాయని వ్యాపారులు చెబుతున్నారు.

## పిన్నెల్లి సోదరులకు పరామర్శలా!

### టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: మున్సిపల్ ఛైర్మన్ పదవి కోసం వేలంపాట పెట్టి, దాడులు మరియు హత్యలకు పాల్పడిన దుర్మార్గులు పిన్నెల్లి సోదరులు అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న తీవ్రంగా విమర్శించారు. వారికి నాయకత్వం వహించిన వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి అని, వీళ్ళంతా కలిసి రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చాలని చూస్తున్నారని ఆరోపించారు. విజయవాడలో టీడీపీ నేత బుద్ధా వెంకన్న మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలతో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలను అరెస్టు చేస్తే, దానిని తప్పు, అన్యాయం అని మాజీ సీఎం జగన్ మాట్లాడడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో టీడీపీ మద్దతుదారులను చంపేయాలని లక్ష్యంగా పెట్టుకున్న వ్యక్తులు పిన్నెల్లి బ్రదర్స్ అని, ఒక కులాన్ని టార్గెట్ చేసుకుని బూతులు మాట్లాడిన చరిత్ర వారిదని మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సామాజికవర్గం పైనా దుర్మార్గాలకు తెగబడ్డారని, తమపై దాడులు చేసిన ఘటనలకు సంబంధించిన వీడియోలు కూడా ఉన్నాయని తెలిపారు. జై వైసీపీ అనలేదని పీక కోసి చంపిన ఘటనలు ఉన్నాయని, చనిపోవడానికి సిద్ధమైన చంద్రయ్య ఖిజై టీడీపీఖి అని ప్రాణాలు విడిచారని, అది తమ బడుగు బలహీన వర్గాలకు టీడీపీపై ఉన్న కమిట్‌మెంట్ అని స్పష్టం చేశారు.

## ఆ క్రికెటర్లకు భరోసా ఇచ్చి... పవన్ చేసి చూపించారు!

### దీపిక, కరుణకుమారి ఇళ్లకు గృహోపకరణాలు అందజేత



విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: అంధుల మహిళా ప్రపంచ క్రికెట్ కప్ గెలిచిన జట్టు సభ్యులు దీపిక, కరుణకుమారి ఇళ్లకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గృహోపకరణాలు పంపించారు. ఆ క్రికెట్ జట్టుతో ఇటీవల పవన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆ కుటుంబాల ఆర్థిక పరిస్థితులు ఆయన దృష్టికి వచ్చాయి. దీంతో ఆ ఇద్దరు మహిళా క్రికెటర్లకు తక్షణమే గృహోపకరణాలు పంపాలని పవన్ నిర్ణయించారు. ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశారు. పార్టీ నాయకుల ద్వారా వీటిని అక్కడికి చేరవేయించారు. "ఎక్స్" వేదికగా ఈ విషయాన్ని డీ సీఎం కార్యాలయం వెల్లడించింది. శ్రీ సత్యసాయి జిల్లా తంబలహట్టి తండాలో జట్టు కెప్టెన్ దీపిక కుటుంబానికి, అల్లూరి సీతారామరాజు జిల్లా వంట్లమామిడిలో కరుణ కుమారి కుటుంబానికి వంట సామాగ్రి, టీవీ, టేబుల్ ఫ్యాను, మిక్సర్ గ్రైండర్, కుర్చీలు, చాపలు, స్టీల్ ప్లేట్లు, ప్రెషర్ కుక్కర్లు, ఎల్ఈడీ బల్బులు, ఇస్త్రీ పెట్టె, పాత్రలు, దుప్పట్లు, దిండులు, కుటుంబం మొత్తానికి వాళ్ల ఇళ్లకు ఇవి చేరుకున్నాయి. హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ టీసీ.వరుణ్, జనసేన నాయకుడు పొదిలి బాబూరావు తదితరులు తంబలహట్టి తండాకు వెళ్లి ఈ వస్తు సామాగ్రిని దీపిక కుటుంబానికి అందించారు. నూతన ఏపీ జానపద కళలు, సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ వంపూరు గంగులయ్య, జనసేన నేత వన్నెంరెడ్డి సతీష్‌రెడ్డి తదితరులు కరుణకుమారి ఇంటికి వెళ్లి వస్తువులను అందజేశారు. ఇద్దరు తెలుగు క్రికెటర్లకు క్రీడా కారుల కోటా కింద కొత్త గృహాలు నిర్మించి ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. కొత్త ఇళ్లు నిర్మించిన తర్వాత వాటికి తగిన విధంగా ఇతర అవసరమైన గృహోపకరణాలు సమకూర్చాలని నిర్ణయించారు.

## బహు క్రీడా దేశంగా భారత్

### అర్జున్ అవార్డు గ్రహీత సతీష్ శివలింగం

### తిరుపతి ఐఐటిలో 58వ ఇంటర్ ఐఐటి స్పోర్ట్స్ మీట్



శ్రీకాళహస్తి, డిసెంబరు 14 ప్రభాతవార్త: ప్రపంచ దేశాల్లో భారత దేశం బహుక్రీడా దేశంగా అభివృద్ధి చెందుతుందని ఒలింపియన్, అర్జున్ అవార్డు గ్రహీత సతీష్ శివలంగం అన్నారు. ఆదివారం తిరుపతి ఐఐటి అవరణలో తిరుపతి, మద్రాస్, హైదరాబాద్‌లు కలసి 58వ ఇంటర్ ఐఐటి స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఇది సంస్థ అభివృద్ధికి సాంకేతం అన్నారు. ఈ సందర్భంగా అతిధి శివలింగం మాట్లాడుతూ 'ఖేలో ఇండియా' తాజా జాతీయ క్రీడా విధానాలుయువతకు దేశవ్యాప్తంగా ఉన్న అవకాశాలను దిశ దెశ నిర్దేశం చేస్తుందని వివరించారు. తిరుపతి ఐఐటిలోనూ ఇతర భాగస్వామ్య ఐఐటిలలో అభివృద్ధి చెందుతున్న ప్రపంచస్థాయి క్రీడా సదుపాయాలు భవిష్యత్ ఛాంపియన్లను తయారు చేయటంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని అభినందించారు. భారత క్రీడల భవిష్యత్తు స్పోర్ట్స్ సైన్స్, డేటా అనలిటిక్స్ మరియు టెక్నాలజీ ఆధారంగా ముందుకు సాగుతుందని చెబుతూ ఐఐటి విద్యార్థులు కేవలం ఆటగాళ్ళుగా కాకకుండా ఆవిష్కర్తలు, ఇంజనీర్లు, వ్యాపారవవేత్తలుగా క్రీడా రంగంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి వేదికలు స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, హై-పర్ పార్మెన్స్ స్పోర్ట్స్ వాటి అనుబంధ రంగాల్లో మార్గలను తెరిస్తా యని అన్నారు. క్రమశిక్షణ జట్టు స్పూర్తి, సహనాన్ని జీవితంలో కొనసాగించాలని శివలింగం ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన 58వ ఇంటర్ ఐఐటి స్పోర్ట్స్ మీట్‌ను 2025కు అధికారికంగా ప్రకటించారు.ఈ సందర్భంగా బెలూన్లను ఆకాశంలోకి వదిలిపెట్టారు. తిరుపతి ఐఐటిలో శ్రీకారం చుట్టిన స్పోర్ట్స్ మీట్‌లో సాంస్కృతిక ప్రదర్శనల్లో సంప్రదాయ కళలకు పెద్దపీట వేసినట్లు నిర్వాహాకులు ప్రకటించారు. గ్రామాల్లో సాధన చేసే కర్రసాము, ఇతర నృత్య ప్రదర్శనలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. చదరంగం, టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు శ్రీకారం చుట్టారు.



## భవాని దీక్ష విరమణ సేవలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్తప్రతినిధి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న భవాని దీక్షల విరమణ సేవలలో 100 మంది జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు( ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మేరిస్టెల్లా కళాశాల, విజయ ఇన్స్టాప్ టెక్నాలజీ ఫర్ ఉమెన్) నుంచి భవాని దీక్షల విరమణకు విచ్చేసిన భక్తులకు దేవస్థానం వారు ఏర్పాటుచేసిన సదుపాయాల మీద అభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు. దేవస్థానం అధికారుల పిలుపుమేరకు కృష్ణా యూనివర్సిటీ ఎన్టీఆర్ జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు 11 నుంచి 15 వరకు దేవస్థానం వారు అందిస్తున్న సేవల మీద అభిప్రాయ సేకరణ నిర్వహించమని ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లను కోరారు అందులో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు భక్తులు నుంచి దేవస్థానం వారు కల్పించిన సదుపాయాల పైన భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు వాలంటీర్లు తెలిపారు.



## మంత్రాలయమంతా భక్తజనం

### అశేష భక్తుల నడుమ శ్రీ రాఘవేంద్రులు పల్లకి ఉత్సవం

మంత్రాలయంటౌన్, డిసెంబరు 14 ప్రభాతవార్త; పవిత్ర పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై నిత్యం వివిధ రాష్ట్రాల నుండి వేలాదిమంది భక్తులు విచ్చేస్తుంటారు. అందులో భాగంగానే ఆదివారం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై లక్షలాదిమంది వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేశారు. అయితే శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం విచ్చేసిన భక్తులకు శ్రీ మఠం అధికారులు,శ్రీ మఠం పీఠాధిపతులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిత్య అన్నదానం నిర్వహించారు. అంతేకాకుండా స్వామివారి దర్శనార్థమై విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండగా స్వామివారి దర్శనం ఏర్పాటు గావించారు.ఇదిలా ఉండగా భక్తులు పవిత్ర తుంగభద్ర నదిలో స్నానలాచరించి లక్షలాది సంఖ్యలు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శ్రీ మఠం ధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం అశేష భక్తుల నడుమ, ఉదయం నుండి శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పంచామృతాభిషేకం, తులసి అర్చన, అష్టోదకం, సుప్రభాత సేవలతో మొదలై, వేద పండితులు వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలు మూల బృందావనానికి నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకి ఉత్సవం, స్వర్ణ రథోత్సవం నవరత్న రత్నోత్సవం, గజవాహన ఉత్సవం, శ్రీ మఠం పీఠాధిపతుల శ్రీ మూల రాముల ప్రత్యేక పూజా కార్యక్రమాలు, భక్తులను అశేషంగా అలరించాయి, అనంతరం శ్రీ మఠం పీఠాధిపతులు భక్తులకు ఫలమంత్రాక్షతలిచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో, శ్రీ మఠం మేనేజర్లు, శ్రీనివాస చారి, వెంకట్ జోషి, ఐపి నరసింహమూర్తి, శ్రీపతి, వ్యాసరాజ చారి, అనంత స్వామి, తంబి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి భక్తులతో కిటకిట



శ్రీకాళహస్తి, డిసెంబరు 14 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచి ఆలయంలో ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటు చేసుకుంది. వేకువ జాము నుంచే ఆలయంలో భక్తులు శివనామ స్మరణ చేస్తూ పునీతం చేసారు. ఆలయాధికారులు సమాచారం మేరకు పాతిక వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఇఓ డి.బాపిరెడ్డి వివరించారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు అభిషేకాలు 56 మంది పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించే మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రభిషేకాలు 27 జరిగాయి. కాగా రాహుకేతుదోష నివారణ పూజలు సుమారు 5వేలు జరిగినట్లు వివరించారు. ఇక సంస్కరణలతో ప్రతి ఒక్కరు టిక్కెట్లు కొనుగోలు చేయాలనే నిబంధనలతో ప్రత్యేక దర్శనానికి వెళ్ళె భక్తులు అతిధులు సుమారు 6వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు వివరించారు. ఇక ప్రసాదాలు సుమారు పాతికవేలు అమ్ముడుపోయినట్లు వివరించారు. ఓ వైపు చలి వణిస్తున్నా భక్తులు ఖాతరు చేయక ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

## భారత్... ప్రగతి పథంలో దూసుకెళ్తోంది

● ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ● తిరుపతిలో అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ



తిరుపతి, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: భారతదేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పిస్తూ, ఆయన జీవితం, ఆశయాలు, ప్రజాస్వామ్య విలువలు భారత దేశానికి ఎప్పటికీ మార్గదర్శకమని ఉత్తరాఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి పేర్కొన్నారు. ఆదివారం రేణిగుంట హైవేలోని మర్రిగుంట కూడలి నందు నిర్వహించిన అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహా విష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, శ్రీకాళహస్తి శాసనభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి, మాజీ ఎం.పి వరప్రసాద్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుష్కర్‌సింగ్ ధామి మాట్లాడుతూ.. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న ఈ పవిత్ర క్షేత్రంలో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరికీ కలియుగ దైవం సుఖసంతోషాలు, శాంతి, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నానని" తెలిపారు. యమునా, గంగా పవిత్ర నదులు ప్రవహించే దేవభూమిగా పేరుగాంచిన ఉత్తరాఖండ్ నుంచి వచ్చిన తనకు ఈ శుభ కార్యంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అద్భుతమైన వాక్చాతుర్యం, గంభీరమైన ఆలోచనాశక్తి, విశాల హృదయం కలిగిన నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి అని పేర్కొన్నారు. "పదవుల కంటే ప్రజలే ముఖ్యమని నమ్మిన నాయకుడు వాజ్‌పేయి. అధికారం కన్నా మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇచ్చిన మహనీయుడు" అని కొనియాడారు. పార్లమెంటులో ప్రజా సమస్యలపై గళమెత్తి, జీవితాంతం దేశ సేవకే అంకితమై పనిచేశారని గుర్తు చేశారు. అటల్ బిహారీ వాజ్‌పేకి ఎవరూ శత్రువులు లేరని, అందుకే ఆయనను అజాతశత్రువుగా దేశం మొత్తం గౌరవించిందని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యార్థి దశ నుంచే వాజ్‌పేయి గారి మార్గదర్శకత్వంలో పనిచేసే అవకాశం తనకు లభించిందని, లక్నో పార్లమెంట్ నియోజకవర్గంలో విద్యార్థి నాయకుడిగా ఆయన ఎన్నికల సమయంలో పనిచేసిన అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. దేశాభివృద్ధికి బలమైన పునాది వేసిన నాయకుడు వాజ్‌పేయి అని పేర్కొంటూ, ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన ద్వారా గ్రామాలకు రహదారులు, స్వర్ణ చతుర్భుజి ప్రాజెక్ట్ ద్వారా దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల నిర్మాణం, టెలికాం విప్లవానికి శ్రీకారం చుట్టిన ఘనత ఆయనదేనని అన్నారు. సంకీర్ణ ప్రభుత్వాన్ని పూర్తి కాలం విజయవంతంగా నడిపిన తొలి ప్రధాని కూడా అటల్ బిహారీ వాజ్‌పేయి అని తెలిపారు. అభివృద్ధి, సుపరిపాలన, పారదర్శకతను ప్రాతిపదికగా తీసుకుని పాలన అందించిన ఆయన, సమాజంలో అట్టడుగున ఉన్న వర్గాల జీవితాల్లో వెలుగులు నింపారని చెప్పారు. వాజ్‌పేయి ఆశయాల నుంచి స్ఫూర్తి పొందిన నేటి ప్రధాని నరేంద్ర మోడీ కూడా సేవ, సుపరిపాలన, అభివృద్ధి లక్ష్యంగా దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. లోకల్ ఫర్ లోకల్, స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి వినూత్న కార్యక్రమాలతో భారత్‌ను స్వయం సమృద్ధ, ఆత్మనిర్భర దేశంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. డిసెంబర్ 25న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా అమరావతిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మోడీ సహకారంతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. డబుల్ ఇంజన్ సర్కార్ కారణంగా అభివృద్ధి అత్యంత వేగంగా జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బిజెపి జిల్లా అధ్యక్షులు చామంచి శ్రీనివాస్, టిటిడి బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, హస్తకళల ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



## వదలని గజరాజులు

### లక్షలాది రూపాయల పంట నష్టం

కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా), డిసెంబర్ 14 ప్రభాతవార్త: పార్వతీపురం మన్యం జిల్లాలో గజరాజుల వల్ల లక్షల రూపాయలు వంట నష్టం వాటిల్లినట్లు రైతులు అంటున్నారు. గత కొన్నేళ్లుగా కురుపాం నియోజవర్గంలో కురుపాం, కొమరాడ, జిఎం వలస, గరుగుబిల్లి మండలాల్లో ఏనుగులు తిరుగుతూ చేతికందే పంటలు నాశనం చేస్తూ రైతులకు లక్షల రూపాయలు నష్టము వాటిల్లే విధంగా చేస్తున్నాయి. ఆదివారం కురుపాం మండలం సీతంపేట గ్రామంలో చేతికందే పంటలు కోకో, కర్బుజ మొక్కలు, మోటర్ పైపులు ఏనుగులు గుంపు ధ్వంసం చేశాయి. సుమారు 100 టన్నుల చెరుకు పంటను గజరాజులు నాశనం చేశాయి. సుమారు 3 లక్షల వరకు పంటనష్టం జరిగిందని రైతు చిన్నారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల తరలింపుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## నో హెల్మెట్... నో పెట్రోల్

### తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పోలీసులు భద్రతపై ఫోకస్!



తిరుపతి, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి ,చిత్తూరు జిల్లాల వ్యాప్తంగా రోడ్డు భద్రతపై పోలీసులు ప్రత్యేక ఫోకస్‌చేశారు. ఇప్పటి వరకు అటూఇటూ ఉదారతతో వ్యవహరించిన పోలీసులు ఇప్పుడు కొరఢా ఝుళిపించనున్నారు. ఈ రెండు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలు నడిపే వ్యక్తులు హెల్మెట్ ధరించకుంటే నేటి నుండి పెట్రోల్ పట్టరని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బారాయుడు స్పష్టం చేశారు. ఆదివారం హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ తిరుపతిలో చేపట్టారు. దేశంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో సుమారు 45 మరణాలు ద్విచక్ర వాహనదారుల మితిమీరిన వేగం మరియు హెల్మెట్ లేకుండా ప్రయాణం వల్ల జరుగుచున్నవని గణాంకాలు తెలియజేస్తున్నాయి. 40 మరణాలు హెల్మెట్ వాడకం వల్ల తగ్గే అవకాశం ఉన్నట్లు జాతీయ గణాంకాలు సూచిస్తున్నాయి. సరియైన రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోతే కుటుంబంలో ఒకరు మరణిస్తే కుటుంబం చిన్నాభిన్నం అవుతుంది. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బారాయుడు, చిత్తూరు ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాలతో నేటి నుండి ద్విచక్ర వాహనదారులకు నో హెల్మెట్ నో పెట్రోల్ నిబంధనలను అమలు చేసేలా పెట్రోల్ బంకుల యజమానులకు ఆదేశాలిచ్చారు. ప్రజలకు, విద్యావంతులైన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, యువత మరియు అందరూ ద్విచక్ర వాహనదారులు అనగా వాహనం నడుపుతున్న వారు, వెనుక కూర్చొని వున్నవారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు.

## అందరి సమన్వయంతో సంబరం చేద్దాం

### -రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

### ప్లాస్టిక్ వినియోగం నియంత్రించాలి : జిల్లా కలెక్టర్



మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా), డిసెంబరు 14 ప్రభాతవార్త: సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాతర ఏర్పాట్లను పూర్తిచేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ గిరిజన శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. వచ్చే ఏడాది జనవరి నెలలో ప్రారంభం కానున్న శంబర జాతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలితో కలిసి దేవాదాయ శాఖ అధికారులు, దేవాలయ కమిటీ, ఇతర శాఖల అధికారులతో మంత్రి శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సంబర పోలమాంబ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు అధికారులకు పలు సూచనలు జారీ చేసారు. గ్రామ పెద్దలు, అధికారులు సమన్వయంతో నెల రోజుల ముందుగా అవసరమైన ఏర్పాట్లను చేపట్టాలని అన్నారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు ఉండరాదని, కొళాయిలు, బోర్లు పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్లు సిద్దం చేయాలని, పారిశుధ్యం నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. అమ్మవారి మారు జాతర ముగిసే వరకు పారిశుధ్యంపై ప్రణాళిక వేసుకోవాలని తెలిపారు. పార్కింగ్ స్థలాలు, ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాలు పక్కాగా ఉండాలని, అత్యవసర సమయంలో అంబులెన్సులు వెళ్ళుటకు రహదారి అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అవసరమగు విద్యుత్ సరఫరాకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపక యంత్రాలను ఏర్పాటు చేయాలని, ప్రజలకు సమాచారం ఇచ్చుటకు, సమాచారం స్వీకరించుట మైక్‌ల ద్వారా ప్రకటించుటకు పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. కంట్రోల్ ఏర్పాటు చేసి అచ్చట నుండి సమాచారం అందించాలని సూచించారు.

మైక్ ద్వారా ఇచ్చే సమాచారం జాతర జరిగే మొత్తం ప్రాంతంలో వినిపించాలని, రవాణాకు ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని రహదారులు భవనాలు శాఖను సూచించారు. వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం ఇబ్బందులు ఉండకుండా తగిన బస్సులు ప్రజా రవాణా శాఖ ఏర్పాటు చేయాలన్నారు. దేవదాయ శాఖ అవసరమగు సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. 2026 జనవరి 26 నుండి 28 వరకు జరగనున్న ఈ ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించేందుకు సంబంధించిన ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళికలపై ప్రధానంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎస్.పి మనీషా రెడ్డి జిల్లా దేవాదాయ శాఖ అధికారి రాజారావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ఆయనకు 80, నడక, పరుగులో యువత రాదు అతనితో పోటీకి

● ముదిమిలోను జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులు, రివార్డులు అందుకుంటున్న స్ట్రాంగ్‌మెన్ కనగాల మల్లిఖార్జునరావు

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: వయస్సు మీరినా ఉరకలు తీసే ఉత్సాహ ప్రవంతికి అడ్డకట్టవేయలేమని ఎనిమిది పదుల జీవన అనుభవశాలి కనగాల మల్లిఖార్జునరావు, యువతకు దీటుగా వేగంగా పరుగులు దీస్తూ, వడివడిగా నడుస్తూ జౌరా ! అని ముక్కున వేలు వేయిస్తున్నారు. జట్టు నెరుపులోనే కాదు వయసు సోగసులోను మెరుస్తున్నారు, కనగాల మల్లికార్జునరావు స్వగ్రామం కృష్ణాజిల్లా గన్నవరం మండలం బాహుబలేంద్రనిగూడెం. పెద్దఆవుటపల్లిలోని కో ఆపరేటివ్ బ్యాంకులో ఉద్యోగం చేసేవారు. ఆయనకు వ్యవసాయంపై ఎంతో మక్కువ. మల్లికార్జునరావుకు ఉన్న ఇష్టంతో సాగు సైతం చేసేవారు. 2004లో క్యాన్సర్‌తో భార్య నిర్మలకుమారి మరణించారు. ఆమె మరణంతో బాగా కుంగిపోయారు. అతనికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య చనిపోయిన తర్వాత స్వగ్రామంలో ఉండలేక 2008లో విజయవాడ పటమటలోని ఆర్టీసీ కాలనీకి వచ్చి స్థిరపడ్డారు.

నగరంలో ఎస్టీడీ బూత్ ఆపరేటర్‌గా పని చేశారు. పక్కనే ఉండే వ్యాపారవేత్త శ్రీనివాస్‌తో స్నేహం కుదిరింది. ఆయనతో లయోలా కళాశాల మైదానంలో వాకింగ్‌కు తీసుకెళ్లారు. అలా వారిద్దరూ ప్రతిరోజూ కలిసి వాకింగ్‌కు వెళ్ళడం ప్రారంభించారు, ఉదయపు నడకకు వెళ్లినప్పుడు ఆరంభంలో భయం వేసినా శ్రీనివాస్ ధైర్యాన్ని ఇచ్చారని మల్లికార్జునరావు తెలిపారు. అప్పటి నుంచి రోజూ ఒక గంట వాకింగ్, సాయంత్రం యోగా సాధన చేస్తున్నాను. ఎటు వెళ్లాలి అనిపించినా అది ఎంత దూరమైన సైకిల్ పైనే ప్రయాణం చేస్తాను. 2009లో ఉగాది వేడుకల్లో లయోలా మైదానంలో జరిగిన 5 కిలోమీటర్ల వాకింగ్ పోటీల్లో మల్లికార్జునరావు మొదటి స్థానంలో నిలిచారు. విజయవాడలో 2016, 2017లో 21 కి.మీ అమరావతి మారథాన్ పోటీల్లో సీనియర్ సిటిజన్ (60+) కేటగిరీలో పాల్గొన్నారు. ఆ పోటీల్లో వరుసగా రెండుసార్లు విజేతగా నిలిచారు. దీనిని కేవలం 2 గంటల 18 నిమిషాల్లో పూర్తి చేశారు. కృష్ణా జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘంలో 2022లో సభ్యత్వం తీసుకున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో అనేక పతకాలు సాధించారు. దాంతో ఆయన జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌నకు సైతం ఎంపిక అయ్యారు. వయసు 80 ఏళ్లు అయినా అది కేవలం ఒక సంఖ్య మాత్రమేనని కనగాల మల్లికార్జునరావు నిరూపించారు. ఆయనకు ఉన్న ఆసక్తితో 17 స్వర్ణ పతకాలు, ఒక కాంస్యం గెలిచారు. గత నవంబరులో చెన్నైలో జరిగిన ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లోనూ 2 కాంస్య పతకాలు సాధించారు. ఇప్పటి వరకు తనకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని, క్రీడా పోటీలతో సమాజంలో గౌరవం లభిస్తోందని కనగాల మల్లికార్జునరావు చెబుతున్నారు.



# విజయవాడ రైల్వే స్టేషన్ పిపిపి మోడ్‌లో అభివృద్ధి

## రైల్వే శాఖ సమాయత్తం... బ్లూప్రింట్ సిద్ధం

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతి రాజధాని అభివృద్ధికి సమాంతరంగా విజయవాడ రైల్వే స్టేషన్‌ను పిపిపి మోడ్‌లో అభివృద్ధి చేయడానికి రైల్వే శాఖ సంసిద్ధమైంది. ఇప్పటికే ప్రతిపాదనలపై ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ద్వారా రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సెంట్రల్ గవర్నమెంట్ రూ.661.11 కోట్ల నిధులు కూడా మంజూరు చేయడంతో రైల్వే యంత్రాంగం ఈ ప్రతిపాదనలకు శ్రీకారం చుట్టింది. మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్ వంటి తరహాలో అమరావతి రాజధానికి అతి సమీపంలోని విజయవాడ రైల్వే స్టేషన్ ను అభివృద్ధి చేసేందుకు ఎన్డీఏ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రతిపాదనలు రూపొందించారు. రైల్వే స్టేషన్ అభివృద్ధికి కావాల్సిన బ్లూ ప్రింట్ ను కూడా తయారు చేశారు. విజయవాడ రైల్వే స్టేషన్ ప్రాంతంలో 83.367 చదరపు మీటర్లుగా నిర్ణయించుకోగా వ్యాపార లావాదేవీలకు, స్టాల్స్, హోటల్ లాంటివి దగ్గర నుంచి రైల్వే కోటర్స్, స్టేషన్ కార్యాలయం వరకు 81.948 చదరపు మీటర్లలో అభివృద్ధి చేయనున్నారు. బెజవాడ రైల్వే స్టేషన్ ను విజయవాడ నగరానికి ఆకర్షణీయంగా నిలిచే విధంగా తూర్పు, పడమర వైపు ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నారు.

తూర్పు ముఖద్వారం వైపు పార్లమెంటు ముఖద్వారానికి ధీటుగా సూపర్ లుక్‌తో ఆకట్టుకునే విధంగా నమూనాలను ఇప్పటికే తయారు చేశారు. అలాగే పడమర వైపు వన్ టౌన్ ప్రాంతమంతా కూడా వ్యాపారాలకు ప్రసిద్ధి. ఆ ప్రాంతంలో రైల్వే స్టేషన్ లో సైతం వివిధ వ్యాపారులకు అనుకూలంగా ఉండే విధంగా భవనాలను నిర్మిస్తున్నారు. ఇందులో రెండు మూడు అంతస్తులు వ్యాపారులకు అనుకూలంగా నిర్మించడానికి రంగం సిద్ధం చేశారు. ప్రస్తుతం విజయవాడ రైల్వే స్టేషన్ లో మూడు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి. అయితే పెరిగిన రైళ్లకు తోడు ప్రయాణికుల సంఖ్య అత్యధికంగా పెరిగింది. దీంతో బడ్జెట్ను కూడా కేటాయించారు. ఇదిలా ఉండగా రైల్వే స్టేషన్ కు తూర్పు వైపు బయట ఉన్న సిటీ బస్టాండ్, స్కూటర్ పార్కింగ్ దగ్గర నుంచి టవర్ క్లాక్ ప్రాంతమంతా కూడా ఈ అభివృద్ధిలో మార్పులు చోటుచేసుకుని ఉన్నాయి. ఈ ప్రాంతం దగ్గర్లో స్టేషన్‌కు చెందిన 41.70 చదరపు మీటర్ల ప్రాంతంలో జి ప్లస్ టు భవనం నిర్మించనున్నారు. అలాగే పడమర వైపు జి ప్లస్ టు 6.647 చదరపు మీటర్ల పరిధిలో భవనాలను నిర్మించనున్నారు.

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంతో రైల్వే అధికారులు చర్చలు జరిపారు. తూర్పు వైపు నిర్మించనున్న ముఖద్వారం కానీ జి ప్లస్ టు వంటి భవన నిర్మాణాలే కానీ అన్నిటికీ అనుకూలమైన ప్రదేశం ఉండగా పడమర వైపు గాంధీ హిల్ కొండ ప్రాంతంలోని 100 మీటర్ల మేర ఇప్పటికే రైల్వే వెస్ట్ బుకింగ్ కార్యాలయం, టీటీల విశ్రాంతి భవనంతో పాటు ఆర్పీఎఫ్ విశ్రాంతి భవనాలు నిర్మించి ఉన్నాయి. రైల్వే స్టేషన్ నిర్మాణానికి ఇప్పటికే గాంధీ హిల్కొండ ప్రాంతంలో మరికొంత భాగం స్టేషన్ అభివృద్ధికి కేటాయించాలని ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వంతో ఇప్పటికే చర్చలు జరిగినట్టు సమాచారం దీనికి ప్రభుత్వం సానుకూలం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది.



# అమ్మ భవాని అస్తమయం

వి.ఆర్.పురం, డిసెంబరు 14 ప్రభాతవార్త: అల్లూరి సీతారామరాజు జిల్లా, వి.ఆర్.పురం మండలం, వి.ఆర్.పురం కు చెందిన సుప్రసిద్ధ భవాని భక్తురాలు పర్వతవర్ధిని (85) (అమ్మ భవాని) ఆదివారం ఒడిశా రాష్ట్రం, మోటు లో అస్తమయం చెందారు. మోటు నుండి విజయవాడ బయలుదేరిన భవాని భక్తులకు ఇరుముడులు ఎత్తేందుకు ఈమె మోటు వెళ్ళారు. మాలధారణ చేసిన భక్తులకు ఇరుముడులు ఎత్తి సాగనంపి, (బిక్ష) భోజనం చేస్తున్న క్రమంలో ఆమె గుండెపోటుకు గురై పడిపోయారు. అక్కడ ఉన్న వారంతా అమ్మభవాని ని హుటా హుటీన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు దేవీకరించారు. అమ్మ భవాని అంత్యక్రియలు సోమవారం వి.ఆర్.పురం మండలంలోని వడ్డిగూడెం గ్రామం వద్ద పవిత్ర శబరి, గోదారి సంగమ ప్రాంతంలో నిర్వహించన్నట్లు ఆమె కుటుంబ సభ్యులు, భక్తులు తెలిపారు. 40 ఏళ్ళ క్రితం భవాని దీక్ష బూనిన ఈమె పూర్తిగా గుడికే అంకిత మయ్యారు. ఈమె ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్ ఘడ్, ఒడిషా నాలుగు రాష్ట్రాలోని భవాని భక్తులకే కాకుండా సామాన్య ప్రజానికానికి సుపరిచితురాలు. మృతురాలికి చోడేశ్వరావు, విశ్వనాద్, సంతోష్ కుమారులు ఉన్నారు.

# మత్స్య సంపదతో సుస్థిర ఆర్థికాభివృద్ధి



● ఆధునిక, సాంకేతికతలతో కూడిన లాభదాయక పద్ధతులపై అధ్యయనం
● ఉప ముఖ్యమంత్రి చొరవతో రెండు బృందాలుగా తరలిన ఉప్పాడ మత్స్యకారులు
● తమిళనాట కేజ్ కల్చర్, రిఫ్ కల్చర్, ఆధునిక మార్కెటింగ్ వ్యవస్థలపై శిక్షణ
● కేరళలో మోడల్ ఫిషింగ్ హార్బర్, అత్యాధునిక వలల తయారీపై అధ్యయనం

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించిన 100 రోజులు ప్రణాళికలో భాగంగా ఉప్పాడ మత్స్యకారుల శిక్షణ విజయవంతంగా ముగిసింది. వారం రోజుల శిక్షణా తరగతులు ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు అధ్యయనం, అవగాహన, శిక్షణ కార్యక్రమాలతో మొదలయ్యాయి. తమిళనాడు, కేరళ రాష్ట్రాలు అవలంభిస్తున్న సాంకేతికత సాయంతో ఉప్పాడ, కాకినాడ తీర ప్రాంత మత్స్యకారులకు వసతులు కల్పించేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మత్స్యశాఖ అధికారులకు సూచించారు. ఇందుకు అనుగుణంగా మత్స్య సంపదతో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అవసరం అయిన అధునాతన పద్దతులపై అధ్యయనం చేసేందుకు ఉప్పాడకు చెందిన మత్స్యకారులను తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు పంపారు. ఈ నెల 8వ తేదీన మొత్తం 60 మంది రెండు బృందాలుగా ఆయా రాష్ట్రాలకు వెళ్లారు. స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించడం ఎలా అనే అంశంపై రెండు రాష్ట్రాల్లో మూడు రోజుల పాటు శిక్షణ ఇప్పించారు. అధునాతన కేజ్ కల్చర్, రిఫ్ కల్చర్, మార్కెటింగ్ వ్యవస్థల ఏర్పాటు, అన్ని హంగులతో నిర్మించిన హార్బర్ల సందర్శన, హ్యాచరీల్లో చేపల గుడ్లు పొదిగించడం, వలల తయారీ తదితర అంశాల్లో సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీలతో శిక్షణ ఇప్పించారు. మొదట పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అక్కడ అమలు చేస్తున్న విధానాలను వివరించారు. తదుపరి క్షేత్ర స్థాయిలో సందర్శనలకు ఏర్పాటు చేశారు.

### మండపం, విల్లుపురంలో మొదటి బృందం అధ్యయనం

తమిళనాడు సందర్శనకు వెళ్లిన ఉప్పాడ మత్స్యకార బృందం చెన్నైలోని మండపం వద్ద ఉన్న సి.ఎస్.ఎం.సి.ఆర్.ఐ.ని సందర్శించారు. అక్కడ మెరైన్ నిపుణులు కృత్రిమ, సహజ పద్దతుల్లో సాగు చేస్తున్న కేజ్ కల్చర్, రిఫ్ కల్చర్ లపై మత్స్యకారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. సముద్ర తీర ప్రాంతంలో జీవ వైవిధ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సముద్ర వనరుల దీర్ఘకాలిక సంరక్షణకు అవలంభించాల్సిన శాస్త్రీయ విధానాలను ఉప్పాడ మత్స్యకారులకు తెలియజేశారు. అనంతరం విల్లుపురంలోని గోల్డెన్ మెరైన్ హార్వెస్ట్ హ్యాచరీని సందర్శించి మత్స్య సంపద సృష్టిలో వస్తున్న నూతన సాంకేతికతపై అధ్యయనం చేశారు. చెన్నై మెరినా బీచ్ సమీపంలోని ఆధునిక మౌలిక వసతులతో కూడిన చేపల మార్కెట్ ని సందర్శించారు. మార్కెట్ వద్ద చేపలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకునేందుకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్షేత్ర స్థాయి పరిశీలనలో పరిశుభ్రమైన వాతావరణంలో చేపల అమ్మకం, కోల్డ్ స్టోరేజ్ వ్యవస్థలు, మత్స్య సంపద గ్రేడింగ్, వేలం నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ విధానాలు, సప్లయి చైన్ తదితర అత్యాధునిక సదుపాయాలపై అవగాహన తెచ్చుకున్నారు. ఈ పర్యటన ద్వారా ఆధునిక సదుపాయాల కల్పన ద్వారా మత్స్యకారుల ఆదాయం ఎలా వృద్ధి చెందుతుంది అనే అంశాన్ని తెలుసుకున్నారు.

### సాంకేతికత సాయంతో మత్స్య సంపద వృద్ధిపై కేరళలో అధ్యయనం

కేరళ పర్యటనలో భాగంగా ఉప్పాడకు చెందిన రెండో మత్స్యకార బృందం ఎన్.ఐ.పి.హెచ్.టిలో మూడు రోజులపాటు నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ తీసుకున్నారు. వేటలో సాంకేతిక మేళవింపు, స్థిరమైన ఆదాయార్జన, ఆర్థికంగా లాభదాయక విధానాలు అవలంభించడం ఎలా? అనే అంశాలపై వీరు అధ్యయనం చేశారు. మునంబంలోని మోడల్ ఫిషింగ్ హార్బర్ సందర్శించి అక్కడ ఆధునిక పద్దతులలో వలల తయారీ ప్రక్రియ, వారు పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలు, మార్కెటింగ్ విధానాలను తెలుసుకున్నారు. చేపల గుడ్లు పొదిగించడం, రకరకాల జాతుల చేప పిల్లల హ్యాచరీలు సందర్శించారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అమలు చేస్తున్న అధునాతన విధానాలు, వాటివల్ల కలుగుతున్న లాభాలపై ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారులకు ప్రత్యక్షంగా అధ్యయనం చేసే అవకాశం కలిగింది.



# అభివృద్ధి, సంక్షేమంలో రాజీపడొద్దు

## - పోలవరం ఎమ్మెల్యే బాలరాజుతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వారికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడంలో ఏ దశలోనూ రాజీపడకూడదు. గెలిచిన ప్రతి ఎంఎల్ఏ నియోజక వర్గ అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రజలకు సంతృప్తి కల్గించేలా పని చేయాలి' అని ఉప ముఖ్యమంత్రి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ దిశా నిర్ధేశం చేశారు. నియోజక వర్గాల్లో అభివృద్ధితో పాటు పార్టీ కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు. దీనిలో భాగంగా జనసేన ఎమ్మెల్యేలు ప్రతి ఒక్కరితో ఆయన విడివిడిగా (వన్ టూ వన్) భేటీ కానున్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో తొలి సమావేశం నిర్వహించారు. ఏడాదిన్నర కాలంలో పోలవరం నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన సమీక్షించారు. పెండింగ్ పనుల గురించి తెలుసుకున్నారు. నియోజక వర్గానికి దక్కిన నామినేటెడ్ పోస్టుల అంశాన్ని ఉప ముఖ్యమంత్రి చర్చించారు. అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం నిర్ధేశిత లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. ఎంఎల్ఏలూ ఆ దిశగా వెళ్ళాలి. ఐఎస్ జగన్నాథపురం పర్యటనకు వచ్చినపుడు తిమ్మనకుంట– గవరవరం రోడ్డు లేక కెండు దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్న అంశాన్ని ఒక మహిళ నా దృష్టికి తీసుకువచ్చారు. అలాంటి సమస్యలను ఎంఎల్ఏగా గుర్తించి పరిష్కరించేలా పని చేయాలి' అని పవన్ కల్యాణ్ ఎంఎల్ఏతో అన్నారు. కూటమి ధర్మాన్ని అనుసరిస్తూనే జనసేన పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే బాలరాజు ఉప ముఖ్యమంత్రికి అందించారు. సమావేశంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడుగోవిందరావు పాల్గొన్నారు.

# హిందూ ధర్మవ్యాప్తికి టిటిడి విశేష కృషి

తిరుమల, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: ధార్మిక సంస్థ టిటిడి హిందూ ధర్మవ్యాప్తికి చేస్తున్న కృషి అభినందనీయమని, తిరుమలలో భక్తుల సౌకర్యాలు బావున్నాయని ఉత్తరాఖండ్ సిఎం పుష్కరసింగ్‌దామి తెలిపారు. త్వరగా దర్శనం కల్పించడంలో ఎఐ సేవలు అమలుచేయించే ప్రయత్నంతో భక్తులకు మేలుజరుగుతుందన్నారు. కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకోవడం మనసు ఆనందంగా ఉందన్నారు. ఆదివారం సాయంత్రం తిరుమలకు చేరుకున్న ఉత్తరాఖండ్ సిఎం పుష్కరసింగ్ దామి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర నేత రమేశ్, టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డిలు ఆలయం వద్దకు చేరుకున్నారు. రాత్రి నైవేద్యవిరామ సమయంలో స్వామివారిని దర్శించుకున్నారు. టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.





# బైక్ - కారు ఢీ: భార్యాభర్తలు మృతి

ఆత్మకూరు (నెల్లూరు), డిసెంబరు 14 ప్రభాతవార్త: ఆత్మకూరులోని ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో భార్యా భర్తలిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఆత్మకూరు మండలం బి.చిరువెళ్ళకు చెందిన మాధవ, మనోజలు ఆత్మకూరులోని గురుకుల పాఠశాలలో చదువుతున్న తమ చిన్న కుమార్తె వద్దకు వెళ్ళారు. ఆదివారం కావడంతో ఇంటి నుంచి తీసుకెళ్ళిన భోజనం తమ బిడ్డకు తినిపించారు. తిరిగి ఇంటికి బైక్ పై వెళుతుండగా కడప వైపు నుండి నెల్లూరుకు వస్తున్న ఇన్నోవా కారు ఢీకొట్టింది. దాంతో భార్యాభర్తలిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో మేస్త్రీ మృతి

విడవలూరు (నెల్లూరు), డిసెంబరు 14 ప్రభాతవార్త: ఇతర ప్రాంతాల నుండి వచ్చే కూలీలకు పని కల్పిస్తున్న మేస్త్రీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన విడవలూరు మండలం రామతీర్థం గ్రామంలో చోటుచేసుకొంది. రామతీర్థం నుండి దండిగుంటవైపు వెలుతున్న కాంక్రీట్ మిక్సర్ లారీను బైక్ ముందుకు సాగించే క్రమంలో అదుపుతప్పి లారీ కింద పడిపోవడంతో కావలి వెంకటరమణయ్యపై లారీ వెళ్ళడంతో అక్కడిక్కడే మృతి చెందగా మరొకరికి స్వల్పగాయాలు అయ్యాయి. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దండిగుంట గ్రామానికి చెందిన కావలి వెంకటరమణయ్య కొంతకాలం నుంచి బుచ్చిరెడ్డిపాలెం గ్రామం గాంధీనగర్‌లో నివాసం ఉంటూ కూలీలకు పనులు కల్పించేందుకు దండిగుంట గ్రామానికి వచ్చి ఇతర గ్రామాల్లో కూలీపనులు చేయించే వాడని పోలీసులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృత్యువాత విన్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు. ఇంటి యజమాని ఇక లేరని మరణ వార్త వినడంతో గ్రామంలో ప్రజలను కలిచివేసింది. ప్రమాదానికి గురైన లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిమిత్తం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.నరేష్ తెలిపారు.

# విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు

## - రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: సత్యసాయి జిల్లా ఓడీ చెరువు మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్‌తో మంత్రి ఫోన్ మాట్లాడుతూ, హాస్టల్ లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డుకు పైగా రావడానికి కారణాలు తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన ఆదివారం విడుదల చేశారు. శ్రీసత్యసాయి జిల్లా ఓడీ చెరువు మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో లక్ష్మీనరసింహ తొమ్మిదో తరగతి, భార్గవ్ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. హాస్టల్ సమీపంలోని బైపాస్ రోడ్డులో ఉన్న అయ్యప్ప స్వాములు ఏర్పాటు చేసుకున్న మండపానికి ప్రసాదం కోసం వంట పాత్రలతో వెళ్లారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న కారు ఇద్దరు విద్యార్థులను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మీనరసింహ తలకు బలమైన గాయం కావడంతో అనంతపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మరో విద్యార్థి భార్గవ్‌ను కదిరి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందజేస్తున్నారు. ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్‌తో ఫోన్ లో మాట్లాడి, విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలన్నారు. వంట పాత్రలిచ్చి ప్రసాదం ఎవరు తీసుకు రమ్మనారో తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హాస్టల్‌లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డుపైకి ఎందుకొచ్చారని డీఎస్సీడబ్ల్యూవో రెడ్డి బాలాజీని మంత్రి ఫోన్‌లో ప్రశ్నించారు. తక్షణమే గాయపడిన విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారమందించాలని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

# ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అనూహ్య మద్దతు

## - వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి



విజయవాడ, డిసెంబరు 14 ప్రభాత వార్త ప్రతినిధి: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల నుండి అనూహ్య మద్దతు వస్తోందని, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని వైసిపి రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు కోటి సంతకాల ఉద్య మాన్ని జాతీయస్థాయిలోకి తీసుకెళ్లా లని తెలిపారు. దీన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని, 15న జిల్లాస్థాయిలో జరిగే ర్యాలీలు ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా హోరెత్తాలని తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌ఛార్జి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా వైసిపి అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. కోటి సంతకాల పేరుతో వైసిపి చేపట్టిన ప్రజా ఉద్యమం విజయవంతమైందన్నారు. రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలని, పరిహారాన్ని ఏడు లక్షలకన్నా పెంచి తక్షణం అందజేయాలని వైసిపి ప్రధాన కార్యదర్శి ఎంవిఎస్ నాగిరెడ్డి అన్నారు. ఆత్మహత్య చేసుకున్న వారంలోనే రైతు కుటుంబానికి పరిహారం అందించేలా చూడాలని కోరారు. వ్యవసాయం గిట్టుబాటుకాక ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని, ప్రతివారం కనీసం ఇద్దరు రైతులు చనిపోతున్నారని వివరించారు. అయినా కూటమి ప్రభుత్వంలో చలనం రావడం లేదని పేర్కొన్నారు. నెల్లూరు కార్పొరేషన్లో ప్రభుత్వం అనైతిక రాజకీయాలు చేస్తోందని వైసిపి అధికార ప్రతినిధి నాగార్జునయాదవ్ అన్నారు. మేయర్ పదవికోసం ప్రభుత్వం దిగజారిందని అన్నారు.

# వైభవంగా భవానీ దీక్షల విరమణ



ఇంద్రకీలాద్రి, డిసెంబరు 14 ప్రభాత వార్త: మూడోరోజు భవానీ దీక్షలు విరమణ ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. దీక్షధారులు భక్తుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. వారికి సరైన వసతులు, సౌకర్యాలు అందేలా ఇఒ, ఛైర్మన్ పాలకమండలి, అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. భక్తిశ్రద్ధలతో దీక్షాధారులు ఇరుముడులను శిరస్సున ధరించి దుర్గమ్మవారి ఆలయానికి జై దుర్గా.. జైజై దుర్గా నామస్మరణతో చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి ఇరు ముడులు భక్తితో సమర్పించుకున్నారు. శ్రీ అమ్మవారు దీక్షల సందర్భంగా అమ్మవారి ప్రత్యేక పూల అలంకరణతో భక్తులను అనుగ్రహించారు. దుర్గమ్మవారి ఆలయంలో శ్రీ భవానీ దీక్షల విరమణల సందర్భంగా ప్రసాదాల అమ్మకాలు, కేశఖండన తది తరాల ద్వారా మొత్తం రు,62,09,425ల ఆదాయం లభించిందని ఇఒ తెలిపారు.

### దేవాదాయ శాఖ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

రాష్ట్ర దేవదాయ శాఖ కమీషర్ కె రామచంద్రమోహన్ ఆదివారం దుర్గమ్మవారి ఆలయంలో ఆకస్మిక తనిఖీ చేశారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం నుండి శ్రీ భవాని మండల దీక్షధారులకు అందుతున్న సేవలను కమీషనర్ స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. చివరిరోజైన సోమవారం సుమారు లక్షమంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని ఆమేరకు ఏర్పాట్లు సిద్ధం చేశామని భక్తుల సంఖ్య పెరిగినప్పటికి తగిన సౌకర్యాలు, లడ్డూ ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ, దర్శనం తదితర అన్ని ఏర్పాట్లు సిద ం చేశామని కమీషనర్, ఇఒలు సంయుక్తంగా తెలిపారు. అనంతరం ఇఒ వికె శీనా నాయక్‌తో కలిసి భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

### భవాని దీక్ష విరమణల్లో విశేష సేవలు

బ్యాటరీ వాహనాలద్వారా వృద్దులను, దివ్యాంగులను శ్రీ అమ్మవారి దర్శనానికి తీస్కెళ్లడం కోసం నాలుగు బ్యాటరీ వాహనాలను ఇఒ వికె శీనా నాయక్ భవాని దీక్ష విరమణల కోసం ఏర్పాటు చేయడంతో వాటి ద్వారా అందుతున్న సేవలపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు భవాని దీక్షలు ఏర్పాట్లు పరిశీలించి అనంతరం శ్రీ అమ్మవారి దర్శనము చేసుకున్నారు.

# బంగ్లాదేశ్ సూపర్ విక్టరీ

## అఫ్ఘానిస్థాన్‌పై 3 వికెట్ల తేడాతో గెలుపు



**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ జట్టు అఫ్ఘానిస్తాన్‌పై 3 వికెట్ల తేడాతో ఉత్కంఠభరితమైన విజయాన్ని నమోదు చేసింది. దుబాయ్‌లో జరిగిన పురుషుల అండర్ 19 ఆసియా కప్ గ్రూప్ బి మ్యాచ్‌లో ఓపెనర్లు రిఫత్ బేగ్, జావాద్ అబ్రార్ అర్ధ సెంచరీలు సాధించారు. ఫైసల్ షినోజాదా 103 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన తర్వాత ఆఫ్ఘనిస్తాన్ 283/7 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ ఆలస్యంగా పతనమైనప్పటికీ ఒక ఓవర్ మిగిలి ఉండగానే ఛేదనను పూర్తి చేసింది. బంగ్లాదేశ్ 236/2 వద్ద ఛేదనకు నియంత్రణలో ఉన్నట్లు కనిపించింది. ఎనిమిది వికెట్లు చేతిలో ఉండగా 45 బంతుల్లో 48 పరుగులు మాత్రమే అవసరం. కానీ నాలుగు ఓవర్ల వ్యవధిలోనే 4 వికెట్లు పడటంతో ఆఫ్ఘనిస్తాన్‌కు ఆశలు చిగురించాయి. ఆల్ రౌండర్ రిజాన్ హోసాన్ 17 పరుగులతో నాటౌట్‌గా నిలిచి బంగ్లాదేశ్‌ను 7 బంతులు మిగిలి ఉండగానే విజయతీరాలకు చేర్చాడు. ఓపెనర్లు అబ్రార్, బేగ్ 151 పరుగుల అద్భుతమైన భాగస్వామ్యంతో బంగ్లాదేశ్ విజయానికి వేదికగా నిలిచారు. 27వ ఓవర్లో బేగ్ 62 పరుగులకు ఔట్ కాగా, అబ్రార్ సెంచరీ మిస్ అయ్యాడు. రూహుల్లా అరబ్ 96 పరుగుల వద్ద అవుట్ అయ్యాడు. కెప్టెన్ అజీజుల్ హకీమ్, కలాం సిద్దికి మూడో వికెట్‌కు 66 పరుగులు జోడించారు. కానీ మిడిల్ ఆర్డర్‌లో తడబాటు కారణంగా హోసాన్ జోక్యంతో లక్ష్యాన్ని ఛేధించారు. ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్ షినోజాదా 103 పరుగులతో నిర్మించబడింది. అతను ఉస్మాన్ సదత్‌తో 66, ఉజైరుల్లా నియాజైతో 89 పరుగుల భాగస్వామ్యంతో స్కోరును 200 దాటించాడు. అయితే ఆఫ్ఘనిస్తాన్ 46వ ఓవర్లో 225/7కి పడిపోయింది, అజీజుల్లా మియాఖిల్ (38), అబ్దుల్ అజీజ్ (26) వారిని 283 పరుగులకు చేర్చారు.

# ఒడిశా మాస్టర్స్‌లో ఉన్నతి, కిరణ్‌కు టైటిళ్లు

న్యూఢిల్లీ: ఒడిశా మాస్టర్స్ 2025లో భారత్ షట్లర్లు ఉన్నతి హుడా, కిరణ్ జార్జ్ సింగిల్స్ టైటిళ్లను గెలుచుకున్నారు. భువనేశ్వర్‌లో ఆదివారం జరిగిన మాస్టర్స్ సూపర్ 100 టోర్నీలో భారత షట్లర్లు రెండు టైటిళ్లతో వరల్డ్ టూర్‌ను ముగించారు. ఉన్నతి మొత్తం భారత మహిళల సింగిల్స్ ఫైనల్లో ఇషారాణి బారువాను ఓడించింది. ఆమె తన క్లాస్‌ను ప్రదర్శించి, వరుస గేమ్‌లలో 21-17, 21-10 తేడాతో ఆధిపత్య విజయాన్ని నమోదు చేసింది. ఈ సంవత్సరంలో ఆమెకు ఇది మొదటి విజయం. మరోవైపు, కిరణ్ ఇండోనేషియా యువ ఆటగాడు మొహమ్మద్ యూసుఫ్‌తో జరిగిన మూడు గేమ్‌ల మ్యాచ్‌లో 21-14, 13-21, 21-16 తేడాతో చాలా కఠినమైన ఆటతీరును కనబరిచాడు. మొదటి గేమ్‌లో మంచి ఆధిక్యాన్ని కొనసాగించి 21-14తో గెలుచుకున్నాడు. రెండవ గేమ్‌లో యూసుఫ్ మెరుగ్గా కనిపించి కిరణ్‌పై ఒత్తిడి తెచ్చాడు, కానీ భారత ఆటగాడు స్కోర్‌లను అదుపులో ఉంచుకుని ఒక పాయింట్ మాత్రమే వెనుకబడి ఉన్నాడు. అయితే, అతను వరుసగా 8 పాయింట్లు ఇచ్చి రెండవ గేమ్‌ను కోల్పోయాడు. దీనితో కిరణ్ దానిని విజయంగా మార్చుకున్నాడు.



ఆట

# ఐపిఎల్‌లో దిగ్గజాలు ఔట్

## ముగిసిన స్టార్ ప్లేయర్ల హిస్టరీ







**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 కోసం జోరుగా సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి. అయితే ఈ ఐపీఎల్‌కు సంబంధించి ఈ నెల 16 న అబుదాబిలో జరగబోయే మినీ వేలం దగ్గర పడుతున్న కొద్దీ, పలువురు స్టార్ ఆటగాళ్లు ఈ సీజన్ నుంచి తాము తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఐపీఎల్ చరిత్రలో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఈ ఆటగాళ్ల నిర్ణయాలు చర్చనీయాంశమైంది. వీరిలో కొంతమంది ఆటగాళ్లు ఇతర లీగ్‌లను ఎంచుకోగా, మరికొందరు రిటైర్మెంట్, బ్రేక్ తీసుకుంటున్నారు. ఇంగ్లాండ్‌కు చెందిన సీనియర్ ఆల్‌రౌండర్ మోయిన్ అలీ ఐపీఎల్ 2026 లో ఆడకూడదని నిర్ణయించుకుని, బదులుగా పాకిస్తాన్ సూపర్ లీగ్ వైపు మొగ్గు చూపాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున అలీ గత సీజన్ అంతగా బాగా ఆడకపోయినా, మోయిన్ ఆల్‌రౌండ్ సామర్థ్యాలకు మంచి గుర్తింపు ఉంది. ఐపీఎల్‌లో 73 మ్యాచ్‌ల్లో 1167 పరుగులు చేసి, 41 వికెట్లు పడగొట్టాడు. అలాగే దక్షిణాఫ్రికా దిగ్గజం ఫాఫ్ డు ప్లెసిస్ కూడా పాకిస్తాన్ సూపర్ లీగ్ ప్రాధాన్యత ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ఐపీఎల్ తనకు సంవత్సరాలుగా గుర్తింపు మరియు గౌరవాన్ని ఇచ్చిందని, అయితే ఈ నిర్ణయం తీసుకోవడం తనకు చాలా కష్టమైందని పేర్కొన్నాడు. చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ జట్ల తరపున అద్భుతంగా రాణించిన ఫాఫ్, ఐపీఎల్‌లో మొత్తం 4773 పరుగులు చేసి నమ్మదగిన బ్యాట్స్‌మన్‌గా ఉన్నాడు. ఇక ఆస్ట్రేలియాకు చెందిన విధ్వంసకర ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ ఏ కారణం చెప్పకుండానే వచ్చే ఐపీఎల్ వేలం నుంచి తన పేరును ఉపసంహరించుకున్నాడు. గత రెండు సీజన్లలో అతని ప్రదర్శన చాలా పేలవంగా ఉంది. 15 ఇన్నింగ్స్‌లలో కేవలం 100 పరుగులు మాత్రమే చేయగలిగాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్ ఐపీఎల్ నుంచి అధికారికంగా రిటైర్మెంట్ ప్రకటించాడు. రస్సెల్ ఐపీఎల్‌లో అత్యంత ప్రమాదకరమైన ఆటగాళ్లలో ఒకడుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. 140 మ్యాచ్‌లలో 2651 పరుగులు, 123 వికెట్లు రస్సెల్ పవర్ తెలియజేస్తాయి. కాగా భారత దేశపు మంచి ఆఫ్‌స్పిన్నర్లలో ఒకడైన రవిచంద్రన్ అశ్విన్ కూడా ఐపీఎల్ కెరీర్‌కు ముగింపు పలికాడు. ఆగస్టులో ఐపీఎల్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన అశ్విన్ 187 వికెట్లతో ఐపీఎల్ చరిత్రలో టాప్5 బౌలర్‌లలో ఒకరిగా ఉన్నాడు. 2010, 2011 లో చెన్నై సూపర్ కింగ్స్ టైటిల్ విజయాల్లో అతడు కీలక పాత్ర పోషించాడు. అయితే ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర టీ20 లీగ్‌లలో ఆడతానని అశ్విన్ స్పష్టం చేశాడు.



# స్క్వాష్ ప్రపంచ కప్‌లో ఫైనల్‌కు భారత్

## సింగిల్స్‌ను గెలిచిన వేలవన్, అనహత్

### 3-0 తేడాతో ఈజిప్టు ఓటమి

**న్యూఢిల్లీ:** స్క్వాష్ ప్రపంచ కప్-2025లో ఈజిప్టును ఓడించిన భారత్ తొలి ఫైనల్‌కు చేరుకోవడం ద్వారా చరిత్ర సృష్టించింది. స్క్వాష్ ప్రపంచ కప్ ఫైనల్‌కు భారత్ రెండుసార్లు డిఫెండింగ్ ఛాంపియన్స్ ఈజిప్ట్‌ను 3-0 తేడాతో ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. జాతీయ ఛాంపియన్లు, భారత్‌కు చెందిన వేలవన్ సెంథిల్‌కుమార్ మరియు అనహత్ సింగ్ పురుషుల మరియు మహిళల సింగిల్స్‌ను గెలుచుకున్నారు. సెంథిల్‌కుమార్ 3-0 తేడాతో గెలిచినప్పటికీ, అనాహత్ 3-2 తేడాతో గెలవడానికి తీవ్రంగా పోరాడాల్సి వచ్చింది. అభయ్ సింగ్ 3-1 తేడాతో విజయాన్ని సాధించాడు,పురుషుల ర్యాంకింగ్స్‌లో 45వ స్థానంలో ఉన్న సెంథిల్‌కుమార్, ప్రపంచ 96వ ర్యాంకర్ ఇబ్రహీం ఎల్కబ్బానీని తొలి మ్యాచ్‌లో 7-1, 7-3, 7-6 తేడాతో ఓడించి భారత్‌ను ఆధిక్యంలోకి నెట్టాడు. ఇక 17 ఏళ్ల వయసులో ప్రపంచ కప్ అరంగేట్రం చేసిన అనాహత్ సింగ్, 44వ ర్యాంక్‌లో ఉన్న నూర్ హైకల్‌పై 6-7, 7-5, 7-3, 3-7, 7-3 తేడాతో గట్టి పోరాటం చేసి ఆతిథ్య జట్టు ఆధిక్యాన్ని 2-0కి పెంచాడు. ఆ తర్వాత అభయ్ సింగ్ ఆడమ్ హవాల్‌ను 3-1 (7-5, 6-7, 7-5, 7-6) తేడాతో ఓడించి ఫైనల్‌లో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు.

# పాక్ ఘోర ఓటమి

## టీమిండియా 90 రన్స్‌తో ఘన విజయం

**న్యూఢిల్లీ:** అండర్ 19 ఆసియా కప్-2025లో యువ భారత్ జట్టు జోరు కొనసాగుతోంది. ఈ టోర్నీలో భాగంగా ఆదివారం దాయాది పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 90 పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత్ బౌలర్లు అద్భుతం చేశారు. 241 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక పాకిస్థాన్ చతికల పడింది. భారత్ బౌలర్ల ధాటికి పాక్ జట్టు 41.2 ఓవర్లలో కేవలం 150 పరుగులకే కుప్పకూలింది.

దీపేష్ దేవేంద్రన్, కన్షిక్ చౌహాన్ తలా 3 వికెట్లతో పాక్ పతనాన్ని శాసించారు. వీరితో పాటు, కిషాన్ కుమార్ 2 వికెట్లు సాధించారు. పేసర్ దీపేష్ పవర్ ప్లేలోనే మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని దెబ్బతీశాడు. పాక్ బ్యాటర్లలో హుజైఫా అహ్సాన్ (70) ఒంటరి పోరాటం చేశాడు. ఓ వైపు వికెట్లు పడతున్నప్పటికీ అహ్సాన్ మాత్రం దూకుడుగా ఆడి భారత్‌పై వత్తిడి పెంచాడు. ఈ క్రమంలో వైభవ్ సూర్యవంశి క్యాచ్‌లో పెవిలియన్‌కు పంపాడు. పాకిస్తాన్ ఇన్నింగ్స్‌లో ముగ్గురే ముగ్గురు డబుల్ డిజిట్ స్కోర్ సాధించారు. అంతకు ముందు బ్యాటింగ్ చేసిన భారత్ 46.1 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌట్ అయింది. భారత్ బ్యాటర్లలో ఆరోన్ జార్జ్ (85) టాప్ స్కోరర్‌గా నిలవగా, కనిష్క్ చౌహాన్ (46), మాత్రే (38) రాణించారు. ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశి (5) చెత్త ప్రదర్శన చేశాడు. పాక్ బౌలర్లలో మహ్మద్ సయ్యామ్, అబ్దుల్ సుభాన్ తలా మూడు వికెట్లు పడగొట్టారు.



# వాణిజ్యం

## టాప్ 8 కంపెనీల్లో రూ.79వేల కోట్లకుపైగా మార్కెట్‌క్యాప్ పతనం!

**ముంబయి, డిసెంబరు 14:** దేశీయ స్టాక్ మార్కెట్లలో గత వారంనెలకొన్న ధోరణులతో టాప్10 కంపెనీలలో 8 సంస్థలు భారీగా నష్టపోయాయి. ఈ కంపెనీలు వారం వ్యవధిలో తమ మార్కెట్ విలువల నుంచి ఏకంగా రూ.79,129.21 కోట్లను కోల్పోయాయి. ఇందులో బజాజ్ ఫైనాన్స్ అత్యధికంగా నష్టపోయిన సంస్థగా నిలిచింది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ విలువ ఏకంగా రూ.19,289.7 కోట్లు తగ్గి రూ.6,33,106.69 కోట్లకు చేరింది. ఆ తర్వాతి స్థానంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఉంది. ఈ బ్యాంకు మార్కెట్ క్యాప్ రూ.18,516.31 కోట్లు క్షీణించి రూ.9,76,668.15 కోట్లకు పడిపోయింది. ఇదే బాటలో భారతీ ఎయిర్‌టెల్ రూ.13,884 కోట్లు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.7,846 కోట్లు, ఇన్ఫోసిస్ రూ.7,145 కోట్లు, టీసీఎస్ రూ.6,783 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.4,460




కోట్లు కూడా భారీగా నష్టపోయాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి)కూడా రూ.1,201కోట్లు నష్టపోయింది. ప్రతికూల మార్కెట్ పరిస్థితుల్లోనూ రిలయన్స్ ఇండస్ట్రీస్, లార్సెన్ టూబ్రో (ఎల్ అండ్‌టి) లాభాలను నమోదు చేశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.20,434.03 కోట్లు పెరిగి రూ.21,05,652.74 కోట్లకు చేరుకుంది. లార్సెన్ అండ్ టూబ్రో విలువ రూ.4,910.82 కోట్లు పెరిగి రూ.5,60,370.38 కోట్లకు చేరింది. గత వారం బీఎస్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్ సెన్సెక్స్ 444.71 పాయింట్లు (0.51 శాతం) పడిపోవడం ఈ నష్టాలకు ప్రధాన కారణం.మార్కెట్ ఒడిదొడుకులకు గురైనప్పటికీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్,రిలయన్స్, టీసీఎస్ సంస్థలు దేశంలోఅత్యంత విలువైన కంపెనీలుగా స్థానాలను నిలబెట్టుకున్నాయి.

## 2510.86 మిలియన్ డాలర్ల జ్యుయెలరీ ఎగుమతులు!

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** దేశవ్యాప్తంగా గతనెలలో జెమ్స్ అండ్ జ్యూయెలరీ ఆభరణాల ఎగుమతులు 2510.86 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఒక్క నవంబరునెలలోనే 19.64శాతం పెరిగినట్లు అసోసియేషన్ వెల్లడించింది. గత ఏడాది ఇదే నవంబరునెలలో 2098.59 మిలియన్ డాలర్లకంటే గణనీయంగా ఎగుమతులు వృద్ధిచెందినట్లు సంఘం ప్రకటించింది. ఇదేరంగంలో స్థూల దిగుమతులు కూడా నవంబరునెలలో 1894.92 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. గత ఏడాది నవంబరునెలలో 1393.23 మిలియన్ డాలర్లకంటే 36.01 శాతం పెరిగినట్లు జిజెపిఇసి ప్రకటించింది. ఏప్రిల్‌నుంచి నవంబరు నవెలవరకూ స్థూల ఎగుమతులు 18867.43 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. స్వల్పంగా అంటే 0.07శాతం పెరిగాయి. గత ఏడాది ఇదే కాలంలో 18854.83 మిలియన్ డాలర్లుగా ఉన్నట్లు సంఘం నివేదిక విడుదలచేసింది. అలాగే ఏప్రిల్‌నుంచి నవంబరువరకూ దిగుమతులు కూడా పెరిగాయి. 6.87శాతంపెరిగి 12,932.06 మిలతియన్ డాలర్లనుంచి 13,820.863 మిలియన్ డాలర్లకు చేరినట్లు వెల్లడించింది. ఎగుమతి దిగుమతుల గణాంకాలను పరిశీలిస్తే దేశీయంగా డిమాండ్‌పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఉత్పత్తిరంగంలో చురుకుదనం, కస్టమర్లలో విశ్వాసం పెరగడంతోపాటు పండుగలు, పెళ్ళిళ్ల సీజన్ రానుండటంతో మరింతగా ఎగుమతిదిగుమతులుండవచ్చని చెపుతోంది. కామా జ్యూయెలరీ ఎండి కోలిన్‌షా మాట్లాడుతూ గ్లోబల్‌స్థాయిలో సవాళ్లు ఎదురవుతున్నా భారతజెమ్స్ అండ్ జ్యూయెలరీ సెక్టార్ గణనీయమైన వృద్ధిని నమోదుచేసిందన్నారు. భౌగోళిక ఉద్రిక్తతలు ఎదురయినప్పటికీ అంతర్జాతీయ మార్కెట్లలో మంచి డిమాండ్‌ను సాధించిందన్నారు. భారత్, యుఎఇ సెపా వంటి ఒప్పందాలుకూడా ఎగుమతులకు దోహదంచేసినట్లు జెమ్స్ అండ్ జ్యూయెలరీ ప్రోత్సాహక మండలి ప్రకటించింది.



## టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణ గణాంకాలే కీలకం!

### ఈ వారం మార్కెట్లను ప్రభావితం చేయనున్న అంశాలివే!




**ముంబయి, డిసెంబరు 14:** అంతర్జాతీయ మార్కెట్ల ధోరణులు, టోకుధరలసూచీ ద్రవ్యోల్బణం గణాంకాలు, భారత్ అమెరికా వాణిజ్యచర్చల్లో పురోగతి వంటి అంశాలు వచ్చే వారం మార్కెట్లను ప్రభావితంచేయనున్నాయి. అదేవిదంగా అంతర్జాతీయంగా డాలర్ రూపాయి చెలామణి కదలికలతోపాటు విదేశీ ఇన్వెస్టర్ల కార్యకలాపాలపైనా ట్రేడర్లు ఆసక్తి పెంచుతారని తెలుస్తోంది. గత వారం మార్కెట్లలో ఇన్వెస్టర్లు భారీగానే కుమ్మరించారు. బిఎస్ఇలో జాబితా అయిన మొత్తం కంపెనీల విలువ రూ.466.6 లక్షలకోట్లనుంచి ఒక్కసారిగా రూ.470 లక్షలకోట్లకు పెరిగింది. అంటే మూడు లక్షలకోట్లు ఒక్కరోజులోనే పెరిగింది. ఈవారం కూడా ఇన్వెస్టర్ల తీరుతెన్నులు కొంత కీలకం అవుతాయని అంచనా. కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ టోకుధరల సూచీ ద్రవ్యోల్బణ గణాంకాలు ఈనెల 15వ తేదీ అంటే సోమవారం విడుదలచేస్తులంది. భారత్ అమెరికాలు నిర్మాణాత్మక వైఖరితో వాణిజ్యచర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే భారత ప్రతినిధుల బృందం అమెరికా డిప్యూటీ ట్రేడ్ రిప్రజెంటేటివ్ రిక్ స్విట్జర్‌బృందంతో చర్చలు జరుపుతున్నది. రెండుదేశాలకు ప్రయోజనకారి కాగల వాణిజ్య ఒప్పందం దిశగా వేగంగా చర్చలు కొనసాగుతున్నాయని రెండుదేశాలప్రతినిధులు చెపుతున్న సంగతి తెలిసిందే. కేంద్రం తరపున వాణిజ్య మంత్రి పియూష్‌గోయల్‌బృందం చర్చలు జరుపుతున్నది. అయితేఈ ఏడాది మార్కెట్లలో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు నికర విక్రేతలుగా మారారు. గడచిన రెండుదశాబ్దాల్లో ఎన్నడూలేనంతగా పెట్టుబడులు విత్‌డ్రాచేసారు. ఈ అంశాలకుతోడు గ్లోబల్ మార్కెట్ల ధోరణులపైనా ఇన్వెస్టర్లు దృష్టిపెట్టే అవకాశాలున్నాయి.



## కృత్రిమమేధలో భారత్ నం.3

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ తన సత్తా చాటుతోంది. ప్రపంచంలోనే అత్యంత పోటీ ఉన్న దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ఆదివారం విడుదల చేసిన గ్లోబల్ ఏఐ వైబ్రెన్సీ టూల్ ర్యాంకింగ్స్‌లో భారత్‌కు 3వ ర్యాంకు ఇచ్చిది. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ రంగం, నైపుణ్యం కలిగిన మానవ వనరులే ఈ ఘనతకు కారణమని సంస్థ పేర్కొంది. ఈ జాబితాలో 78.6 స్కోర్‌తో అమెరికా అగ్రస్థానంలో ఉండగా, 36.95 స్కోర్‌తో చైనా రెండో స్థానంలో నిలిచింది. భారత్ 21.59 స్కోర్‌తో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ క్రమంలో దక్షిణ కొరియా, యూకే, సింగపూర్, జపాన్, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్ వంటి అనేక అభివృద్ధి చెందిన దేశాలను భారత్ అధిగమించడం విశేషం.పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డి), టాలెంట్ లభ్యత, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ విధానాలు వంటి అనేక కీలక అంశాలను విశ్లేషించి స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ఈ ర్యాంకులను కేటాయించింది.
ముఖ్యంగా టాలెంట్ విభాగంలో భారత్ ప్రపంచంలోని టాప్3 దేశాల్లో ఒకటిగా నిలిచింది. దేశంలోని ఇంజనీర్లు, డెవలపర్‌ల భారీ సంఖ్య ఇందుకు దోహదపడింది. తక్కువమధ్య ఆదాయ దేశాల కేటగిరీలో ఈ జాబితాలో ఇంత ఉన్నత స్థానంలో నిలిచిన ఏకైక దేశం భారత్ కావడం గమనార్హం. ఏఐ రంగంలో భారత్‌లో పెరుగుతున్న పెట్టుబడులు, బలమైన స్టార్టప్ వ్యవస్థ, విస్తరిస్తున్న పరిశోధనలకు ఈ ర్యాంకింగ్ అద్దం పడుతోంది.



## ప్రపంచంలోనే అతిపెద్ద ఐపిఒ స్పేస్‌ఎక్స్!

**న్యూయార్కు, డిసెంబరు 14:** ప్రపంచంలో అతిపెద్ద ఐపీఓగా రికార్డు అయిన సౌదీ ఆరాంకోను దాటి ఇపుడు ఎలాన్ మస్క్ స్పేస్ ఎక్స్ ఐపిఒ రాబోతోంది. సౌదీ ఆరాంకో 25 బిలియన్ డాలర్లకుపైగా నిధుల్ని ఐపీఓ ద్వారా సమీకరించింది. ఈ రికార్డును బ్రేక్‌చేయాలన్న లక్ష్యంతోనే ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ స్పేస్‌ఎక్స్ వచ్చే ఏడాదే భారీ ఐపిఒకు వస్తోంది. ప్రస్తుతం కంపెనీ ఇందుకోసం అంతర్గత వాటా విక్రయం ప్రక్రియ చేపడుతోంది. దీని ద్వారా కంపెనీ విలువను ఏకంగా 800 బిలియన్ డాలర్లుగా భారత కరెన్సీలో సుమారు రూ. 72 లక్షలు కోట్లుగా అంచనా వేస్తున్నారు. దీంతో చాట్‌జీపీటీ పేరెంట్ కంపెనీ ఓపెన్ ఏఐ రికార్డును దాటి అత్యంత విలువైన ప్రైవేట్ కంపెనీగా నిలుస్తోంది. స్పేస్ ఎక్స్ ప్రస్తుతం అర్హులైన వాటాదారుల నుంచి మొత్తం 2.56 బిలియన్ డాలర్లను సమీకరించాలనినిర్ణయించింది. భారత కరెన్సీలో రూ. 23 వేల కోట్లకుపైగా విలువ ఉంటుంది. షేర్ల కొనుగోలు ప్రాసెస్ ఇప్పటికే ప్రారంభించింది. ఇక్కడ ఒక్కో షేరుకు 421 డాలర్లు అంటే రూ. 38 వేల వరకు చెల్లించేందుకు ఆఫర్ ఇచ్చింది. స్పేస్ ఎక్స్ సీఎఫ్ఓ బ్రెట్ జాన్సెన్ వాటాదారులకు ఒక లేఖ రాశారు. ఐపీఓ ద్వారా సమీకరించే నిధుల్ని స్టార్ షిప్ రాకెట్ అభివృద్ధి, ఏఐ డేటా సెంటర్స్ వంటి లక్ష్యాల కోసం ఉపయోగించనున్నట్లు తెలిపారు. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా కంపెనీ 25 బిలియన్ డాలర్లకుపైగా సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది భారత కరెన్సీలో చూస్తే రూ. 2.25 లక్షల కోట్లకు పైనే ఉంటుంది. సౌదీ ఆరామ్‌కోను అధిగమించి ప్రపంచంలోనే అతిపెద్ద ఐపీఓల్లో ఒకటిగా నిలవనుందన్న అంచనాలు జోరందుకున్నాయి.

## రూ.150లక్షలకోట్లతో ఇన్‌ఫ్రాపైప్‌లైన్ ఏర్పాటు?

### కేంద్రానికి పారిశ్రామిక మండలి సిఐఐ ప్రతిపాదన

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** పెట్టుబడుల ఆధారిత ఆర్థికవృద్ధిని మరింత సాధించేందుకువీలుగా వచ్చే బడ్జెట్‌లో సంస్కరణలు తీసుకురావాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ కేంద్రానికి సూచించింది. కొత్త బడ్జెట్‌లో పెట్టుబడుల వృద్ధికి ఆస్కారం ఇచ్చే మార్పులు చేర్పులు ఉండాలని ప్రతిపాదించింది. మూలధన వ్యయాన్ని 12శాతం పెంచాలని సూచించింది. అలాగే రాష్ట్రాలకు కూడా ఈ వ్యయం పది శాతంపెంచాలని 2026-32 ఐదేళ్ల కాలానికిగాను 150 లక్షలకోట్లతో నేషనల్ ఇన్‌ఫ్రా పైప్‌లైన్ (ఎన్ఐపి)ని ప్రారంభించాలనిసూచించింది. పెట్టుబడులపరంగా గణనీయమైన రికార్డుసాధించిన కంపెనీలకు పన్నులరూపంలో కొంత ఊరటకల్పించాలనికోరాయి. అలాగే ఎన్ఆర్ఐ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్‌ఫండ్‌ఌ ఏర్పాటుచేయాలని, కొత్త మూలధన వ్యయం పెంచేందుకువీలుగా ఎంఎస్ఎంఇలకుఇతర ఉత్పత్తి రంగాలకు కూడా ప్రోత్సాహకాలుండాలని, కనీస ప్రత్యామ్నాయ పన్ను జోలికి వెళ్లకుండా రాయితీలు ఉండాలని సూచించారు. ఆర్థికవృద్ధికి ప్రైవేటు, విదేశీ పెట్టుబడులు అత్యవసరమని తదుపరి వృద్ధిదశను అధిగమించాలంటే ఎంతో కీలకం అవుతుందని అన్నారు. ఇందుకోసమే ప్రభుత్వ ప్రైవేటు సంస్థను ఏర్పాటుచేసి 49శాతం ప్రభుత్వ వాటాను ఏర్పాటుచేయాలనిసూచించారు. అలాగే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు రెండునెలలనుంచి మూడునెలల్లోపే ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ లభించేలా చూసుకోవాలని, భారీ స్థాయి పెట్టుబడులకు కూడా ఈ సూత్రం వర్తింపచేయాలని సిఐఐ కేంద్రానికి ప్రతిపాదనలుచేసింది. కొత్త సంవత్సరంలో పెట్టుబడుల ఆధారిత ఆర్థిక వృద్ధి వ్యూహం ఎంతో అవసరమని సంస్థాగత సంసనకరణలు భారత తదుపరి అభివృద్ధి దశను నిర్దేశిస్తాయని సిఐఐ విశ్లేషించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# ప్రత్యేక పాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి....

## ఎంఎల్సీ బొమ్మి ఇజ్రాయిల్



**అమలాపురం,డిసెంబర్14,(ప్రభాతవార్త** మహిళలపై ,మైనర్ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం వీలైనంత తొందరగా కఠినమైన చర్యలు తీసుకోవడమే కాకుండా ప్రత్యేక పాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి త్వరగా శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు.మన రాష్ట్రంలో యువత,పురుషులు కల్తీ మద్యానికి,గంజాయికి మత్తుపదార్థాలకు బానిసలై నైతిక విలువలు,మానవత్వాన్ని మరిచి మత్తులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడు తున్నారన్నారు.దీనికోసం ప్రత్యేకంగా అన్ని విద్యా కేంద్రాల యందు విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, నైతిక విలువలు సామాజిక విలువలు, కుటుంబ విలువలపై అవగాహన కల్పిస్తూ కౌన్సెలింగ్ ఇవ్వాలని, విద్యాసంస్థలు,గవర్నమెంట్, ప్రైవేట్ ఆఫీసుల నందు టోల్ ఫ్రీ నెంబర్ లపై అవగాహన కల్పించాలని సూచించారు.గత నెల రోజుల క్రితం ఐ.పోలవరం మండలం బాణాపురం గ్రామంలో ఒక మైనర్ బాలికపై ఒక ప్రబుద్ధుడు కీచక పర్వం మరువకముందే గత 15 రోజుల క్రితం మమ్మిడివరం మండలం తానేలంక గ్రామంలో బాలికల వసతి గృహము నుండి ఒక స్త్రీ సహాయముతో విద్యార్థినిని కిడ్నాప్ చేసి అఘాయిత్యానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఉప్పలగుప్తం మండలం కూనవరం గ్రామం నందు కామంతో కళ్ళు మూసుకుపోయి కన్న కూతురిపైనే కన్నేసి పలుమార్లు భయపెట్టి అఘాయిత్యానికి పాల్పడిన వాడిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కేసులు అన్నింటిలో కూడా జిల్లా ఎస్పీ ప్రత్యేకమైన శ్రద్ధ చూపించి ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేసి వీలైనంత తొందరగా విచారణ జరిపి శిక్ష పడేలాగా తగుచర్యలు తీసుకోవాలని స్త్రీలు, మైనర్ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిపై పోలీసు వారు రౌడీ షీట్ ఓపెన్ చేసి వీరి కదలికలపై నిఘా ఉంచకపోతే సమాజానికి చాలా ప్రమాదముగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు.అవసరం అనుకుంటే జిల్లా ఎస్పీ కలెక్టర్ కలిసి మైనర్ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వ్యక్తులపై పీడి యాక్ట్ ప్రయోగించి తీవ్రమైన శిక్షలు విధించి సమాజంలోని స్త్రీలను మైనర్ బాలికలను రక్షించాలని డిమాండ్ చేశారు.

## డాక్టర్ చిట్టిబాబు నిర్వహిస్తున్న వైద్య సేవలు అభినందనీయం



**కొత్తపేట, డిసెంబర్ 14,(ప్రభాతవార్త)** నెలనెలా పేద సామాన్య వర్గాల వారికి సహాయం చేసేందుకు తన కుమారుని పేరిట వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న డాక్టర్ బండారు పెదవెర్రియ్య (చిట్టిబాబు) చేస్తున్న వైద్య సేవలు అభినందనీయమని నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ అన్నారు శ్రీ బండారు పేరుమ్మ గారి స్వామి గారి అన్నదాన సత్రం చైర్మన్ డా.బండారు పెద వెర్రియ్య (చిట్టిబాబు) పుట్టిన రోజు సందర్భంగా ఉచిత మెగా శిబిరం స్వచ్ఛంద రక్త దాన శిబిరం నిర్వహించారు ఈ వైద్య శిబిరాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీనివాస్ ప్రారంభించారు కొత్తపేట సందీప్ ఐ క్లినిక్ వద్ద శిబిరాన్ని ప్రారంభించారు ఈ వైద్య శిబిరం వివిధ వైద్య శాఖలకు చెందిన వైద్యులు తమ తమ సేవలను అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు అలాగే ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు పలువురు యువకులు రక్త దానం చేశారు ఈ కార్యక్రమంలో వాడపాలెం మాజీ సర్పంచ్ బండారు బుల్లి తాత టిడిపి సీనియర్ నేత మాజీ ఉప సర్పంచ్ కంఠంశెట్టి శ్రీనివాసరావు బిజెపి రాష్ట్ర నాయకుడు పాలూరి సత్యానందం బిజెపి మండల శాఖ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరావు కొత్తపేట సొసైటీ అధ్యక్షులు కంఠంశెట్టి చంటి చీకట్ల అబ్బు చీకట్ల రామారావు వాడపాలెం గ్రామ జనసేన అధ్యక్షులు చిన్న గంగరాజు వైద్యులు నాయకులు ఈ శిబిరం లో పాల్గొన్నారు

## అన్నయ్య పేటలో కాపు కళ్యాణ మండపం



**రామచంద్రపురం, డిసెంబర్14 (ప్రభాతవార్త):** ద్రాక్షారామం అన్నయ్య పేట గ్రామంలో నిర్మించిన కాపు కళ్యాణ మండపాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి మంత్రి వాసంశెట్టి సుభాష్,ఎంపీ బోస్,ఎం ఎల్ సి తోట త్రిమూర్తులు,జనసేన ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్,ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ చేతుల మీదుగా మండపం ప్రారంభం జరిగింది.మండపం నిర్మాణానికి పిల్లి సుభాష్ చంద్రబోస్ ఎంపీ లాడ్స్ నుంచి రూ.30లక్షలు,గతంలో ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు రూ.25లక్షలు నిధులతో కళ్యాణ మండపం నిర్మాణం పూర్తిచేశారు.గ్రామ సర్పంచ్ పెమ్మిరెడ్డి నాగేశ్వరరావు(దొరబాబు) అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.కళ్యాణమండపంలో భోజనశాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తానని మంత్రి సుభాష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసిపి ఇంచార్జ్ పిల్లి సూర్య ప్రకాష్,మున్సిపల్ చైర్ పర్సన్ గధంశెట్టి శ్రీదేవి శ్రీధర్,ఎంపీపీ అంబటి భవాని,వైఎస్ ఎంపీపీ శాఖా బాబి,వైఎస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి,సర్పంచులు అనిశెట్టి రామకృష్ణ,అంబటి తుకారాం,సతీష్ కుమార్,సలాది శ్రీనివాసరావు,పెమ్మిరెడ్డి మురళీకృష్ణ అత్యధిక సంఖ్యలో గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు...

## లోవ శ్రీ తలుపులమ్మ అమ్మవారి దేవస్థానానికి పోటెత్తిన భక్తులు



**తుని, డిసెంబర్ 14,(ప్రభాతవార్త )** రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజల్లుతున్న తుని మండలం లోవ శ్రీ తలుపులమ్మ అమ్మవారి దేవస్థానానికి అమ్మవారి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన ఆదివారం రోజు కావడంతో అమ్మవారిని దర్శించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుండే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చక స్వాములు పలు రకాల పుష్పాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించి తరించారు. అనంతరం భక్తులు వంటావార్పు గావించి భోజనాలు చేశారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి పెన్మత్స విశ్వనాథరాజు మాట్లాడుతూ 16వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించారన్నారు. వసతి గదులు, ప్రసాదాలు అమ్మకం, దర్శన టికెట్ల ద్వారా 6 లక్షల 8వేల 804రూపాయల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ఎటువంటి సౌకర్యం కలగకుండా ఈఓ విశ్వనాథరాజు పర్యవేక్షణలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## కాంగ్రెస్ నేత కృష్ణమూర్తికి ఘన నివాళి



**అమలాపురం, డిసెంబర్14, ప్రభాతవార్త** దివంగత మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన నివాళులు అర్పించారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ పార్లమెంట్ సభ్యులు కృష్ణమూర్తి డిల్లి లో తుది శ్వాస విడిచారు.ఫ్లైట్ లో రాజమండ్రి తీసుకువచ్చి స్వగ్రామం రావిగుంట చెరువు తీసుకువచ్చారు.అక్కడ నుండి జనిపిల్లె లోని గుడౌన్స్ వద్దకు ఊరేగింపు గా తీసుకువచ్చి ప్రజలకు సందర్శనార్థం వుంచారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కృష్ణమూర్తి పార్థిక దేహానికి కాంగ్రెస్ జెండాను కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.కుసుమ కష్ణమూర్తి మూడుసార్లు అమలాపురం పార్లమెంట్ సభ్యునిగా చేసి కోనసీమ అభివృద్ధికి పాటుపడ్డారు.ఇందిరా గాంధీ కుటుంబానికి ఎంతో సన్నిహితులుగా పేరొందారు. బ్యాంకింగ్ రిక్రూట్మెంట్ చైర్మన్గా గా పనిచేసిఎంతోమంది నిరుద్యోగుల కు ఉద్యోగ అవకాశాలు కల్పించారు.1986లో వరదలు వచ్చినప్పుడు రాజీవ్ గాంధీ ని పర్యటింప చేసి వరదల వలన నష్టపోయిన రైతాంగాన్ని, నష్టపోయిన పేద కుటుంబాలను కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి వారిని ఆదుకున్నారు.కాంగ్రెస్ పార్టీ గొప్ప నిబంధన కలిగిన నాయకుడిని కోల్పోయిందని కాంగ్రెస్ పార్టీ వక్తలు కొనియాడారు.ఎంఎల్ఏ గిడ్డి సత్యనారాయణ,మాజీ మంత్రి పివి రాఘవులు,మాజీ ఎంపీ లు ఏజెవిబీ మహేశ్వరావు, హర్షకుమార్, పిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరి శ్రీనివాస్, అసెంబ్లీ ఇన్చార్జ్ అయితాబత్తుల సుభాషిణి, కుడిపుడి శ్రీనివాస్,ముషిణి రామకృష్ణారావు,దేవరపల్లి రాజేంద్రబాబు,గెడ్డం సురేష్ బాబు,రాయుడు రమణ, రాయుడు భవాని, అయితాబత్తుల కుమార్ సింగ్ మొదలగు వారు పాల్గొన్నారు .

## యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

### మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి.

**ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, డిసెంబర్ 14 (ప్రభాతవార్త) :** నేడు కలెక్టరేట్ లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం డిసెంబర్15న యథావిధిగా జరుగుతుందని, ఈ కార్యక్రమంలో దాఖలైన అర్జీల పురోగతి, తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో పీజీఆర్ఎస్ కార్యక్రమం డిసెంబర్ 15, సోమవారం ఉదయం 10 గంటల నుంచి 01 గంట వరకు కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో నిర్వహించ బడుతుందన్నారు. పీ జీ ఆర్ ఎస్ కి రాలేని అర్జీదారులు వారి యొక్క అర్జీలు %[illegible]% వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరవ్వాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. జిల్లా వాసులు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగలి కోరారు.

# నేడు శ్రీసత్యదేవుని మెట్లోత్సవం

- ఈనెల 16 తేధీ నుండి ధనుర్మాసం మహోత్సవాలు ప్రారంభం
- 30న ముక్కోటి ఏకాదశి



**అన్నవరం, డిసెంబర్ 14,(ప్రభాత వార్త).** కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో సోమవారం మెట్లోత్సవం కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీ స్వామివారి సన్నిధిలో ధనుర్మాసం మహోత్సవాలు డిసెంబర్ 16వ తేదీ నుండి ప్రారంభమై జనవరి 16వ తేదీ వరకు ప్రత్యేక ధనుర్మాసం వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. 15వ తేదీ మార్గశిర బహుళ ఏకాదశి, సోమవారము ఉదయం 7.00 గంటలకు శ్రీ స్వామి,అమ్మ వారికి గ్రామ సేవ నిర్వహించిన అనంతరం ఉదయం 9.00 గంటలకు మెట్లోత్సవం కొండ దిగువన గల శ్రీ కనక దుర్గ అమ్మవారి ఆలయం వద్ద నుండి ప్రారంభించి,ప్రతీ మెట్టు కు పూజలు చేసుకుంటూ, ప్రధాన ఆలయం మెట్లు వరకూ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొననున్నారు.

**ఈనెల 30 తేదీన ముక్కోటి ఏకాదశి**

రత్నగిరిపై ఈనెల 30న పుష్య శుద్ధ ఏకాదశి మంగళవారము, ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఉత్సవాలు జరుగనున్నాయి. ఆ రోజున శ్రీ స్వామివారి సన్నిధిలో ప్రతి సంవత్సరము వలే ముక్కోటి ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున 5.00 గంటల నుండీ ఉత్తరద్వార దర్శణం ప్రారంభిస్తారు. ముక్కోటి ఏకాదశి రోజున ఉదయం 11.00 గంటలకు వెండి రథంపై ప్రాకార సేవ మరియు రాత్రి కొండ దిగువ గరుడ వాహన సేవ, గ్రామోత్సవము నిర్వహిస్తారు. వచ్చే నెల 14.01.2026 తేదీన పుష్య బహుళ ఏకాదశి బుధవారము భోగి పండుగ సందర్భంగా రత్నగిరిపై శ్రీ రామాలయం వద్ద వార్షిక కళ్యాణ మండపం ఎదురుగా భోగి ఉత్సవములు,భోగిమంటలు కార్యక్రమం జరుగనుంది. పల్లెటూరి సాంప్రదాయ వాతావరణం ప్రతిభింబించే విధంగా కార్యక్రమములు వైభవంగా నిర్వహిస్తారు. 16.01.2026వ తేదీ పుష్య బహుళ త్రయోదశి, శుక్రవారము కనుమ పండుగ రోజున కొండ దిగువన వున్న బజారు సెంటర్ నందుగల పెరికల రామాలయం వద్ద సాయంత్రం నాలుగు గంటల నుండి ప్రభోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

## ఏలేశ్వరంలో తూర్పు కాపు ఆత్మీయ సమావేశం



**ఏలేశ్వరం, డిసెంబర్ 14 (ప్రభాతవార్త)** ఏలేశ్వరం పట్టణంలో స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో కాకినాడ జిల్లా తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు బంక కోదండరాం అధ్యక్షతన ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర తూర్పు కాపు సంఘ అధ్యక్షుడు పిసిని రామచంద్ర మోహన్,పట్టణ ప్రముఖ తూర్పు కాపు నాయకులు హాజరయ్యారు. ఈ మేరకు పట్టణ తూర్పు కాపు నాయకులు మాట్లాడుతూ ఏలేశ్వరంలో ఉన్నటువంటి తూర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్ లేక కేంద్ర ప్రభుత్వాల ఉద్యోగాలు,మెడికల్ సీట్లు కోల్పోతున్నారని,ఓబీసీ రిజర్వేషన్ వచ్చేందుకు పోరాటం చేయాలన్నారు. అలాగే అధిక శాతం తూర్పుకాపులున్న ఏలేశ్వరంలో కనీసం కమ్యూనిటీ హాల్ కూడా లేకపోవడం గమనార్హం అన్నారు. వెంటనే కమ్యూనిటీ హాల్ స్థలం కు నగర పంచాయతీ చైర్ పర్సన్ చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం పిసిని రామచంద్ర మోహన్ మాట్లాడుతూ తూర్పు కాపులకు ఓ బి సి రిజర్వేషన్ గత కొన్ని సంవత్సరాల నుంచి ధర్నాలు,వినతి పత్రాలు ఇవ్వడం జరుగుతుందని ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే తూర్పు కాపులకు ఓబీసి రిజర్వేషన్ ఇచ్చే ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పుకాపు నాయకులు అలమండ చలమయ్య,శిడం వెంకటేశ్వరరావు, పైల సుభాష్ చంద్రబోస్,సామంతుల సూర్య కుమార్,సుంకర రాంబాబు,కోరాడు ప్రసాద్,అలమండ నాగేంద్ర,సతివాడ రాజేశ్వరరావు,పైల విజయ్ కుమార్,సిరిపురపు రాజేష్,రాష్ట్ర తూర్పు నాయకులు,పట్టణ తూర్పు కాపు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో చెత్త నుండి సంపద కేంద్రం ఏమైంది..

- అటకెక్కిన తడి పొడి చెత్త సేకరణ
- గత నిర్మాణం శిథిలమై తుప్పలు, దొంకలు మధ్య మొండి స్తంభాలు మిగిలాయి..
- నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడుకు చెత్త వేసేందుకు జాగా లేని వైనం



**ప్రత్తిపాడు,డిసెంబరు14( ప్రభాతవార్త)** నియోజకవర్గ కేంద్రం ప్రతిపాడులో చెత్త చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ఉందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. గత టిడిపి ప్రభుత్వం హయాంలో అప్పట్లో నిర్మాణం చేపట్టిన అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం చెత్త నుండి సంపద తయారీ కేంద్రం నిర్వహణ పట్టించుకోకపోవడంతో ప్రతిపాడు లోని ఈ కేంద్రం శిథిలమై తుప్పలు, దొంకలు మధ్య మొండి స్తంభాలతో మిగిలింది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు మళ్లీ వినియోగంలోకి తీసుకువచ్చారు. ప్రతిపాడు లో మాత్రం అటకెక్కించారు. ఇక్కడి కేంద్రం నిర్వహణలో లేకపోయినా గత ప్రభుత్వం నుండి నిర్వహణ పేరుతో నిధులు లాగేస్తున్నారని సమాచారం. మండలంలోని సంపద కేంద్రాలను డి ఎల్ పి ఓ, డిపిఓ లు సందర్శించిన సందర్భంగా ఉన్నా ప్రత్తిపాడులో నిర్వహించాల్సిన సంపద కేంద్రంపై పట్టించుకోవడం లేదు. దీంతో ఆ స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. చెత్త సేకరణ కేంద్రం ఏమైంది అన్న విషయం జిల్లా, మండల స్థాయి అధికారులకు పట్టడం లేదు. శిథిలాల్లో మొండి స్తంభాలతో కనపడుతున్న డంపింగ్యార్డు చుట్టూ చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండి ఉంది. చెత్త సేకరణ అటకెక్కింది. చెత్త సేకరణ రిక్షాలను మూలనపడేశారు. తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్యార్డుల్లో వేరుచేసి ఎరువులు తయారు చేయాలని గతంలో చెప్పిన అధికారుల మాటలు నీటి మూటలయ్యాయి. పంచాయతీ ట్రాక్టర్తో సేకరించిన చెత్తను తీసుకెళ్లి గ్రామ శివారులోని పోస్తున్నారు. సీజనల్ వ్యాధులపై ఉన్నతాధికారులు గంటల తరబడి సమావేశాలు పెట్టి పంచాయతీ అధికారులను ఆదేశిస్తున్నా.. వీరు మాత్రం ప్రజల ఆరోగ్యం విషయంలో ఎలాంటి శ్రద్ధ చూపటం లేదని స్పష్టమవుతున్నది. మరోపక్క పరిశుభ్రత విషయంలో ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు ఇస్తున్నారని తెలుస్తున్నది. ఇందుకు కారణం ఉన్నతాధికారులు గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడమే అని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

**సేకరించిన చెత్తను ఎక్కడ వేయాలో తెలియక తలలు పట్టుకుంటున్న అధికారులు..**

నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో సేకరించిన చెత్తను ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితిలో పంచాయతీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. నియోజకవర్గంలో ఉన్న మండలాలకు గ్రామాలకు ఆదర్శంగా ఉండాల్సిన ప్రత్తిపాడు పంచాయతీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఊరి మధ్యలో ఉన్న గోవిందరాజుల చెరువు వ్యాధులకు నిలయంగా మురికితో కంపు కొడుతుంది. గతంలో అభివృద్ధి దిశగా ఈ చెరువులో పనులు ప్రారంభించిన తదనంతరం దానిని వదిలేయడంతో దుర్గంధపరితంగా మారింది. గ్రామంలోని సమస్యలపై అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



**అమలాపురం,డిసెంబర్14,ప్రభాతవార్త** రంకిరెడ్డి కాశి విశ్వనాథం బాడీ బిల్డింగ్,ఫిజిక్ స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ పోస్టర్ను అసోసియేషన్ ప్రతినిధులు ఆవిష్కరించారు.జనవరి12వ తేదీన జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రంకిరెడ్డి కాశి విశ్వనాథం బాడి బిల్డింగ్,ఫిజిక్ స్పోర్ట్స్ చాంపియన్ షిప్2026 పోటీలను ఆఫీసర్ రిక్రియేషన్ క్లబ్ అమలాపురంలో నిర్వహిస్తున్నట్లు కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వంటెద్దు వెంకన్న నాయుడు తెలియజేసి పోటీలకు సంబంధించిన పోస్టర్ను అసోసియేషన్ ప్రతినిధుల సమక్షంలో ఆవిష్కరించారు.ఈ పోటీల వివరాలను సెక్రెటరీ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలుపుతూ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుండి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొంటు న్నారన్నారు.బాడీ బిల్డింగ్, మాస్టర్స్, ఫిజిక్స్ స్పోర్ట్స్ విభాగాల్లో12 క్యాటగిరీలలో పోటీలను నిర్వహించి ప్రధమ,ద్వితీయ, తృతీయ స్థానాలలో గెలుపొందిన వారికి నేషనల్ షీల్డ్స్, మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్, నగదు పురస్కారాలను బహుకరిస్తామని తెలిపారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎనుముల కృష్ణ పద్మరాజు,జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పప్పుల శ్రీరామచంద్రమూర్తి,కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నగబేరి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు గారపాటి చంద్రశేఖర్, అమలాపురం మండలం వైస్ ఎంపీపీ అడపా వెంకట సుబ్రహ్మణ్యం,అసోసియేషన్ మెంబర్స్ మట్టపర్తి వెంకట సముద్రం,నార్ని శ్రీను,చిక్కం రాజబాబు పాల్గొన్నారు.

## పాత్రికేయుడు సుబ్బారావు కవిగా రాణించడం అభినందనీయం

### కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

### జాతీయ కవితా పోటీల్లో టాప్ 20 విజేతగా సుబ్బారావు



**కొత్తపేట, డిసెంబర్ 14,(ప్రభాతవార్త)** అధ్యాపకుడు పాత్రికేయుడు నటుడు గాయకుడు డాక్టర్ వి వి వి ఎస్ సుబ్బారావు జాతీయ కవితా పోటీల్లో టాప్ 20 విజేతగా రావడం అభినందనీయమని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు అన్నారు 36 ప్రపంచ రికార్డులు సాధించిన శ్రీ శ్రీ కళావేదిక ఇటీవల ఆన్లైన్ జాతీయ కవితా పోటీలు నిర్వహించారు "దగ్గరవుతున్న దూరాలు"(బంధాలు,బంధుత్వాలు) అనే అంశంపై నిర్వహించిన కవిత పోటీల్లో కొత్తపేటకు చెందిన డాక్టర్ సుబ్బారావు తన ప్రతిభను కనబరిచి టాప్ 20 విజేతగా నిలిచారు ఆ మేరకు శ్రీశ్రీ కళావేదిక అధినేత కళా రత్న డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సంస్థ జాతీయ అధ్యక్షురాలు జి ఈశ్వరి భూషణం జాతీయ కార్యవర్గ అధ్యక్షుడు నూక సంపత్ కుమార్ జాతీయ సోషల్ మీడియా కన్వీనర్ నల్ల భాగ్యలక్ష్మి లు విజేత సుబ్బారావు ను అభినందిస్తూ మెమొంటోను పంపించారు ఇదే సంస్థ గతంలో నిర్వహించిన తెలుగు కీర్తి కిరీటం ఎన్టీఆర్ అనే అంశంపై సుబ్బారావు టాప్ టెన్ విజేతగా నిలిచారు, ఆ(అపూర్వ బాల్యం) అనే అంశంపై కవితను అందించి టాప్ టెన్ విజేతగా నిలిచారు అలాగే మరో కవితా సంస్థ ఇటీవల ని ర్వహించిన జాతీయ కవితా పోటీల్లో టాప్ 20 విజేతగా నిలిచారు దానిని పురస్కరించుకుని గౌరవ శాసనసభ్యులు బండారు సత్యానందరావు టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్ తదితరులు కవి సుబ్బారావు అభినందించారు

## భీమోలును భయబ్రాంతులకు గురి చేస్తున్న పెద్దపులి ?



**గోపాలపురం డిసెంబర్ 14, (ప్రభాతవార్త):** గోపాలపురం మండలం, భీమోలులో పెద్దపులి సంచరిస్తుందన్న వార్త అందరిని భయంబ్రాంతులకు గురి చేస్తుంది. భీమోలు గ్రామానికి చెందిన కొందరు రైతులు తమ కొండ ప్రాంతంలో పులిని చూసినట్లు సమాచారం ఇవ్వడంతో జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ దావీదురాజు తన బృందంతో కలిసి భీమోలు కొండ ప్రాంతాన్ని పరిశీలించారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ.. పులి అడుగు జాడలను నిసితంగా పరిశీలించారు. ఆనవాళ్లు ఎక్కడ కనిపించ లేదన్నారు, అయితే ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి హెచ్చరించారు. ఆనవాళ్లను కనుక్కునేందుకు ఆరు ట్రాక్కింగ్ కెమెరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటికే గ్రామంలో టాంటాం వేయించామన్నారు. ఒంటరిగా ఎవరు కూడా తిరగొద్దని, ఉదయం 10 గంటలు దాటిన తర్వాత పొలాలకు వెళ్లాలని, సాయంత్రం 5 గంటలకు పొలాల నుండి రైతులు ఇంటికి చేరుకోవాలని సూచించారు. డిఆర్ఓ జి.వేణుగోపాల్, ఎఫ్బిఓ శ్రీనివాస్, రిస్క్ టీం తదితరులు పాల్గొని పులి ఆనవాళ్లను పరిశీలించారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు



**యు.కొత్తపల్లి, (ప్రభాతవార్త):** మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటేష్ హెచ్చరించారు. మండలంలోని ఉప్పాడలో ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇరువురి పై కేసులు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ప్రమాదాలకు కారణం అవుతారన్నారు. తద్వారా ఆర్థికంగా, ఆరోగ్యపరంగానూ నష్టపోతారన్నారు. అలాగే మైనారిటీ తీరని వారు వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అటువంటి వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేసి చర్యలకు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరంగా ఉపేక్షించయన్నారు.

## హిందువుల ఐక్యమత్యంగా ముందుకు సాగాలి

### కత్తిపూడిలో ఘనంగా హిందూ సమ్మేళనం




**శంఖవరం డిసెంబర్ 14 ప్రభాతవార్త** సమాజ శ్రేయస్సు కోసం హిందువులు ఏకధాటిపై నడిచి హిందువుల ఐక్యతను చాటాలని, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు పేర్కొన్నారు. మండలంలోని కత్తిపూడి లో గల వర్తక సంఘ కళ్యాణ మండపంలో ఆదివారం ప్రత్తిపాడు ఖండ, కత్తిపూడి సంఘమండలం హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహణ సమితి సభ్యులు మాట్లాడుతూ పురాణాలు ఇతిహాసాలు సాంప్రదాయాలు, ప్రభావంతో సనాతన ధర్మం ప్రారంభమైందని, ఈ సనాతన ధర్మం ప్రతి రూపమే హిందూ సమ్మేళమన్నారు. ముఖ్యంగా సనాతన ధర్మం పాటించినప్పుడే సమాజం బాగుంటుందన్నారు. ఇప్పటికే కొంతమంది వారి విధానాల కోసం ప్రజలును మభ్యపెడుతున్నారని అందులో యువత ముందుకు రావడంతో వారి విధానాలకు బానిసలుగా మారుతున్నారని, ఇలాంటి విధానం మంచివి కావని పేర్కొన్నారు .భారతదేశ సమైక్యతకు ప్రతిరూపం హిందూ సమ్మేళమని ప్రతి మనిషి వారి విధానాలను సక్రమంగా అలవర్చుకోవాలని పేర్కొన్నారు. భారత్ ఎప్పటికీ సత్యం నైతిక స్పష్టత అనే లక్ష్యాలను జీర్ణం చేస్తుందని తెలియజేశారు. భారతదేశానికి ఆత్మ ప్రాణం హిందూ ధర్మము అని హిందూ సాంస్కృతి రక్షించి హిందూ సమాజం చైతన్యవంతం చేసే సమైక్యపరిచే ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర స్వయం సేవక సంఘం ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం హిందువులు గర్వించ దగ్గ విషయం అన్నారు. వ్యక్తులు సామూహికంగా లేకపోతే శక్తి ఉద్భవించదని ఐక్యత సంస్థగతంగా సంఘటనాత్మక శక్తిగా నిలబడే సామర్థ్యం వల్ల శక్తి వస్తుందని పేర్కొన్నారు సమస్యలపై అధిక దృష్టి సాధించకుండా, పరిష్కార మార్గాలపై చురుగ్గా పనిచేయాలని తెలియజేశారు. అనంతరం చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గౌతు అర్జిబాబు కోట కృష్ణకుమార్ జగన్నాథ్ ద్విభాష్యం ప్రేమ జ్యోతి రమణమూర్తి జ్యోతుల గంగాభవాని శ్రీను బండారు సత్యనారాయణమూర్తి జీలకర్ర చక్ర కామేశ్వరరావు గజ్జి సుబ్రహ్మణ్యం హిందూ సమ్మేళ నిర్వహణ సమితి సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ సర్వసభ్య సమావేశం




**కె.గంగవరం,డిసెంబర్ 14, (ప్రభాతవార్త):** మండలం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాగమణి సుబ్బారావు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించబడినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు ఈ సమావేశానికి ఎంఈఓ, ఎంఆర్ఓ, మా మండల వ్యవసాయ అధికారి డిఆర్డిఏ ఏపీఎం ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు,ప్రజా ప్రతినిధులు, అంగన్వాడి సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు ,సంబంధిత మండల అధికారులు హాజరైనారు.

## థ్రెడ్ ఆర్ట్‌లో ఎమ్మెల్యే బండారు చిత్రపటం....

### అభినందించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...



**ఆత్రేయపురం,డిసెంబర్, 14,(ప్రభాత వార్త)** థ్రెడ్ ఆర్ట్ లో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చిత్రపటాన్ని రూపొందించిన ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామానికి చెందిన యువకులు వాడపాలెంలో ఆయన కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బండారుకు బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ థ్రెడ్ ఆర్ట్ ను యూట్యూబ్ లో చూసి నేర్చుకుని ఈ చిత్రాన్ని రూపొందించినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే బండారు కొత్తపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, అందుకు అభిమానంతో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు వారు తెలిపారు. ఈ థ్రెడ్ ఆర్ట్ ను ఆయన ఎంతగానో మెచ్చుకున్నారని యువకులు తెలిపారు. యూట్యూబ్ లో నేర్చుకునే ఇంత అద్భుతంగా రూపొందించడాన్ని ప్రశంసిస్తూ ఎమ్మెల్యే యువకులను అభినందించారు. ఈ ఆర్ట్ కు మరింత ప్రోత్సాహం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. యువకులను బహుమతిని అందజేశారు. గ్రామ కుటమి నాయకులు సొసైటీ అధ్యక్షులు తోటకూర సుబ్బరాజు, వీరబాబు రాజు, ఉన్నారు.

## భారతదేశ సంస్కృతి ప్రపంచానికే ఆదర్శం.



**మామిడికుదురు.డిసెంబర్ 14(ప్రభాతవార్త)** మన దేశ సంస్కృతి,సాంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శమని శృంగవృక్షం పిఠాదిపతి సాయిదత్త నాగానంద సరస్వతి స్వామీజీ పేర్కొన్నారు. మండల పరిధిలోని గోగన్నమఠం గ్రామంలో ఆదివారం హిందూ సమ్మేళనం సభ జరిగింది.నిర్వహణ సమితి అధ్యక్షులు భూపతిరాజు సత్యనారాయణ రాజు(సత్తిబాబు రాజు)అధ్యక్షతన జరిగిన సభలో స్వామీజీ మాట్లాడుతూ అన్ని మతాలను సమానంగా చూడమని హిందూ మతం చెబుతుందన్నారు.కుల,మత ప్రాంతాలకు అతీతంగా అంతా ఐక్యంగా ఉండాలన్నదే లక్ష్య మన్నారు.ప్రపంచ దేశాల్లో సైతం మన ఆచార వ్యవహారాలకు ఎంతో గుర్తింపు గౌరవం ఉందన్నారు.సనాతన ధర్మ పరిరక్షణ మన అందరి బాధ్యత అన్నారు.రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆ మహాయజ్ఞాన్ని స్వీకరించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవడం మన అందరికీ ఆనందదాయకం అన్నారు.ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కోలాటం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను మంత్ర ముగ్దుల్ని చేశాయి. ఈసభలో ఆర్ఎస్ఎస్ సహజ సంఘటన మరియు సేవలో వందేళ్ల పుస్తకాలను సభకు పరిచయం చేశారు.రాజమండ్రి గోదావరి విభాగ్ ప్రచారక్ సోమజీ కుల వృత్తుల వారిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అల్లు విజయలక్ష్మి,సమితి ఉపాధ్యక్షులు సాగి పాపయ్యరాజు,కశిరెడ్డి వెంకట పేరయ్య, కాండ్రేగులవెంకటరెడ్డి, కార్యదర్శి ఆదుర్తి విద్యా సాగర్,సహాయ కార్యదర్శులు యెరుబండి లక్ష్మయ్య, నామన వెంకన్నబాబు, భూపతి గంగాధరరావు వేలాది సంఖ్యలో భక్తులు,మహిళలు పాల్గొన్నారు.

## గోపాలపురం యూనిట్ అధ్యక్షునిగా జోడాల



**గోపాలపురం డిసెంబర్ 14, (ప్రభాతవార్త):** గోపాలపురం ఏపీఎన్జీవో యూనిట్ ఎన్నిక గోపాలపురం మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. గోపాలపురం ఏఎస్ఓగా పని చేస్తున్న జోడాల వెంకటేశ్వరరావు యూనిట్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. సెక్రటరీగా పి.పాపారావు, సహాధ్యక్షులుగా డీ.మమ్మీ, ఉపాధ్యక్షులుగా వీర్రాజు, వెంకటేశ్వర బాబు, జే.తిరుపతిరావు, సహాయ కార్యదర్శులుగా ఆశాపల్లి, తారక రమేష్, శ్రీనివాస ప్రసాద్, ట్రెజరర్ గా నరసింహ రాజు, ఈసీ మెంబర్లుగా సురేఖ, సుజన ప్రియ, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, ప్రసన్న కుమార్ లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సేవా ప్రవీణ్ కుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అర్హత కమిటీ చైర్మన్ మీసాల మాధవరావు కన్వీనర్ అనిల్ కుమార్, జిల్లా సభ్యులు వెంకటరమణ, దేవరపల్లి తాళ్లపూడి గోపాలపురం మండలాల ఉద్యోగస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జోడాల మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఒకటో తేదీనే జీతం చెల్లించాలని, డిఏలను విడుదల చేయాలని, పిఆర్సి కమిషన్ ఏర్పాటు చేసి పిఆర్సి అందించాలని, ఉద్యోగులకు పదోన్నతులు అందించాలని, పదవీ విరమణ చేసే ఉద్యోగులకు అదేరోజు అన్ని బెనిఫిట్స్ ను అందించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

## మన ఊరు మన బాధ్యత .... వినూత్న కార్యక్రమానికి వాడపల్లి దేవస్థానం చైర్మన్ శ్రీకారం...



**ఆత్రేయపురం, డిసెంబర్, 14,(ప్రభాత వార్త)** మన ఊరు మన బాధ్యత అనే వినూత్న కార్యక్రమానికి వాడపల్లి దేవస్థానం చైర్మన్ మాజీ టిడిపి అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రామస్తులతో కలిసి ఆత్రేయపురం గ్రామంలో పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మురుగనీటి డ్రైన్లను శుభ్రపరచడంతో పాటు గ్రామస్తులు నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్) మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలు పరిశుభ్రత పాటించాలని అలాగే మన గ్రామ అభివృద్ధి మన బాధ్యత అని ప్రతి ఒక్కరూ ఆకాంక్షించినప్పుడే గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం ఏర్పడుతుందని అన్నారు. గ్రామంలో మన ఊరు మన బాధ్యత కార్యక్రమానికి విశేష స్పందన ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. యువకులు స్వచ్ఛందంగా మన ఊరు మన బాధ్యత కార్యక్రమంలో పాల్గొని చేయి చేయి కలిపి గ్రామ పరిశుభ్రతలో భాగస్వాములు అయ్యారు. ఈ కార్యక్రమంలో మంతెన ఆనందరాజు, వేగేశ్న ప్రసాదరాజు,చంపాటి ధర్మరాజు, నారాయణరావు, ముదునూరి సురేష్ రాజు, శ్రీనివాసరాజు, అడ్డాడ సాంబమూర్తి రాజు, చేకూరి రమేష్ రాజు, ముదునూరి గోపాల రాజు, శ్రీనివాసరాజు, గోపిరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వీరవరం లో మెగాగ్రాండ్‌గా క్రిస్టమస్ వేడుకలు

### సమాజంలో ప్రేమ, శాంతికి ప్రతీక క్రిస్టమస్: స్టాలిన్



**కడియం, డిసెంబరు 14 (ప్రభాతవార్త)** క్రిస్టమస్ పండుగ సమాజంలో ప్రేమ, శాంతి, సోదరభావాలను పెంపొందించే మహత్తర పండుగ అని జేగురుపాడు సర్పంచ్, మండల వైఎస్సార్సీపీ పార్టీ మండల అధ్యక్షులు యాదల సతీష్ చంద్ర స్టాలిన్ అన్నారు. ఆదివారం వీరవరంలో రెవ. సాక యేసుపాదం, రిబ్కా ఆధ్వర్యంలో బైబిల్ మిషన్ మెగాగ్రాండ్ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్టాలిన్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరూ ఐక్యతతో ముందుకు సాగాలని, సేవా భావనతో సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం వివిధ సంఘాల నుంచి వచ్చిన పాస్టర్లు రెవ. కె. విజయకుమార్, రెవ. ప్రకాశ్, రెవ. రాజారావు, రెవ. ఏసురత్నం, రెవ. రత్నాకర్ తదితరులు వాక్యోపదేశం చేశారు. క్రిస్మస్ పండుగ యొక్క ఆధ్యాత్మిక ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సన్నిధి స్త్రీలు, బీఎంసీ యూత్, సంఘ పెద్దల ఆధ్వర్యంలో ప్రేమవిందు, నాటికలు, క్రిస్మస్ గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

## ప్రకృతే పరమాత్మ కడియం నర్సరీలు జీవన బడులు

### కడియం నర్సరీలను సందర్శించిన బ్రహ్మశ్రీ చాగంటి



**కడియం, డిసెంబరు 14( ప్రభాతవార్త )** ప్రకృతిలోనే పరమాత్మ నివసిస్తాడని, ప్రతి మొక్క మనిషికి జీవన విలువలను నేర్పుతుందని ప్రభుత్వ సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం తన శిష్యుడు మల్లు విష్ణు ఆహ్వానం మేరకు కడియపులంకకు విచ్చేశారు. ఈ సందర్భంగా నర్సరీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, నర్సరీ అధినేత మల్లు పోలరాజు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నర్సరీలను సందర్శించి నర్సరీలోని వివిధ రకాల అలంకార, ఔషధ మొక్కలు, అరుదైన జాతి వృక్షాలను పరిశీలించి , వాటి పెంపకం, సంరక్షణ విధానాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేవలం నర్సరీ కాదు జీవనాన్ని మలిచే బడి" అని వ్యాఖ్యానించారు. ప్రకృతి మనకు సహనం, సహజత్వం, సేవాభావాన్ని నేర్పుతుందనీ, ఇలాంటి అద్భుతమైన మొక్కలను ప్రేమతో, ఓర్పుతో పెంచుతున్న కడియం రైతులు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ప్రకృతితో మమేకమై జీవిస్తే మనసు పవిత్రమవుతుందనీ, మొక్కల సంరక్షణ ఒక యజ్ఞంతో సమానమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, ప్రముఖ రచయిత దేవవరపు నీలకంఠరావు, నర్సరీ సంఘం డైరెక్టర్ మల్లు శివ, నర్సరీ నిర్వాహకులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## టిడిపిలోకి వెళ్ళను, వదంతులు నమ్మవద్దు: బ్రహ్మపురి వైసిపి ఎంపీటీసీ



**కె.గంగవరం, డిసెంబర్ 14, (ప్రభాతవార్త):** గంగవరం మండలం మసకపల్లి,బ్రహ్మపురి, శేరిలంక గ్రామాలకు సంబంధించిన వైఎస్ఆర్సిపి ఎంపీటీసీ కొండేపూడి భవాని, అప్పారావును కొంతమంది టిడిపిలోకి రమ్మని ఫోన్ చేస్తున్నారని తెలిపారు. కొంతమంది నేను టిడిపిలోకి వెళ్తున్నానని అనుకుంటున్నారని, కానీ నేను పార్టీ గుర్తు మీద గెలిచినందున వైఎస్ఆర్సిపి లోనే కొనసాగుతానని తెలిపారు. రామచంద్రపురం ఇంచార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ను కలిసిన కొండేపూడి భవాని,అప్పారావులు ఇలాంటి అసత్య ప్రచారాలు నమ్మవద్దని, అవి కేవలం కల్పితమేనని, నేను అలాంటి వ్యక్తిని కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## మురారి కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించేందుకు పోటెత్తిన భక్తులు



**గండేపల్లి డిసెంబర్ 14(ప్రభాతవార్త):** మెట్ట ప్రాంతంలోని కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా ప్రసిద్ధి చెందిన మురారి కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించేందుకు ఆదివారం భక్తులు వేలాదిగా తరలివచ్చారు.దీంతో జగ్గంపేట సి ఐ వై ఆర్ కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో గండేపల్లి ఎస్సై యు వి శివ నాగబాబు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.అమ్మవారి ఆలయానికి వెళ్ళే దారిలో ట్రాఫిక్ అంతరాయము కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

## సాయి హాస్పిటల్ లో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన



**గండేపల్లి డిసెంబర్ 14(ప్రభాతవార్త):** గండేపల్లి మండలం జెడ్ రాగంపేట శివారు సాయి హాస్పిటల్ నందు జగ్గంపేట అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.ఆంధ్రప్రదేశ్ విపత్తుల స్పందన,అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ చెల్లే అనిల్ కుమార్, ఎల్ ఎఫ్. జి జగదీష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు స్పందించే అంశాలపై పూర్తి అవగాహన కల్పించారు.ముఖ్యంగా డీసీపీ సిలిండర్, సి ఓ 2 సిలిండర్ వినియోగం గురించి సాయి హాస్పిటల్ సిబ్బంది కి ఫైర్ సిబ్బంది క్లాసులు చెప్పి వారికి పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాయి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ముండ్రు ఎర్రబాబు,సందీప్,సతీష్, అగ్నిమాపక అధికారులు కే వి వి శేఖర్, ఎన్ వి వి సత్యనారాయణ,సాయి హాస్పిటల్ సిబ్బంది,అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రంధాలయ విస్తరణకు కృషి..ఈశ్వరరాజు వర్మ



**మామిడికుదురు.డిసెంబర్ 14 ప్రభాతవార్త** జిల్లాలో గ్రంధాలయ సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ పేర్కొన్నారు.ఆదివారం గోగన్నమఠం గ్రామంలో తూ.గో.జిల్లా గ్రంధాలయ సంస్థ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆకుల శివ రామకృష్ణ,ఉపాధ్యక్షులు ముమ్మన దుర్గారావు, కార్యదర్శి పి.నాగేశ్వరావు,సంఘం సభ్యులు వై.ప్రభాకర్ నూతనంగా నియమితులైన చైర్మన్ వర్మను కలసి శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు ఎంపిపి కడలి శ్రీదుర్గ కూటమి నేతలు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

## టీడీపీ సోషల్ మీడియా శ్రేణులు స్పీడ్ పెంచాలి..

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ
- నియోజకవర్గ సోషల్ మీడియా సభ్యులతో సమావేశం..



**ప్రత్తిపాడు,డిసెంబరు14(ప్రభాతవార్త)** ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పార్టీ సోషల్ మీడియా సభ్యులు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు తెలిసేలా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ వేగం పెంచాలని ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ అన్నారు. ఆదివారం పెదశంకర్లపూడి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సోషల్ మీడియా సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి సోషల్ మీడియా సభ్యులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువయ్యేందుకు సోషల్ మీడియా శ్రేణులు కృషి చేయాలన్నారు. చేస్తున్న మంచి పనులు సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరవేసే విషయంలో వెనకబడుతున్నామని అన్నారు. దివంగత నేత వరుపుల రాజా సోషల్ మీడియా అకౌంట్లు విశేష ఆదరణతో లక్షల మంది అభిమానులు పార్టీ శ్రేణులు ఉండేవారని దురదృష్టవశాస్తూ రాజా పేరు మీద ఉన్న సోషల్ మీడియా అకౌంట్లో హ్యాక్ అయ్యాయని వాటిని తిరిగి పునరుద్ధరించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా విఫలమయ్యాయి అన్నారు. నియోజకవర్గంలోని సోషల్ మీడియా శ్రేణులు పూర్తిగా యాక్టీవ్ అవ్వాలని ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ప్రతి ఇంటికి చేరేలా కీలక పాత్ర పోషించాలని కోరారు. పార్టీపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని సమన్వయంతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

## ర్యాలి శ్రీ జగన్మోహినికేశవస్వామి ఆలయంలో

# 16 తేదీ నుండి ధనుర్మాసం మహోత్సవాలు...

### ఈఓ, బాగవతుల రమణమూర్తి.



**ఆత్రేయపురం,డిసెంబర్, 14,(ప్రభాత వార్త)** స్వయంభూ క్షేత్రం ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి దేవస్థానం నందు. డిసెంబర్ 16 తేదీ మంగళవారం నుండి జనవరి 14తేదీ బుధవారం వరకు ధనుర్మాస మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్. మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, తెలిపారు. కావున ఈ నెల రోజులు ధనుర్మాసం మహోత్సవాలకు రూ.500/-లు చెల్లించిన భక్తుల గోత్రం నామాలతో శ్రీ స్వామి వారికి ధనుర్మాసం నెల రోజులు ప్రాతఃకాలార్చన జరిపిస్తామని. రూ.250/-లు చెల్లించిన భక్తుల గోత్రనామాలతో ముక్కోటి ఏకాశి రోజున శ్రీ స్వామి వారికి పంచామృత అభిషేకం, సహస్రనామార్చన జరిపిస్తామని. కావున యావన్మంది భక్తులు, గోత్రనామములు ముందుగ నమోదు చేసుకోవాలని, రశీదు పొంది శ్రీ స్వామి వారి ఆశీస్సులు పొందవలసినదిగా కోరారు.రాజమహేంద్రవరం చెందిన డా. త్రిపురనేని రాజేష్ కుమార్ స్రవంతి దంపతులు స్వామి వారిని దర్శించుకొని శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.10,116/- వేలు. విరాళంగా అందించారు. దాతలకు ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేయించి, ఆలయ కార్యనిర్వహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, శ్రీ స్వామి వారి చిత్రపటం అందజేశారు.

## మోడరన్‌లో అచీవర్ అవార్డుల ప్రధానం




**రామచంద్రపురం,డిసెంబర్14(ప్రభాతవార్త):** ఆదివారం మోడరన్ అచీవర్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా జరిగింది.ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి. వి.రావు మాట్లాడుతూ నవంబర్ 30వ తేదీన నిర్వహించిన మోడరన్ అచీవర్ స్కాలర్షిప్ ఎంపిక కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందని, 1480మంది విద్యార్థులు వివిధ హైస్కూల్ నుండి ఎంపిక కార్యక్రమానికి హాజరు అయ్యారని పేర్కొన్నారు.వీరిలో 146 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఆదివారం వారికి పురస్కారాలు అందజేసామన్నారు.విజేతలకు ఎలైట్, ప్లాటినం,డైమండ్,గోల్డ్, సిల్వర్ క్యాటగిరి అవార్డులను అందజేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల,తల్లిదండ్రుల ఆసక్తి మేరకు ఇంటర్మీడియట్ కోర్సు తమ కళాశాలలో చదివినట్లయితే ఫీజులో రాయితీ ఇస్తున్నట్టు స్పష్టం చేశారు.ప్రతి అకాడమిక్ ఇయర్ నందు ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడమే కాక, ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి పరీక్షలైన జేఈఈ, నీట్, అలాగే రాష్ట్రస్థాయి ఈఏపి సెట్ నందు అత్యుత్తమ ర్యాంకులు,పర్సంటైల్ సాధిస్తున్నట్లు తెలిపారు.పేరెంట్స్ తీసుకునే ఒక మంచి నిర్ణయమే విద్యార్థులకు గొప్ప భవిష్యత్తును కలుగజేస్తుందని ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ సి. హెచ్. రాజేష్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ వైస్ ప్రిన్సిపాల్ పి.ఎస్.ప్రకాష్,అకాడమిక్ అడ్వైజర్ సి.హెచ్.శ్రీనివాస్ తో పాటు జెఈఈ /నీట్ స్టాఫ్ పాల్గొన్నారు...

## హెల్మెట్ వినియోగం పై అవగాహన

**రామచంద్రపురం,డిసెంబర్14(ప్రభాతవార్త):** హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.హెల్మెట్ వినియోగం పై ఆదివారం వేగాయ్యమ్మపేట జంక్షన్ లో డ్రైవ్ నిర్వహించారు.వాహన చోదకులకు హెల్మెట్ వాడకం పై అవగాహన కల్పించారు.హెల్మెట్ ప్రాణానికి రక్షణ కవచమని అన్నారు.ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని సూచించారు.

## 16 నుంచి వెంకన్న ఆలయంలో ధనుర్మాసోత్సవాలు...

### భక్తులతో శోబిల్లిన వాడపల్లి క్షేత్రం. స్వామివారి ఒక్కరోజు ఆదాయం, రూ, 10,లక్షలు.



**ఆత్రేయపురం, డిసెంబర్, 14,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్న గా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం వేలాది మంది భక్తులతో శోభిల్లింది. ఆదివారం కావడంతో ఏడువారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజ, పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. వెంకన్న ఆలయంలో 16 నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఉత్సవాలు అనంతరం వచ్చే ఏడాది జనవరి 14న (భోగి రోజు) గోదారంగనాథుల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తణుకు చెందిన మోటపర్తి సూర్య వెంకట కృష్ణ శేషగిరిరావు, కాదంబరి సత్యవాణి, దంపతులు వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 1,00,116/- లక్ష. విరాళంగా అందించారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ, 10లక్షలు కు పై గా ఆదాయం సమాకూరినట్లు దేవస్థానం అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలియజేసారు.

## మెడికవర్ హాస్పిటల్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు



**కాకినాడ రూరల్,డిసెంబర్ 14 (ప్రభాతవార్త):** స్థానిక అచ్చంపేట జంక్షన్ సమీపంలో కాకినాడ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ విశేష గుర్తింపు పొందిన మెడికవర్ హాస్పిటల్స్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు చేతులు మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మెడికవర్ హాస్పిటల్స్ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని, ఆధునిక వైద్య సదుపాయాలతో పాటు అనుభవజ్ఞులైన వైద్యుల సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆరోగ్య పై అవగాహన పెంపొందించే విధంగా రూపొందించిన ఈ క్యాలెండర్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడ సెంటర్ హెడ్ శుభాకర రావు, మీడియా కోఆర్డినేటర్ సుకుమార్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రబీలో ప్రతీ ఎకరాకు సాగునీరు అందుతుంది

### జనసేన నాయకులు రామస్వామి, సునీల్, దొరబాబు



**యు.కొత్తపల్లి, డిసెంబర్ 14 (ప్రభాతవార్త):** రబీ పంటకు సంబంధించి సాగునీటికి లోటు రాదని, ప్రతీ ఎకరానికి అందించడానికి కృషి చేస్తున్నామని గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, ఎండపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో నారుమడులకే నీరు అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఆదివారం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, నీటి పారుదల శాఖ(పీబీసీ) డీఈఈ సంతోష్ కుమార్ రైతులతో సమావేశం నిర్వహించారు. సాగునీరు అందకపోవడంతో దాళ్వా పంట ఆలస్యం అవుతుందని రైతులు వారి దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఠాపురం బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) పరిధిలో సుమారు 30వేల ఎకరాల ఆయకట్టు సాగవుతుందని, ప్రతీ ఎకరానికి సాగునీరు అందించడానికి నీటిపారుదల అధికారులతో కలిసి కృషి చేస్తున్నామన్నారు. సాగునీరు ఇప్పటికే విడుదల చేయడం జరిందని స్థానికంగా అందుకోవడానికి రెండు, మూడు రోజులు పడుతుందన్నారు. కొన్ని చోట్ల కాలువలు మరమ్మతులు కారణంగా ఆలస్యం అయిందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వైద్యులు జ్యోతుల శ్రీనివాస్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా లక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ రావు చిన్నారావు, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, గుండ్ర జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

## అటల్ బిహారీ వాజపేయి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



**కాకినాడ రూరల్, డిసెంబర్ 14(ప్రభాతవార్త):** బీజేపీ సీనియర్ నేత, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహ ఏర్పాటుకు ఆదివారం భూమి పూజ చేశారు. కాకినాడలోని రామారావు పేట మూడు లైట్లు జంక్షన్ వద్ద రాజా ట్యాంక్ ప్రాంగణంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు భూమి పూజలో బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు. రాజా ట్యాంక్ ప్రాంగణంలో వాజపేయి నిలువెత్తు విగ్రహాన్ని ఈ నెల 21వ తేదీన ఏర్పాటు చేస్తామని 25వ తేదీన ఆయన జయంతిని భారీగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ వాజపేయి హయాంలో భారతదేశం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. అందుకని ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఈ ప్రాంగణాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. వేదమంత్రోచ్చారణతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేతలు ఎనిమిరెడ్డి మాల కొండయ్య, పైడా కృష్ణమోహన్, పైడా భావన ప్రసాద్, వేటుకూరి సూర్యనారాయణ రాజు, మాజీ కార్పొరేటర్లు గోడి సత్యవతి, సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ తుమ్మల పద్మ, నాయకులు గోడి వెంకట్, గూటూరు పద్మ, గట్టి సత్యనారాయణ, కర్రి సత్యనారాయణ, కుండల సాయికుమార్, అనపర్తి వెంకటేష్, చక్కా రమేష్, అరిపిరాల శ్రీనివాస్, శంకర్ సింగ్, కే గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ సత్యదేవుని రధోత్సవం



**అన్నవరం,డిసెంబర్ 14, (ప్రభాత వార్త).** కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఆదివారం శ్రీ సత్యదేవుని రధోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు శ్రీస్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకముల సుగంధభరితమైన పుష్పములు, ఆభరణములతో అలంకరించి రధవాహనంపై ఆశీనులు గావించారు.దేవస్థానం అధికారులు కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు.వేదపండితుల మంత్రోచ్చరణ, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారం చుట్టూ ముమ్మార్లు ప్రదక్షిణ గావించారు.రధోత్సవం వెంట సత్యదేవుని నామస్మరణతో భక్తులు అనుసరించారు.ఈ కార్యక్రమంలో ,ఆస్థాన వేధ పండితులు,వ్రత పురోహితులు,ఆలయ అర్చకులు దేవస్థానంఅధికారులు భాస్కర్, పర్వత నరేష్, మాజీ పాలకమండలి సభ్యులు పేరూరి బదరీనారాయణ,సిబ్బంది,అధిక సంఖ్యలో భక్తులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రా భద్రాద్రి క్షేత్రం ప్రారంభానికి చిన జీయర్ కు ఆహ్వానం..

### సీతానగరం ఆశ్రమంలో కలిసిన ఆంధ్రా భద్రాద్రి క్షేత్ర కమిటీ సభ్యులు

### ఆలయ ప్రారంభోత్సవానికి ముహూర్తం పెట్టాలని కోరిన కమిటీ





**ప్రత్తిపాడు,డిసెంబరు14(ప్రభాతవార్త) :** ప్రత్తిపాడులో నూతనంగా నిర్మితమవుతున్న తూలగిరి శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి దేవస్థానం (ఆంధ్రా భద్రాద్రి) అభివృద్ధి కమిటీ సభ్యులు విజయవాడ (సీతానగరం)లో చిన జీయర్ స్వామి ఆశ్రమంలో గల విజయకీలాద్రి లో చిన్న జీయర్ స్వామిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు జీయర్ ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ప్రత్తిపాడులో జాతీయ రహదారిని ఆనుకుని నిర్మాణపు పనులు చివరి దశలో ఉన్న తూలగిరి శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి క్షేత్ర ప్రారంభోత్సవానికి దివ్యమైన ముహూర్తాన్ని ఖరారు చేసి,ఆ పుణ్యకార్యం చిన్న జీయర్ స్వామి వారి చేతుల మీదుగా జరిపించాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆయనను ఆహ్వానించారు.గతంలో జరిగిన ఒక ఆధ్యాత్మిక కార్యక్రమానికి వచ్చిన సందర్భంలో ఇచ్చిన మాట ప్రకారం శ్రీ సీతారాముల విగ్రహాల ప్రాణ ప్రతిష్టకు మంచి ముహూర్తం పెట్టడంతో పాటు మీ ఆహ్వానాన్ని మన్నించి తప్పక విచ్చేస్తానని చిన్న జీయర్ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు తెలియజేశారు. ఆయనను కలిసిన వారిలో అనంతపల్లి శ్రీనివాస్,సరళ దంపతులు,చాట్ల పుష్పా రెడ్డి, వెలుగూరి హరే రామ్,తేజోమూర్తుల సుబ్రహ్మణ్య శర్మ,పచ్చారి సూర్యప్రసాద్, కాలపురెడ్డి శ్రీనివాస్, కనపర్తి (తిరుమల శ్రీను),నేతి శ్రీనివాసరావు,కొమ్ముల లక్ష్మి, పొట్టి రమ తదితరులు ఉన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps